మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 54 • పేజీలు:12+16 • వెల: రూ.5 మంగళవారం • 23-1-2018 www.manamnews.com /manamnews



1% కుబేరుల వద్ద 73% సంపద

దేశంలో పెరుగుతున్న ఆదాయ అంతరం..

ధనవంతుల చేతుల్లోకి మరింత సంపద

పేదరికంలో మగ్గుతున్న 67 కోట్ల మంది

అంతర్జాతీయ సంస్థ ఆక్స్‌ఫామ్ సర్వేలో వెల్లడి

7లో..

మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అరెస్ట్

2008 గుజరాత్ బాంబు పేలుళ్ల నిందితుడు


ప్రధాన నగరాల్లో బాంబు దాడుల్లో హస్తం

ఢిల్లీలో పట్టుబడిన 'భారత్ బిన్ లాడెన్' ఖురేషి

సిమి, ముజాహిదీన్ సంస్థలతో సంబంధాలు

చెక్కు చెదరలే!

టీఆర్ఎస్ బలం యథాతథం.. లోక్‌సభ ఎన్నికల్లో 12 స్థానాలు



- 3 చోట్ల బీజేపీ.. కాంగ్రెస్‌కు 2
- ఏపీలో తిరగబడ్డ జాతకాలు
- 13 చోట్ల వైఎస్ఆర్‌సీపీ హవా
- టీడీపీ-బీజేపీ కూటమికి 12
- జాతీయ స్థాయిలో ఎన్డీయేకు 335
- ఈసారి యూపీఏ గెలిచే స్థానాలు 89
- రిపబ్లిక్ టీవీ-సీ ఓటర్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 22:

ఈ ఏడాది చివర్లో... లేదా వచ్చే సంవత్సరంలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ బలం పెద్దగా చెక్కు చెదరబోదని సర్వేలు చెబుతున్నాయి. ఆ ఎన్నికలలో టీఆర్ఎస్ 12 లోక్‌సభ స్థానాలలో గెలుస్తుందట. సీనియర్ పాత్రికేయుడు అర్ణబ్ గోస్వామి సొంతంగా స్థాపించిన రిపబ్లిక్ టీవీ... సీ ఓటర్ సంస్థతో కలిసి చేసిన సంయుక్త సర్వే ఫలితాలు చూస్తే ఇది ఖాయమనిపిస్తోంది. తెలంగాణలో బీజేపీ మూడు లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకుంటుందని, కాంగ్రెస్ రెండుచోట్ల గెలుస్తుందని ఈ సర్వేలో చెప్పారు. నిజానికి క్షేత్రస్థాయిలో చూస్తే బీజేపీ కంటే కాంగ్రెస్ సంస్థాగతంగా బలంగా కనిపిస్తోంది. నాయకులు కూడా ఆ పార్టీలోనే చురుగ్గా కనిపిస్తున్నారు. కానీ సర్వే వివరాలు మాత్రం ఇందుకు భిన్నంగా వచ్చాయి. 2014 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా మోదీ హవా నడిచినా, తెలంగాణలో మాత్రం బీజేపీకి ఒకే ఒక్కస్థానం దక్కింది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా బీజేపీ కేవలం ఐదు డివిజన్లలోనే గెలిచింది. పార్టీకి నగర పరిధిలో ఐదుగురు ఎమ్మెల్యేలున్నా.. ప్రయోజనం ఏమీ కనిపించలేదు. కానీ ఈసారి మూడు ఎంపీ స్థానాలు ఎలా వస్తాయో సర్వే చేసినవాళ్లే చెప్పాలి.

ఏపీలో జగన్ దూకుడు

అధినేత తర్వాత పార్టీలో చెప్పుకోదగ్గ బలమైన నాయకులు ఎక్కువమంది కనిపించకపోయినా.. క్షేత్రస్థాయిలో బలం ఎంతుందన్నది ఇం కా తెలియకపోయినా మిగతా 6లో..



భారత్‌కు.. ఎస్-400 క్షిపణులు

39 వేల కోట్లతో కొనుగోలు?

రష్యాతో భారత ప్రభుత్వ చర్చలు

త్వరలో కుదరనున్న ఒప్పందం

4 క్షిపణులకు రక్షణ శాఖ ఆర్డర్

న్యూఢిల్లీ, జనవరి 22:

భారత వాయుసేనలో అత్యాధునిక క్షిపణులు చేరబోతున్నాయి.. రష్యాకు చెందిన ఎస్-400 క్షిపణుల రాకతో రక్షణ వ్యవస్థ మరింత పటిష్టం కానుంది. భారత గగనతలంలోకి అక్రమంగా ప్రవేశించే శత్రువుల విమానాలను, క్షిపణు లను మధ్యలోనే అడ్డగించి కూల్చివేసేందుకు ఈ మిస్సైల్స్ ఉపయోగపడతాయి. రూ.30 వేల కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించి రష్యా నుంచి ఈ క్షిపణుల కొనుగోలుకు రక్షణ శాఖ చర్చలు జరుపుతోంది. ఎస్-400 మిస్సైల్స్‌ను కొనుగోలు చేయాలని గతంలోనే నిర్ణయించింది. ఈ ప్రక్రియ ప్రస్తుతం చివరి దశలో ఉంది. కొనుగో లు చర్చలు పూర్తయి ఒప్పందం కుదుర్చుకుంటే.. 54 నెలల్లో ఎస్-400 క్షిపణులు నాలుగు రక్షణ శాఖకు అందుతాయి. కాగా, చైనా కూడా ఈ క్షిపణులను కొనుగోలు చేసింది. 2016 లో ఒప్పందం కుదుర్చుకున్న చైనా ఇటీవలే క్షిపణులను అందుకుంటోంది. ఆరు క్షిపణుల కొనుగోలుకు ఒప్పందం కుదరగా.. ప్రస్తుతం వాటిని చైనా అందుకుంటోంది. సముద్ర మార్గంలో ఈ మిస్సైల్స్ ను డెలివరీ చేస్తున్న క్రమంలో గత వారం తుఫాను ధాటికి కొన్ని క్షిపణులు దెబ్బతిన్నాయని సమాచారం. చైనాతో పాటు టర్కీ, సౌదీ మిగతా 6లో..

ఇదీలోకం!



ఇక నుంచి ఏదైనా చాలా జాగ్రత్తగా మాట్లాడాలి గురూ..!

పుస్తకాల పండుగ




పుస్తక ప్రదర్శన సందర్భంగా కిటకిటలాడుతున్న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం

రెండుచోట్లా పోటీ

తెలంగాణ అంటే నాకెంతో ప్రేమ

- దశాబ్దాల పోరాటం తర్వాత రాష్ట్రం
- ఇక్కడ కూడా నాకు అభిమానులు
- సమస్యల పరిష్కారానికే రాజకీయాలు
- ఎవరి లబ్ధి కోసమూ పార్టీ పెట్టలేదు
- తెలంగాణ సమస్యలపై అధ్యయనం
- అన్ని జిల్లాల కార్యకర్తలతో చర్చ
- ప్రభుత్వానికి సూచనలు చేస్తాం
- పార్టీతో చిరంజీవికి సంబంధం లేదు
- ప్రస్తుతం సినిమాలపై దృష్టి లేదు
- జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్
- కొండగట్టు అంజన్న దర్శనం



కరీంనగర్, జనవరి 22 (మనం న్యూస్ బ్యూరో):

తెలంగాణ అంటే తనకు ఎంతో ప్రేమ, అభిమానం ఉందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చెప్పారు. దశాబ్దాల పోరాటం తర్వాత ఏర్పడిన రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, వాటిపై తమ పార్టీ బృందం అధ్యయనం చేస్తోందని వెల్లడించారు. అన్ని జిల్లాల కార్యకర్తలతో సమావేశం అవుతున్నానని, వారితో సమస్యలపై చర్చించి.. వాటి పరిష్కారాలపై ప్రభుత్వానికి సూచనలు చేస్తామని తెలిపారు. సోమవారం జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని పవన్ దర్శించుకున్నారు. అనంతరం ఆయన తన రాజకీయ ప్రణాళికను మీడియాకు వివరించారు. దశాబ్దాల పోరాటం తర్వాత ఆవిర్భవించిన తెలంగాణలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిపై తమ పార్టీ బృందం అధ్యయనం చేస్తోందని చెప్పారు. ఇక్కడ సమస్యలపై అవగాహన ఉన్న మేధావులతో జనసేన చర్చిస్తోందని, వారు పార్టీలో మిగతా 6లో..



పవన్‌కు ఇంటి వద్ద హారతిచ్చి యాత్రకు సాగనంపుతున్న భార్య అన్నా లెజ్నేవా

ఎన్నారైలే అంబాసిడర్లు

రాష్ట్రంలో విద్యుత్ వచ్చింది.. కాంగ్రెస్‌కు పవర్ పోయింది

- 'బంగారు తెలంగాణ'తో కలిసి రండి
- ప్రపంచానికి పరిచయం చేయండి
- పెట్టుబడులు ప్రవాహంలా రావాలి
- రాష్ట్రానికి, కంపెనీలకు మీరే సంధానకర్తలు
- జ్యూరిక్ ఎన్నారైలతో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, జనవరి 22(మనం న్యూస్): బంగారు తెలంగాణ సాధనలో ఎన్నారైలు కలిసి రావాలంటూ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. స్విట్జర్లాండ్ పర్యటనలో భాగంగా జ్యూరిక్‌లో తెలంగాణ ప్రవాసీలు ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తూ.. తెలం గాణ రాష్ట్రానికి ఎన్నారైలే అంబాసిడర్లని పేర్కొన్నారు. ప్రవాసీలు అడిగిన పలు ప్రశ్నలకు జవాబులిచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి, రాష్ట్రాన్ని ఇతర దేశాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు పరిచయం మిగతా 6లో..



ఎన్నారైలతో సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో మంగళవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి తీవ్రత కొంత తగ్గుతుంది. గంటకు 11 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 31 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 15 డిగ్రీలు

గాలిలో తేమ: 62 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథిః షష్ఠి సా. 4.40 తదుపరి సప్తమి; నక్షత్రం : ఉత్తరాభాద్ర ఉ. 8.06 తదుపరి రేవతి; వర్జ్యం : రా.8.19 - 9.57; దుర్ముహూర్తం : ఉ.9.07 - 9.52, మ.2.20 - 3.04; రాహుకాలం : మ.3.15 - 4.39; అమృతఘడియలు : తె.3.08 - 4.48; శుభసమయం : సా.4.40 - 6.00;

సూర్యోదయం : 6.53, సూర్యాస్తమయం : 6.03

Dwaraka

తెలంగాణలో 'పద్మావత్' సెగ

- సినిమాను అడ్డుకుంటాం: కర్ణిసేన తెలంగాణ విభాగం
- టివోలి థియేటర్‌పై దాడి, పోస్టర్ల చించివేత
- అదో చెత్త సినిమా : ఎంపీ అసదుద్దీన్



హైదరాబాద్, జనవరి 22 (మనం న్యూస్): దేశవ్యాప్తంగా పద్మావత్ సినిమాపై జరుగుతున్న నిరసనల సెగలు తెలంగాణకు చేరాయి. రాష్ట్రంలో పద్మావత్ సినిమా ప్రదర్శనను నిషేధించాలని రాజ్‌పుత్ కర్ణిసేన తెలంగాణ విభాగం డిమాండ్ చేస్తోంది. ఈమేరకు సికింద్రాబాద్‌లోని టివోలి థియేటర్‌పై కొంతమంది దాడిచేసి పద్మావత్ సినిమా పోస్టర్లు చింపివేయడంతో పాటు దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సినిమా రాజపుత్‌ల మనోభావాలను దెబ్బతీస్తుందని, సినిమాను నిషేధించాలని కర్ణిసేన తెలంగాణ అధ్యక్షుడు ఠాకూర్ రణ్‌వీర్ సింగ్ చౌహాన్ అన్నారు. తెలంగాణలో సుమారు 5 లక్షల మంది వరకు రాజపుత్‌లు ఉన్నారని ఆయన చెప్పారు. కాగా సుప్రీం కోర్టు అనుమతితో చిత్ర నిర్మాతలు ఈ నెల 25న సినిమాను దేశవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. రాష్ట్రంలో సినిమా ప్రదర్శనను అడ్డుకుని తీరుతామని చౌహాన్ పేర్కొన్నారు. ప్రభుత్వం సినిమాపై నిషేధం విధించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్, హైదరాబాద్ కలెక్టర్ యోగితా రాణాకు వారు లేఖలు రాశారు. సినిమాను ప్రదర్శిస్తే థియేటర్లు తగల బెట్టాలని బీజేపీ నాయకుడు రాజాసింగ్ ఠాకూర్ హెచ్చరించన విషయం తెలిసిందే.

అదో చెత్త: ఒవైసీ

పద్మావత్ సినిమా ఓ చెత్త అని, ముస్లింలు దానిని బహిష్కరించాలని ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముసల్మీన్ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పిలుపునిచ్చారు.

మంచిర్యాల కలెక్టరేట్‌లో వ్యక్తి ఆత్మహత్య

- ఫిర్యాదులపై స్పందన లేకపోవడంతో అఘాయిత్యం
- మృతదేహంతో వివిధ పార్టీల నేతల ఆందోళన



మంచిర్యాల, జనవరి 22(మనం న్యూస్): మంచిర్యాల కార్యాలయంలో సోమవారం ఉదయం ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనిని ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించాడు. నెన్నెల మండలానికి చెందిన రంగు రామాగౌడ్ (40) ప్రజాదర్బార్‌లో పలు మార్లు ఫిర్యాదులు చేశాడని, వాటిపై స్పందన లేకపోవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. వారి కథనం ప్రకారం నెన్నెల మండలంలో కొందరు బీసీ కులాలకు చెందిన వ్యక్తులకు తహసీల్దార్ ఎస్సీ, ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు ఇచ్చారని, వారు వాటితో ప్రభుత్వ పథకాలను వినియోగించడంతో పాటు, ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలంటూ రామాగౌడ్ గతంలో ఫిర్యాదు చేశాడు. దీంతో కొందరు వ్యక్తులు స్థానిక నేతల అండతో రామాగౌడ్‌పై అట్రాసిటీ కేసు పెట్టారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని రామాగౌడ్ కలెక్టర్‌ను పలుమార్లు కోరాడు. ఇదే విషయమై సోమవారం ప్రజాదర్బార్‌కు వచ్చిన రామాగౌడ్ కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. కార్యాలయ సిబ్బంది అతనిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించాడు. మృతి విషయం తెలుసుకున్న బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ, వామపక్ష నాయకులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ గౌడ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా రమాగౌడ్ ఎనలేని సేవలు చేశాడన్నారు. టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసేవాడని, ప్రభుత్వ అణిచివేత ధోరణే రామాగౌడ్ మృతికి కారణమన్నారు.



మూడున్నరేళ్లలో ఒరిగిందేమీ లేదు

- హామీలు నెరవేర్చడంలో టీఆర్ఎస్ విఫలం
- టీ మాస్ సభలో బీఎల్ఎఫ్ కన్వీనర్ తమ్మినేని

ఖమ్మం, జనవరి 22(మనం న్యూస్ బ్యూరో): తెలంగాణ రాష్ట్రం వచ్చిన మూడున్నరేళ్లలో ప్రజలకు ముఖ్యంగా నిరుపేదలకు ఒరిగిందేమీ లేదని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. టీ మాస్ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మంలో జరిగిన సభలో తమ్మినేని ప్రసంగించారు. టీడీపీ, కాంగ్రెస్ పాలనలో విసిగి వేశారిన ప్రజలు టీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చారని, ఎన్నికల హామీలు నెరవేర్చడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. ఉద్యోగాల భర్తీ జరగడం లేదన్నారు. నిరుద్యోగులు అడ్డా కూలీలుగా మారుతున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమస్యలు నేటికీ అలాగే ఉన్నాయన్నారు. తెలంగాణలో దళితులపై దాడులు అధికమయ్యాని అన్నారు. ఈ నెల 25న బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పడనుందని, పాలకులను గద్దె దింపి, అధికారంలోకి వచ్చేందుకు పని చేస్తుందన్నారు. కాగా, కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నా చౌక్‌లో ధర్నా చేసి, సభా ప్రాంగణం వరకు ర్యాలీగా రావాలని టీ మాస్ ప్రతినిధులు భావించారు. కాగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ధర్నా చౌక్‌లో సభకు అనుమతి లేదని, పెవిలియన్ గ్రౌండ్‌లో ఉన్న నాయకులు, కార్యకర్తలు బయటకు రాకుండా గేట్‌కు తాళాలు వేశారు. దీంతో గ్రౌండ్‌లోనే సభ నిర్వహించారు. అయితే ప్రజా సమస్యల పరిష్కారానికి సభ ఏర్పాటు చేసుకుంటే పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం దారుణమని తమ్మినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సభలో టి.మాస్ జిల్లా అధ్యక్షురాలు జ్వలిత, కన్వీనర్ యర్రా శ్రీకాంత్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యమే లక్ష్యం

- బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం



హైదరాబాద్, జనవరి 22 (మనం ప్రతినిధి): నిరుద్యోగులు వివిధ రంగాల్లో స్థిరపడేందుకు వారికి వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం పేర్కొన్నారు. సోమవారం దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లో నాయీ బ్రాహ్మణులకు వృత్తి నైపుణ్య అభివృద్ధి శిక్షణా తరగతులను ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. నిరుద్యోగు లైన నాయీ బ్రాహ్మణ యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి రావాలని పిలుపునిచ్చారు. నాయీ బ్రాహ్మణ వృత్తి నైపుణ్య అభివృద్ధి శిక్షణకు 31 జిల్లాల నుంచి 650 యువతి యువకులను ఎంపిక చేశామన్నారు. మొదటి దశలో 160 మందికి మోడరన్ హెయిర్ స్టైల్, బ్యూటీఫికేషన్ కోర్సుల్లో 15 రోజుల శిక్షణను 6 అకాడమీలలో తెలంగాణ నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ద్వారా ఇస్తామన్నారు.



కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- త్వరలో టీచర్ పోస్టుల భర్తీ: డిప్యూటీ సీఎం కడియం

జగిత్యాల, జనవరి 22 (మనం న్యూస్): కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తామని డిప్యూటీ సీఎం, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని తాటిపల్లి టీఎస్ బాలిక రెసిడెన్షియల్ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మౌలిక వసతులపై ఆరా తీశారు. పాఠశాలలో డార్మెంటరీ, డైనింగ్ హాల్ నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో ఇంజనీరింగ్ అధికారులపై మండిపడ్డారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 470 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేస్తామన్నారు. 2018-19 విద్యా సంవత్సరంలో గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శరత్, చొప్పదండి ఎమ్మెల్యే బుడిగె శోభ, జేసీ రాజేశం, జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ సభ్యత్వం తీసుకున్న పొట్ల

ఖమ్మం, జనవరి 22(మనం న్యూస్): రాహుల్‌గాంధీ సమక్షంలో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు సోమవారం సతీసమేతంగా పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆయన భారీ ర్యాలీగా బయలుదేరి సంజీవ్‌భవన్‌కు చేరుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐతం సత్యాన్ని కలిసి పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా పొట్ల మాట్లాడుతూ టీఆర్ఎస్‌లో కుటుంబ నియంతృత్వ పాలనతో విసుగు చెందానని, రేణుకా చౌదరి ఆశీస్సులతో కాంగ్రెస్‌లో చేరానన్నారు. అదేవిధంగా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండాకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు రేణుకాచౌదరి సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు.

జీవకాలువగా గౌరవెల్లి

- ఏడాదిలోగా పునర్నిర్మాణ పనులు పూర్తి చేస్తాం
- ప్రాజెక్టు పూర్తైతే 40వేల కుటుంబాలకు లబ్ధి
- మరో 20 ఏళ్లు టీఆర్ఎస్‌దే అధికారం: హరీశ్‌రావు



సిద్దిపేట, జనవరి 22 (మనం ప్రతినిధి): గతంలో వరద కాలువ అని పేరొందిన గౌరవెల్లి త్వరలో జీవ కాలువగా మారుతుందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని గండిపల్లి, గౌరవెల్లి ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులను సోమవారం ఆయన భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 1.4 టీఎంసీలుగా ఉన్న గౌరవెల్లి ప్రాజెక్టు సామర్థ్యాన్ని టీఆర్ఎస్ సర్కార్ 8.26 టీఎంసీలుగా మార్చిందని, తక్కువ మందికి నష్టంతో వేల మందికి లబ్ధి చేకూర్చేలా ప్రాజెక్టు రీ డిజైన్ చేయటం జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో కలగా మిగిలిన ప్రాజెక్టు నిర్మాణాలు టీఆర్ఎస్ అధికారంలోగానే సాకారం చేస్తుందన్నారు. కాళేశ్వరం నుంచి నీరు మిడ్ మానేరు ప్రాజెక్టుకు వెళుతుందని, అక్కడి నుంచి గౌరవెల్లికి పంపింగ్ జరుగుతుందన్నారు. ఇందుకోసం మూడు 32 మెగావాట్ల సామర్థ్యం కలిగిన అతి పెద్ద పంపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2018 లోపు మిడ్‌మానేరు పూర్తి అవుతుందని, ఏడాది లోపు గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 80 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. గౌరవెల్లితో సంబంధం లేకుండా మిడ్‌మానేరు ద్వారా రాబోయే వర్షాకాలంలో కొహెడ్, చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లోని 30 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని తెలిపారు. 40 వేల కుటుంబాలుకు లబ్ధి చేకూర్చే ఈ ప్రాజెక్టుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. జిల్లాల పునర్విభజనలో హుస్నాబాద్ మండలం సిద్దిపేటలో కలిసి నష్టపోయిందంటూ ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేశాయన్నారు. హుస్నాబాద్‌లో అభివృద్ధి అత్యంత వేగంగా జరుగుతుందన్నారు హుస్నాబాద్‌ను మరో సిద్దిపేట చేసేదాకా తాను నిద్రపోనని మంత్రి హామీ ఇచ్చారు. తాను హుస్నాబాద్ పాత నియోజకవర్గం బిడ్డనేనని హుస్నాబాద్ ప్రజల తాగు, సాగు నీటి కష్టాలు తెలుసునని చెప్పారు. ఎవరు అవునన్నా, కాదన్నా మరో ఇరవై ఏళ్లు రాష్ట్రంలో టీఆర్ఎస్‌దే అధికారం అన్నారు. పదవి వస్తే పొంగిపోవడం కాదని, సేవకుడిలా ప్రజలతో మమేకం కావాలని అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు టీఆర్ఎస్ నేతల అందరూ శ్రమిస్తున్నారని హరీశ్ ఈ సందర్భంగా చెప్పారు. భూనిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.





చివరి భూములకు సాగునీరు

- కాల్వల్లో మోటార్లు తొలగించండి
- అక్రమంగా నీరు తోడితే చర్యలు
- ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్

కరీంనగర్, జనవరి 22(మనం న్యూస్ బ్యూరో): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చివరి భూములకు సాగునీరు అందించాలనే నిర్ణయంతో సింగూరు జలాలను తీసుకొస్తున్నామని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాగునీటి అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పోచంపాడు- ఎల్ఎండీ మధ్యలో ఉన్న కాలువల్లో రైతులు మోటార్లతో నీటిని తోడేయడం సమస్యగా మారుతోందని మంత్రి చెప్పారు. ఇలా 1174 మోటర్లు నీటిని తోడేస్తున్నాయని వివరించారు. ఈ మోటార్లను తొలగించాలని రైతులను కోరామని.. అయినా తొలగించకపోతే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సాగునీటి విషయంలో ఒక ప్రాంతంలో ఒక విధంగా మరో ప్రాంతంలో మరో విధంగా వ్యవహరించి ప్రతిపక్ష పార్టీలు రాజకీయ లబ్ది పొందాలని చూడడం శోచనీయమన్నారు. జగిత్యాల ప్రాంతంలో పెద్దపెద్ద మోటర్లను పెట్టి నీళ్లు తోడేస్తూ బావులు నింపుతుంటే.. పెద్దపల్లి ప్రాంతంలో నీళ్లివ్వాలని ధర్నాలు చేయడం ఏ మేరకు సబబో ఆ పార్టీ నేతలే ఆలోచించుకోవాలన్నారు. ఎస్సారెస్పీ ఈసారీ నిండనందున వ్యయ ప్రయాసాలకోర్చి ఎల్ఎండీలోకి నీటిని తీసుకొస్తున్నామని వివరించారు. ప్రతి నీటి చుక్కా రక్తపు బొట్టుతో సమానమన్నారు. తమ కడుపు నిండితే చాలనే భావనను విడిచిపెట్టి అందరికీ నీళ్లందేందుకు సహకరించాలని రైతులకు హితవు చెప్పారు. జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లు, పోలీసులతో సమావేశం ఏర్పాటు చేసి కాల్వలపైన ఉన్న మోటర్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీ చైర్మన్ ఈద శంకర్ రెడ్డి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఎమ్మెల్యే పుట్ట మధు, కరీంనగర్, పెద్దపల్లి కలెక్టర్లు,అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామిక విధానం భేష్

- కంపెనీ ప్రతినిధుల ప్రశంసలు
- వరంగల్ టెక్స్‌టైల్‌లో పెట్టుబడులు
- ఫ్యాషన్ సిటీగా హైదరాబాద్: వివేక్



హైదరాబాద్, జనవరి 22(మనం ప్రతినిధి): తెలంగాణ పారిశ్రామిక విధానం బాగుందంటూ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులు ప్రశంసిస్తు న్నారని ప్రభుత్వ సలహాదారు వివేక్ పేర్కొన్నారు. కేటీఆర్ పర్యటనలో పాల్గొన్న పలు కంపెనీల ప్రతినిధులు ఇదే విషయాన్ని చెబుతున్నారన్నారు. ఈమేరకు సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీఎస్ ఐపాస్ ద్వారా త్వరిత గతిన అనుమతులు ఇవ్వడంతోపాటు, వెన్వెంటనే నిర్మాణ పనులు చేపట్టే అవకాశం కల్పిస్తున్నట్టు ప్రతినిధులకు చెప్పామన్నారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు 2 పెద్ద కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చు కున్నామని తెలిపారు. తెలంగాణలో ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో తయారైన వస్తువులు ఇక్కడే అమ్ముకునేందుకు హైదరాబాద్‌ను ఫ్యాషన్ సిటీగా మారుస్తామని వివేక్ చెప్పారు. వ్యర్థాలతో విద్యుత్ తయారుచేసే పరిశ్రమ ఏర్పాటుకు జపాన్ లోని జెట్రో అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు. టీ హబ్ తరహాలో జపాన్‌లో ఒక ఐటీ హబ్‌ను, హైదరాబాద్‌లో కొరియా భాష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. మెట్రో ఫేజ్-2 నిర్మాణంపై జైకా సంస్థతో ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. 2018 నవంబరు కల్లా ఫేజ్-1, 2020 వరకు ఫేజ్-2 పూర్తి చేస్తామని తెలిపారు.

వీహెచ్‌వి తప్పుడు ఆరోపణలు..

లోథా కమిటీ సిఫారసులు ఏంటో తెలియకుండా వీహెచ్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వివేక్ అన్నారు. వీహెచ్‌కు వయసైపోయిందని, ఆయన మాటలకు విలువలేదన్నారు. అజారుద్దీన్ మంచి ఆటగాడేనని చిత్తశుద్ధితో క్రికెట్‌కు సలహాలు ఇస్తే తీసుకుంటామని తెలిపారు.

ఎమ్మెల్యే రోజా ఇంట్లో చోరీ



గచ్చిబౌలి, జనవరి 22(మనం న్యూస్): వైసీపీ ఎమ్మెల్యే, ప్రముఖ సినీ నటి రోజా సెల్వమణి ఇంట్లో దాదాపు రూ.5 లక్షల విలువ చేసే బంగారు, వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. రాయదుర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని మణికొండ పంచవటి కాలనీలో నివాసం ఉంటున్న రోజా సెల్వమణి దంపతులు జనవరి 11వ తేదీన కుటుంబంతో సహా చెన్నై వెళ్ళారు. ఆ మరుసటి రోజు ఇంటి పనిమనిషి రామలక్ష్మి ఇంటికి తాళం వేసి పక్కింట్లో ఇచ్చి వెళ్ళింది. జనవరి 18న తిరిగి రోజా దంపతులు ఇంటికి తిరిగి వచ్చారు. బెడ్‌రూంలోని చెక్క అల్మారాలో ఉంచిన భరణాలు మాయమైనట్లు 21వ తేదీన వారు గుర్తించారు. మొత్తం 14 తులాల బంగారు ఆభరణాలు, 2కిలోల వెండి ఆభరణాలు చోరీ అయినట్లు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

హైదరాబాద్, జనవరి 22 (మనం ప్రతినిధి): కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన నేతృత్వం వహిస్తున్న నాగార్జున సాగర్ నియోజకవర్గ పరిధిలోని నడమానూరు ఎంపీపీ దాసరి నరసింహ తదితరులు టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో ఆయనతోపాటు మరికొందరు టీఆర్ఎస్‌లో చేరారు.

కూతురితో సహా తల్లి ఆత్మహత్య

- భవనం మీద నుంచి దూకి బలవన్మరణం





హైదరాబాద్, జనవరి22 (మనం న్యూస్): మానసిక స్థితి సరిగా లేని ఓ మహిళ తన తొమ్మిది నెలల కూతురితో సహా ఆత్మహత్యకు పాల్పడింది. చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పీజేఆర్ ఎన్‌క్లేవ్‌లోని పెరల్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ముంటున్న స్వాతి(35) తన కూతురు శాన్వీ(9 నెలలు)తో కలిసి సోమవారం ఐదంతస్థుల భవనం మీద నుంచి ఆత్మహత్యకు పాల్పడింది. స్వాతికి తన మేనబావ ప్రదీప్‌కుమార్‌తో 2011లో వివాహం జరిగింది. వారి కుమారుడు ఆరుశ్రాం(5) ప్రస్తుతం స్వాతి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. స్వాతి, ప్రదీప్‌లకు రెండో సంతానంగా శాన్వీ జన్మించింది. స్వాతి మానసిక స్థితి కొన్నాళ్లుగా సరిగ్గాలేదని చికిత్సకూడా చేయించామని ఆమె తండ్రి సత్యనారాయణ తెలిపారు. అయితే స్వాతి ఆత్మహత్య చేసుకుంటుందని ఊహించలేదని, అల్లుడిపై ఎలాంటి అనుమానం లేదని సత్యనారాయణ తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2024లోగా 'జమిలి' కుదరదు

- ఒకేసారి ఎన్నికలకు రాజ్యాంగ సవరణ చేయాలి
- సీఈసీ మాజీ కమిషనర్ టీఎస్ కృష్ణమూర్తి



హైదరాబాద్, జనవరి 22: లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు 2024కు ముందు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడమనేది సాధ్యం కాదని కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్ టీఎస్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగ సవరణ అవసరమని చెప్పారు. దేశవ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు జరగాలన్న అంశంపై చర్చ నడుస్తున్న నేపథ్యంలో ఆయనతో 'పీటీఐ' ప్రత్యేకంగా మాట్లాడింది. ఐదేళ్లకోసారి ఏకకాలంలో దేశవ్యాప్త ఎన్నికలు అనేది మంచి విషయమేనని ఈ సందర్భంగా కృష్ణమూర్తి పేర్కొన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సిఫార్సు మేరకు ఒకే ఏడాది లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం వీలు పడుతుందని, అందుకు కొంత అధ్యయనం, రాజ్యాంగ సవరణ అవసరమని పేర్కొన్నారు. పాలనా పరంగా, వ్యయ పరంగా జమిలి ఎన్నికలతో మేలు జరుగుతుందన్నారు. దీంతో పాటు ప్రతీకార రాజకీయాలు, ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు వంటివి తగ్గుముఖం పడతాయని అభిప్రాయపడ్డారు. అయితే, 2019లో ఏకకాల ఎన్నికలు సాధ్యం కాకపోవచ్చునని అన్నారు. గత ఏడాది కొన్ని రాష్ట్రాలకు ఎన్నికలు జరగడం, ఈ ఏడాది మరికొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతుండడం వల్ల అది సాధ్యపడదని పేర్కొన్నారు. 2024 నాటికి అది సాకారం అయ్యే అవకాశం ఉందన్నారు. జమిలి ఎన్నికల అంశం ప్రధాని మోదీ అభిలాష మాత్రమే కాదని, ఎన్నికల సంఘం సైతం అదే కోరుకుంటోందని చెప్పారు.


'ఒంటేరు' విడుదలకు ఎల్ రమణ డిమాండ్



హైదరాబాద్, జనవరి 22(మనం ప్రతినిధి): అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసిన మంద కృష్ణ, ఒంటేరును వెంటనే విడుదల చేయాలని టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మందకృష్ణ నిర్బంధ వ్యతిరేక పోరాట కమిటీ నేతల ఆహ్వానంతో ఎల్ రమణ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని ఆరోపించారు. మంద కృష్ణను, వంటేరు ప్రతాప్‌రెడ్డిని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ఐక్యవేదిక ఈ నెల 29న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న బీసీ జెండా.. ఎజెండా రూపకల్పన ఆవిర్భావ మహాసభ గోడ పత్రికను బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటితో కలిసి రమణ సోమవారం ఎన్టీఆర్ భవన్‌లో ఆవిష్కరించారు. అంతకుముందు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి తెలంగాణ పసుపు సైన్యం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పార్టీ పురోభివృద్ధి కోసం పాటుపడాలని పసుపు సైన్యం నేతలకు సూచించారు.

కాంగ్రెస్‌ది దివాళాకోరుతనం

- **గవర్నర్లను ఏజెంట్లుగా చూస్తోంది**
- **ఆ పదవిని రబ్బర్‌స్టాంప్‌గా మార్చింది ఆ పార్టీనే : కర్నె**



హైదరాబాద్, జనవరి 22 (మనం ప్రతినిధి): గవర్నర్లు కాంగ్రెస్ ఏజెంట్లుగా పని చేయాలని ఆ పార్టీ కోరుకుంటోందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే కర్నె ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధి గురించి గవర్నర్ మంచి చెబితే ఆ పార్టీకి ఎందుకంత కడుపుమంట అని ప్రశ్నించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గవర్నర్ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే ఎందుకంత ఆక్రోశమని ప్రశ్నించారు. 1984లో గవర్నర్ రామ్‌లాల్ ద్వారా ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని అన్యాయంగా రద్దు చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా? అని నిలదీశారు. రాష్ట్ర గవర్నర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గవర్నర్ కాళేశ్వరం పర్యటనను కూడా రాజకీయం చేయడం ఆ పార్టీ దివాళా కోరుతనానికి నిదర్శనం అని మండిపడ్డారు. అధికార పార్టీని విమర్శించడమే వారికి పరమావధిగా మారిందని ఆయన దుయ్యబట్టారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు రూపకల్పన జరగకముందే 5 వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించిన ప్రబుద్ధులు కాంగ్రెస్ నేతలేనన్నారు. గవర్నర్ పదవిని రబ్బర్ స్టాంప్‌గా మార్చింది, రాజ్‌భవన్‌ను తమ రాజకీయాలకు అడ్డాగా మార్చింది కాంగ్రెస్ కాదా? ప్రశ్నించారు. గవర్నర్‌ను ప్రాంతీయ పార్టీ అయిన టీఆర్ఎస్ నియమించిందా? అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టును రాహుల్ గాంధీ సందర్శించినా ప్రభుత్వాన్ని పొగడకుండా ఉండలేరని, ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గ్రహించాలని సూచించారు. గవర్నర్ నరసింహన్ పోలవరం అవకతవకలపై కేంద్రానికి నివేదిక ఇచ్చారని ఏపీ కాంగ్రెస్ పొగుడు తుంటే తెలంగాణ కాంగ్రెస్ విమర్శించడం ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని అన్నారు. పవన్ కల్యాణ్‌తో టీఆర్ఎస్‌కు రహస్య అవగాహన ఉందని పొన్నం చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. పవన్ పూర్తి స్థాయి రాజకీయ నేతగా మారి యాత్ర కొనసాగిస్తే 'ఆల్ ది బెస్ట్' చెబుతామని అన్నారు.



కవ్వాల్ అరణ్యంలో.. వన్యప్రాణుల గణన షురూ

- **ప్రారంభించిన మంత్రి జోగు రామన్న**

హైదరాబాద్, జనవరి 22(మనం ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా పులులు, వన్యప్రాణుల గణన కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. అందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలోని కొలాంగూడ, రాంపూర్ అటవీ బీట్‌లోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పులులు, వన్యప్రాణుల గణన కార్యక్రమాన్ని అటవీ, బీసీ సంక్షేమ మంత్రి జోగు రామన్న పర్యటించారు. మంత్రి రామన్న స్వయంగా పాల్గొని చిరుతపులి, ఎలుగుబంటి, నీలుగాయి, కొండ గొర్రెల కాలు ముద్రలను సేకరించారు. అందుగు చెట్టు బెరడును కొన్ని రకాల వన్య జంతువులు గోళ్లతో గీకడం, కొరుక్కుని తినడం చేస్తుండడంతో మంత్రి ఆ చెట్టును పరిశీలించారు. ఉదయం ఆరు గంటలకే దట్టమైన అటవీ ప్రాంతానికి చేరుకున్న మంత్రికి జింకల గుంపు ఎదురైంది. మంత్రి ఏకంగా ఆరు కిలోమీటరల మేర కాలినడకన అటవీ ప్రాంతాన్ని కలియ తిరిగారు. రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో మూడు వేల ఫారెస్ట్ బీట్స్‌లో వన్య జంతు గణనను మొదలుపెట్టారు.



సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- **ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్**

హైదరాబాద్, జనవరి 22(మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వానికి అవార్డులు రావడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. అంకితభావంతో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను తీర్చాలంటూ కోరారు. ప్రధానంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈమేరకు ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సోమవారం సచివాలయంలో సీఎస్ చేతుల మీదుగా డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. అనంతరం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఎస్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. సీపీఎస్ విధానంతో 1.3 లక్షల మంది ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్పొరేషన్‌లో పనిచేసే హెల్త్ స్కీం గడువు ముగిసిందని దానిని 6 నెలల పొడిగించాలని కోరారు. దీంతో పాటు 11 పీఆర్సీ కమిటీ వేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తెలంగాణ ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈజీ మనీ..వచ్చేస్తుందని!

- **రాజధానిలో జోరుగా వ్యభిచారం**
- **టాలీవుడ్ జూనియర్ ఆర్టిస్టులే అధికం**
- **అవకాశాలు తక్కువ కావడమే కారణం**
- **రాచకొండ కమిషనరేట్‌లో ఎక్కువ కేసులు**
- **వ్యభిచార గృహాలను మూయించినా అంతే**





హైదరాబాద్, జనవరి 22: రాజధాని శివార్లతో పాటు నగరం నడిబొడ్డున కూడా హైటెక్ వ్యభిచారం జోరుగా సాగుతోంది. ఇందులోనూ టాలీవుడ్ సినీ పరిశ్రమకు చెందిన జూనియర్ ఆర్టిస్టులు ఎక్కువగా పట్టుబడుతున్నారు. సినిమాలు, టీవీ షోలలో అవకాశాల కోసం ప్రయత్నించి, అవి ఎక్కువగా దొరక్కపోవడంతో సులభంగా డబ్బు సంపాదన కోసం వాళ్లు ఈ బాట పడుతున్నారని తెలుస్తోంది. 2017లో నమోదైన కేసుల్లో చాలావరకు సినిమా పరిశ్రమకు చెందినవాళ్లే దొరికేశారు. గత సంవత్సరం తాము దాదాపు 50 మంది జూనియర్ ఆర్టిస్టులను వ్యభిచార కూపం నుంచి కాపాడినట్లు పోలీసులు చెబుతున్నారు. వాళ్లంతా టాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసుకునేవారని, అలాగే టీవీ చానళ్లలోని డైలీ సీరియళ్లలో కూడా నటించేవారని.. కొంతకాలం తర్వాత అవకాశాలు తక్కువై ఇటువైపు వచ్చారని అంటున్నారు. ముందునుంచి పరిశ్రమలో ఉన్న పరిచయాలతో పాటు తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో సినిమా వాళ్లు అనే పేరు ఉండటంతో దాన్ని ఈరకంగా ఉపయోగించుకుంటున్నారు. పోలీసులు గత సంవత్సరం దాదాపు వందకు పైగా రైడ్లు చేసి నగర శివార్లలో ఉన్న పలు వ్యభిచార గృహాలను మూయించేశారు. ఒక్క 2017 సంవత్సరంలోనే 40కి పైగా గృహాలు మూతపడ్డాయి.

అపార్టుమెంట్లలో వ్యవహారం..

నగరంలోని చాలా అపార్టుమెంట్లలో పక్క ఫ్లాట్‌లో ఏం జరుగుతోంతో పట్టించుకునే తీరిక కూడా ఎవరికీ ఉండటం లేదు. దాంతో గుట్టుచప్పుడు కాకుండా ఫ్లాట్లలో వ్యభిచారం నిర్వహిస్తున్నారు. అలాగే ఎప్పటినుంచో ఉన్న లాడ్జీల వ్యవహారాన్ని కూడా పోలీసులు ఉక్కుపాదంతో అణిచేస్తున్నారు. గత సంవత్సరం తాము ఎనిమిది లాడ్జీలను మూయించామని రాచకొండ సీపీ మహేష్ భగవత్ చెబుతు న్నారు. మనుషుల అక్రమ రవాణా అన్నది అచ్చంగా డిమాండు – సరఫరా సూత్రం మీదే ఆధారపడి ఉందని ఆయన అన్నారు.

అందుకే ముందుగా డిమాండును తగ్గించడానికి తాము ప్రయత్నిస్తున్నామని, అప్పుడు సరఫరా దానంతట అదే తగ్గిపోతుందని చెప్పా రు. అయితే.. మనుషుల అక్రమ రవాణాకు సంబం. దించిన కేసులు కోర్టు వరకు వెళ్తున్నా.. అక్కడ శిక్షలు పడటం మాత్రం చాలా తక్కువగా ఉంటోంది. 2016 సంవత్సరంలో ఒక్క కేసులోనూ శిక్ష పడలేదు. ఇక 2017లో దాదాపు 70 శాతం కేసులు కోర్టులలో పెండింగులోనే ఉంటున్నాయి.

రాచకొండలో రచ్చరచ్చ

గత సంవత్సర కాలంలో నగర పరిధిలోని మూడు కమిషనరేట్లలో.. ఒక్క రాచకొండ కమిషనరేట్ పరిధిలోనే అత్యధికంగా ప్రివెన్షన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ చట్టం (పిటా) కింద కేసులు నమోదయ్యాయి. రాచకొండ పోలీసులు ఈ చట్టం కింద 82 కేసులు నమోదుచేయగా, సైబరాబాద్ పరిధిలో 78, హైదరాబాద్ పరిధిలో 60 కేసులు నమోదయ్యాయి. ఇక కొత్త సంవత్సరంలో కూడా రాచకొండ కమిషనరేట్‌లో వ్యభిచార ఘటనలు బాగానే బయటపడ్డాయి. కేవలం 20 రోజుల్లోనే 15 మంది నిందితులను అరెస్టుచేసి ఆరు కేసులు నమోదు చేసినట్లు రాచకొండ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటీ) ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. మనుషుల అక్రమ రవాణా, వ్యభిచారం లాంటి వ్యవహారాలను పూర్తిగా నియంత్రించేందుకు తాము స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు ఆయన చెప్పారు.

జనసేన రాజకీయ పార్టీనా, బ్రోకరేజీ సంస్థా?

- **బీజేపీ అధికార ప్రతినిధి కృష్ణ సాగర్**



హైదరాబాద్, జనవరి 22 (మనం న్యూస్): జనసేన రాజకీయ పార్టీనా లేదంటే బ్రోకరేజీ సంస్థో తెలియడం లేదని బీజేపీ అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తెలంగాణ వ్యతిరేఖి అని, ఉద్యమ సమయంలో ఆయన అమరవీరులతో పాటు కేసీఆర్‌పై విమర్శలు చేశారని కృష్ణసాగర్ రావు అన్నారు. జనసేనకు జెండా, లోగో ఉన్నాయి తప్పితే ఓ సిద్ధాంతం లేదన్నారు. పెరియార్ రామస్వామి స్ఫూర్తితో రాజకీయాల్లోకి వస్తున్నట్లు చెప్పిన పవన్ కళ్యాణ్ ప్రాంతీయ వాదంతో పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. గతంలో కేసీఆర్‌ను విమర్శించిన పవన్, ప్రస్తుతం ఆయన పొగుడు తుండడం ఆశ్చర్యంగా ఉందన్నారు. జనసేన టీఆర్ఎస్‌కు భజన పార్టీ అని ఆయన అన్నారు. తెలంగాణలో టీఆర్ఎస్ వ్యతిరేక ఓటును చీల్చటానికి కేసీఆర్ ప్రయోగిస్తున్న పావుగా పవన్‌ను అభివర్ణించారు. జనసేనకు కార్యకర్తలు లేరని.. కేవలం అభిమానులతోనే పవన్ హడావుడి చేస్తున్నారన్నారు. రాజకీయం అంటే.. ఏపీలో పెరుగన్నం తిని.. తెలంగాణలో బిర్యానీ తినడం కాదన్నారు. ఏపీలో ఓ పార్టీకి కొమ్ముకాసి, తెలంగాణలో మరో పార్టీకి భజన చేయటం ఏందని ఆయన ప్రశ్నించారు. పవన్ యాత్రకు దారి తెన్నూ లేదన్నారు. హిందీ భాషా పదంతో 'చలోరే చలోరే చల్ అని యాత్రకు బయలుదేరిన పవన్‌కు, భాషాభిమానం ఉందనడం హాస్యాస్పదమన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం

- **అప్రజాస్వామికంగా ఫ్రెండ్లీ పోలీసింగ్**
- **టీపీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నలమాస కృష్ణ**

హైదరాబాద్, జనవరి 22(మనం ప్రతినిధి): ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడమే తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) పని అని ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు నలమాస కృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి మెంచు రమేశ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. ఎన్నో నిర్బంధాల మధ్యలోనూ సభను విజయవంతం చేసిన ప్రజలకు ఉద్యమాభివందనాలు తెలిపారు. 1977 డిసెంబర్‌లో వరంగల్‌లో రెండున్నర లక్షల మంది ప్రజల సమక్షంలో ప్రజాస్వామిక తెలంగాణ సాధన కోసం డిక్లరేషన్ చేశామని గుర్తుచేశారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి కోసం, రాజకీయ పార్టీల ప్రజావ్యతిరేక విధానాలను టీపీఎఫ్ ప్రశ్నిస్తుందన్నారు. తెలంగాణ ప్రజాసమస్యలపై పోరాడేందకు ప్రజాప్రణాళిక రూపొందించామని, 1977 స్ఫూర్తితో 133 అంశాలతో ప్రజాస్వామిక తెలంగాణ–2018 వరంగల్ డిక్లరేషన్‌ను ఆదివారం జరిగిన బహిరంగ సభలో విడుదల చేశామన్నారు. ఈ సభకు 2 నెలల నుంచి ప్రభుత్వం అడ్డంకులు కల్పించిందని, ఫ్రెండ్లీ పోలీసింగ్ అప్రజాస్వామికంగా సాగుతుందన్నారు. పోలీసులు సభ చివరలో తెలంగాణ అమరులకు నివాళులు తెలిపే అవకాశం ఇవ్వలేదని ఆగ్రహించారు. విరసం నేత వరవరరావు, టీపీఎఫ్ నాయకులు, కళాకారులతో సహ వందమందిని అరెస్ట్ చేసి ఈడ్చుకుంటూ పోలీస్ స్టేషన్ తరలించారని వివరించారు. ఈ ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జేఎన్‌టీయూలో.. జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు

హైదరాబాద్, జనవరి 22(మనం ప్రతినిధి): హైదరాబాద్‌లోని జేఎన్ టీయూలో ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 'భాధ్యతాయుతమైన ఓటరు–విద్యార్థుల పాత్ర' అనే అంశంపై వక్తృత్వ, వ్యాస రచన పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పి.సమ్మిలాల్ బహుమతులు, మెరిట్ సర్టిఫికేట్స్ అందజే శారు. విజేతలు ఈనెల 24న నిర్వహించే స్టేట్ లెవల్ జాతీయ ఓటరు దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే వక్తృత్వ, వ్యాస రచన పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కాళాశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు, ప్రోగ్రాం ఆఫీసర్ చత్రపతి, బాలాంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్మిక శాఖతోనే రాష్ట్రానికి ప్రథమ స్థానం

- **హోం, కార్మిక మంత్రి నాయిని**

హైదరాబాద్, జనవరి 22(మనం ప్రతినిధి): ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడం వెనక కార్మిక శాఖ కృషి ఎంతో ఉందని హోం, కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోల్‌కతాలో ఈ అవార్డును లేబర్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ అందుకున్నారని చెప్పారు. కార్మిక శాఖ బ్రహ్మాండంగా పనిచేస్తోందనడానికి ఈ అవార్డే నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకున్న వెంటనే కాంట్రాక్టులకు, బిజినెస్‌లకు సింగిల్ విండో విధానంలో అనుమతిలిస్తూ పారదర్శకంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇది కార్మిక శాఖలో విప్లవాత్మక మార్పని పేర్కొన్నారు. దేశంలోని 29 రాష్ట్రాల సీఎంలలో కేసీఆర్ నెంబర్‌వన్ అని సర్వేలో తేలిందన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు మా వెన్నంటే ఉన్నారని స్పష్టం చేశారు. కార్మికశాఖకు అవార్డు వచ్చిన నేపథ్యంలో శాఖ కమిషనర్‌ను సన్మానించి, అధికారులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ శశాంక్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఇస్నాపూర్‌లో హెచ్‌ఎస్ఐఎల్ ప్లాంట్

- రూ.160 కోట్లతో పైపుల పరిశ్రమ ఏర్పాటు
- ప్రత్యక్షంగా 200 మందికి ఉపాధి
- కంపెనీ వీసీ, ఎండీ సందీప్ సోమాని వెల్లడి

హైదరాబాద్, జనవరి 22(మనం ప్రతినిధి): దేశంలోనే తొలిసారిగా మెదక్ జిల్లా ఇస్నాపూర్‌లో పైపుల పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు హిందుస్థాన్ శానిటరీవేర్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్(హెచ్ఎస్ఐఎల్) వీసీ, ఎండీ సందీప్ సోమాని పేర్కొన్నారు. ఈ పరిశ్రమ స్థాపనకు గానూ రూ.160 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన తెలిపారు. సీపీవీసీ, యూపీవీసీ పైపులు, ఫిట్టింగ్స్ తయారీకి ఈప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈమేరకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో హింద్‌వేర్ పైపులు ట్రూఫ్లోబై హింద్‌వేర్ అనే బ్రాండ్‌పేర సోమాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అగ్రగామి సంస్థ అయిన శానిటరీవేర్ కంపెనీ, ఐకానిక్ బ్రాండ్ హింద్‌వేర్ రూపకర్త అయిన హెచ్ఎస్ఐఎల్ తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా తమ తయారీ కేంద్రాన్ని నెలకొల్పుతోందని చెప్పారు. ఈ ప్లాంట్‌తోనే హెచ్ఎస్ఐఎల్ కంపెనీ ఇంటి ప్లంబింగ్ పైప్స్ విభాగంలో ప్రవేశించిందన్నారు. ఇస్నాపూర్‌లో ఏర్పాటు చేయబోయే పరిశ్రమ ద్వారా 200 మందికి ఉపాధి కలుగుతుందని తెలిపారు. రెండేండ్లలో కంపెనీ సామర్థ్యాన్ని 60 మెట్రిక్ టన్నులకు పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రానున్న ఐదేళ్లలో దేశంలోని నాలుగు ప్రముఖ బ్రాండ్లలో తమ సంస్థ ఒకటిగా ఎదుగుతుందని దీమా వ్యక్తంచేశారు. కంపెనీ పైప్స్ డివిజన్ ప్రెసిడెంట్ రాజేశ్ పజ్నూ మాట్లాడుతూ.. ఉత్పాదన, సాంకేతిక ఆధిక్యానికి హామీ ఇచ్చేలా క్లోరినేటెడ్ పాలివినైల్ క్లోరైడ్(సీపీవీసీ) రెసిన్ సరఫరాకు జపాన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- ఎప్పుడొచ్చినా ఎదుర్కోవాలి
- కార్యకర్తలకు ఉత్తమ్ పిలుపు
- కార్యకర్తలకోసం త్వరలో 'శక్తి యాప్'
- వచ్చే నెల మూడో వారంలో బస్సు యాత్ర



హైదరాబాద్, జనవరి 22 (మనం ప్రతినిధి): ఎన్నికలు ఎప్పుడు జరిగినా కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీభవన్లో సోమవారం ఏర్పాటు చేసిన కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కోసం శక్తి యాప్‌ను రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ యాప్‌కు ఒక కమిటీని వేశామని, చైర్మన్‌గా ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి వ్యవహరిస్తారని పేర్కొన్నారు. బూత్ లెవల్ నుంచి పార్టీని పటిష్టం చేసే విధంగా చర్యలు చేపడ్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి మూడో వారంలో బస్సుయాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. బస్సు యాత్ర రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తుందని తెలిపారు. ఈ యాత్ర మే నెల వరకు కొనసాగుతుందన్నారు. బస్సు యాత్ర మధ్యలో నిర్వహించే బహిరంగ సభకు కాంగ్రెస్ అధ్యక్షులు రాహూల్‌గాంధీ వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.పలు పార్టీలకు చెందిన అనేకులు ఈ సమ యంలో పార్టీలో చేరే అవకాశం ఉంద న్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి నిల యంగా మారిందని ఆరోపించారు. ప్రజల ను మోసం చేస్తున్న టీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ భట్టి విక్రమార్క, ఉపాధ్యక్షులు మల్లు రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మంగల్‌పల్లి సర్పంచ్, టీడీపీ అనుబంధ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్‌గౌడ్ తన అనుచర వర్గంతో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కండువ కప్పి వారిని పార్టీలోకి టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అహ్వానించారు. కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు.

గవర్నర్‌పై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం :భట్టి

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల టెండర్లపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌తో విచారణ జరిపించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టులను తామే చేపట్టినట్టుగా టీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పుకుంటుందన్నారు. రూ. 26వేల కోట్లతో పూర్తి చేసే ప్రాజెక్టులను రూ. 80వేల కోట్లకు పెంచటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగమే కాళేశ్వరం ప్రాజెక్టు అని అన్నారు. ప్రాణహిత ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టకుండా పూర్తయ్యేదన్నారు. ప్రాజెక్టులలో జరుగుతున్న అవినీతిపై పీఏసీ చైర్మ్‌తో పాటు గవర్నర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. గవర్నర్ నరసింహన్ వ్యవహరిస్తున్న తీరుపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేయనున్నామన్నారు. ఓటమి భయంతోనే టీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను పరోక్ష పద్ధతిలో నిర్వహించేందుకు మొగ్గు చూపుతోందని ఆరోపించారు.

తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి

- **అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల**

హైదరాబాద్, జనవరి 22 (మనం ప్రతినిధి): తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రహదారులు అభివృద్ధి చేయనున్నట్టు రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గోదావరి తీర అటవీ ప్రాంతంలో రెండు లైన్ల రహదారి నిర్మించేందుకు కేంద్రాన్ని ఒప్పించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న పలు రహదారులు, భవనాల పురోగతిపై సోమవారం అధికారులతో తుమ్మల సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. గతంలో మంజూరైన రూ. 1290 కోట్లతో చేపడుతున్న రహదారుల పనులను కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు మంత్రి సూచించారు. 2017–18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రం పంపిన పలు ప్రతిపాదనలకు జాతీయ రహదారుల అభివద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌డీపీ) ఆమోదం తెలిపిందన్నారు. ఆరంగఢ్ నుంచి శంషాబాద్ వరకు రూ.290 కోట్లతో ఆరు లైన్ల రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం లభించిందని వివరించారు. 26 జిల్లాల కలెక్టరేట్లకు సంబంధించి కాంట్రాక్టు సంస్థలతో ఒప్పందాలు కుదిరాయని తుమ్మల వెల్లడించారు. రాష్ట్రంలో చేపడుతున్న రహదారుల అభివృద్ధి పనులను పరిశీలించేందుకు కేంద్ర అధికారుల బృందం రాష్ట్రానికి రానుందని తెలిపారు.



మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

మంగళవారం, జనవరి 23

స్వయంకృతం

అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ఢిల్లీ ప్రభుత్వానికి ఘర్షణలు, వివాదాలు కొత్తవేమీ కాదు. అవినీతి వ్యతిరేక ఉద్యమాల నుంచి ఉద్భవించింది 'ఆప్' ప్రభుత్వం. తాజాగా ఈసారి ఎన్నికల సంఘం నివేదికపై రాష్ట్రపతి ఉత్తర్వుల రూపంలో తేరుకోలేని షాక్! లాభదాయక పదవులు అనుభవించారంటూ 20 మంది ఆప్ శాసనసభ్యుల్ని అనర్హులుగా ప్రకటించాలని కేంద్ర ఎన్నికల సంఘం నివేదికను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అంగీకరించారు. రాష్ట్రపతి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఆప్‌కు మింగుడుపడని అంశంగా మారింది. 21 మంది శాసనసభ్యులను కేజ్రీవాల్ ప్రభుత్వం పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించింది. వీరిలో ఒకరు పంజాబ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజీనామా చేశారు. ఈ నియామకాల గురించి అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి 2015లో హిందు లీగల్ సెల్ సభ్యుడు, న్యాయవాది ప్రశాంత్ పటేల్ ఫిర్యాదు చేశారు. తరువాత ఈ అంశంపై ఆప్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఇప్పుడు వేటుపడిన వారిలో ఒక మంత్రి కూడా ఉన్నారు. ఈ 20 మంది అనర్హత వల్ల కేజ్రీవాల్ ప్రభుత్వానికి ప్రస్తుతానికి వచ్చిన ప్రమాదమేమీ లేదు. అయితే ఈ ఇరవై స్థానాల్లో జరిగే ఉపఎన్నికల్లో విజయం సాధించక తప్పనిసరి పరిస్థితులు కేజ్రీవాల్ ఎదుట ఉన్నాయి. ఇలా ఆప్‌లో చీలిక తెచ్చి మధ్యంతర ఎన్నికలకు వెళ్తే ఇందుకు బాధ్యత బీజేపీదే అవుతుంది.

2015 మార్చి 13 నుంచి 2016 సెప్టెంబర్ 8వ తేదీ వరకు పార్లమెంటరీ కార్యదర్శులుగా ప్రభుత్వం నుంచి ఒక్కపైసా కూడా తీసుకోలేదని ఎంతగా విన్నవించినా ఎన్నికల సంఘం ఢిల్లీ ప్రభుత్వ వినతిని పట్టించుకోలేదు. ఈ నియామకాలు చెల్లవని అప్పట్లో ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. కోర్టు కొట్టేసిన తరువాత ఇంకా లాభదాయక పదవులపై ఫిర్యాదులేమిటని ఢిల్లీ ప్రభుత్వం అభ్యంతరం చెప్పినా ఎన్నికల సంఘం పట్టించుకోలేదు. అరుణాచల్‌ప్రదేశ్ పాలకపార్టీలో చీలిక తరహా కుట్రలను ఢిల్లీలోని ఆప్‌లో కూడా తెచ్చే చర్యల వల్ల బీజేపీకి ప్రయోజనాలు పరిమితంగానే ఉంటాయి.

లాభదాయక పదవులు అనుభవించారని గతంలో కూడా కొంతమంది ప్రజాప్రతినిధులపై వేటుపడినా ఇంతమందిపై ఒకేసారి వేటుపడడం స్వతంత్ర భారతదేశంలో ఇదే ప్రథమం. రాజ్యసభ సభ్యురాలిగా ఉన్న జయాబచన్ కూడా ఉత్తరప్రదేశ్ చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థకు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తుండడంతో ఆమె రాజ్యసభ సభ్యత్వాన్ని అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం రద్దుచేశారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి అనుకూలంగానో, ఒత్తిడిపైనో పనిచేస్తోందనే అనుమానాలు, ఆరోపణలు తలెత్తుతున్నాయి. కేజ్రీవాల్‌కు ముందు ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్న షీలా దీక్షిత్ మంత్రివర్గంలో 19 మంది పార్లమెంటరీ కార్యదర్శులుగా బాధ్యతలు నెరవేర్చారు. ఛత్తీస్‌గఢ్‌లో రమణ్‌సింగ్ కూడా 11మందిని క్యాబినెట్ కార్యదర్శులుగా నియమించారు. ఆ నియామకాలను న్యాయస్థానం రద్దుచేసింది. అరుణాచల్‌ప్రదేశ్‌లో ముఖ్యమంత్రి ప్రేమ్‌ఖందు కూడా ఏకంగా 31 మంది పార్లమెంటరీ కార్యదర్శులను నియమించారు. అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో మొత్తం స్థానాల సంఖ్య 60 మాత్రమే. అసెంబ్లీలో సగం మంది కంటే ఎక్కువమందే పార్లమెంటరీ కార్యదర్శులుగా ఉన్నా ఎన్నికల సంఘం స్పందించలేదు. ఒక్క ఢిల్లీ ప్రభుత్వాన్ని మాత్రమే ఎన్నికల సంఘం ఎందుకు లక్ష్యంగా ఎంచుకొంది? ఈ అనుమానాలను ఏదో ఒకరోజు ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా నివృతి చేయాల్సి ఉంటుంది.

రాజ్యాంగ బద్ధమైనసంస్థగా చట్టాన్ని పక్షపాత రహితంగా అమలుచేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉన్నది. ఇంతమంది ఆప్ ప్రజాప్రతినిధుల్ని మూకుమ్మడిగా అనర్హులుగా ప్రకటించడం, అదీ తగిన జవాబు చెప్పుకునే అవకాశం ఇవ్వకుండా గోప్యతతో, అస్పష్టతతో ప్రకటించడం వెనక అంతరార్థమేమిటో ఎన్నికల సంఘమే చెప్పాలి. తాను రాజ్యాంగబద్ధంగా కాకుండా కేవలం రాజకీయ కారణాల ఆధారంగానే బాధ్యతలు నిర్వర్తిస్తానని ఎన్నికల సంఘం నిర్ణయించుకుందా? అసలు ఒక శాసనసభ్యుడు లాభదాయక పదవులు నిర్వహిస్తున్నాడని/నిర్వహించాడన్న ఆరోపణలతో అనర్హుడిని చేసే చట్టమేదీ లేదు. నిజానికి మంత్రులకు సహకరించడానికి 21 మందిని పార్లమెంటరీ కార్యదర్శులుగా చేయడం కేజ్రీవాల్ రాజ్యాంగ ధిక్కారానికి పాల్పడినట్లుగానే భావించాలి. ఎందుకంటే అసెంబ్లీలో మొత్తం సభ్యుల్లో మంత్రివర్గం సంఖ్య 10 శాతానికి మించకూడదు. అవినీతి రహిత, పరిశుద్ధమైన ప్రభుత్వాన్ని అందిస్తానంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చట్టాన్ని పట్టించుకోకపోవడం అనైతికంగాను, సైద్ధాంతికంగాను నేరంగానే పరిగణించాలి. అంటే, ఈ వివాదం మొత్తం కేజ్రీవాల్ స్వయంకృతంగానే భావించాలి.


అనుసంధానం అందని ద్రాక్షేనా!

జాతీయస్థాయిలో నదుల అనుసంధానం ఎప్పుడు ప్రతిపాదించినా పురిటిలోనే సంధికొట్టి దస్త్రాలకే పరిమితమౌతున్నాయి. తాజాగా కేంద్రమంత్రి గడ్కరి తమిళనాడులో పాగా వేసే వ్యూహంలో భాగంగా ప్రతిపాదించిన గోదావరి-కావేరి అనుసంధానానికి తెలంగాణ అంగీకరించలేదు. ముందుగా మహానది-గోదావరి అనుసంధానం చేపట్టిన తదుపరి గోదావరి కావేరి అనుసంధానం చేపట్టాలని, లేకుంటే తెలంగాణకు గోదావరి జలాలు 16 వందల టిఎంసీలు కేటాయిస్తున్నట్లు లిఖితపూర్వకంగా ఇస్తే అంగీకరిస్తామని తెలంగాణ మంత్రి హరీష్‌రావు ఈ నెల 17న ఢిల్లీలో జరిగిన నదీజలాలు అనుసంధానం 14వ సమావేశంలో తేల్చిచెప్పడంతో ఈ పథకం అమలు జరిగే అవకాశాలు కన్పించడంలేదు. గమనార్హమైన అంశమేమంటే ఏపీ ప్రభుత్వం మాత్రం నోరు మెదపలేదు. వాస్తవమేమంటే గోదావరిలో నీటి లభ్యత వినియోగం మిగులు గురించి సమగ్రమైన గణాంకాలు లేవు. జాతీయ జల అభివృద్ధి సంస్థ ఒక్కోదశలో ఒక్కో రక మైన అంచనాలను ప్రకటిస్తోంది. రాష్ట్ర విభజన జరిగిన తదుపరి అటు తెలంగాణ చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు ఏపీకి చెందిన ఎత్తిపోతల పథకాలు పోల వరం ప్రాజెక్ట్ పూర్తైన తర్వాత గోదావరిలో ఏమేరకు మిగులు జలాలు వుంటాయో నిర్థిష్టంగా గణాంకాలు లేవు.

1970 ప్రాంతంలో గంగా, కావేరి నదుల అనుసంధానం పథకం ప్రముఖ ఇంజనీరు కె.యల్ రావు ప్రతిపాదించారు. ఈ పథకానికి అప్పట్లో సుమారు 3 వేల కోట్ల రూపాయలు వ్యయమౌతుందని విద్యుశ్చక్తి వ్యయం మరొక 7 వేల కోట్లు అవసరమని అంచనా వేశారు. తుదకు ఈ పథకం తర్జనభర్జన మధ్య దస్త్రాలకే పరిమితమైంది. తిరిగి 1989లో మహానది-కావేరి అనుసంధానం తెరమీదకు వచ్చింది. జాతీయ జల అభివృద్ధి సంస్థ తొమ్మిది అనుసంధానాలను ప్రతిపాదించింది. 1) మహానది (మణిభద్ర) గోదావరి (ధవళేశ్వరం) తొలి అనుసంధానం 430 టీయంసీలు తరలిస్తూ మార్గమధ్యంలో 200 టీయంసీలు సాగు, తాగునీటికిచ్చి 230 టీయంసీలు ధవళేశ్వరం చేరేలా ప్రతిపాదించారు. 2) గోదావరి (పోలవరం) కృష్ణా (విజయవాడ) పోలవరం నుంచి 188 టీయంసీలు తరలించి మధ్యలో ఆయకట్టుకు ఇవ్వడంతోపాటు కృష్ణాడెల్టా స్థిరీకరణకు వినియోగించాలి. 3) గోదావరి (ఇచ్చంపల్లి) కృష్ణా (సాగర్) 580 టీయంసీలు తరలించి మార్గమధ్యంలో వినియోగించగా సాగర్‌కు 501 టీయంసీలు చేరుతాయి. 4) గోదావరి (ఇచ్చంపల్లి) కృష్ణా (పులిచెంతల) 154 టీయంసీలు మళ్లిస్తారు. 5) కృష్ణా (ఆల్మట్టి) పెన్నా 70 టీయంసీలు పెన్నాకు తరలిస్తారు. 6) కృష్ణా (శ్రీశైలం) పెన్నా, 82 టీయంసీలు తరలిస్తారు. 7) కృష్ణా (సాగర్) సోమశిల 346 టీయంసీలు మళ్లిస్తూ మార్గమధ్యంలో అవసరాలు తీరిపోగా 250 టీయంసీలు సోమశిలకు 346 టీయంసీలు మళ్లిస్తూ మార్గమధ్యంలో అవసరాలు తీరిపోగా 250 టీయంసీలు సోమశిలకు మళ్లిస్తారు. 8) సోమశిల కావేరి గ్రాండ్ ఆనకట్ట 302 టీయంసీలు మళ్లించి మార్గమధ్యంలో అవసరాలు తీరిపోగా 100 టీయంసీలు కావేరి గ్రాండ్ ఆనకట్టకు చేరుతాయి. 9) కావేరి నుంచి 79 టీయంసీలు కావేరి దక్షిణప్రాంత ఆయకట్టుకు సరఫరా చేస్తారు. ఈ పథకం కూడా అమలుకు రాలేదు. జాతీయజల అభివృద్ధి సంస్థ ప్రతిపాదించిన ఈ పథకానికి ఇతర రాష్ట్రాలతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గోదావరిలో మిగులు జలాలు లేవని వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదన మూలబడింది. గమనార్హమైన అంశమేమంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మిగులు జలాలు లేవని కేంద్రంతో వాదించి రాష్ట్ర విభజన జరిగిన తదుపరి ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులు సాలీనా 3 వేల టీయంసీలు సముద్రం పాలవుతున్నాయని చెబుతున్నారు. ఇందుకు చెందిన గణాంకాలు ఏ ఒక్కరి నుంచి రావడం లేదు.

తెలంగాణ ఏర్పడిన తదుపరి జాతీయజల అభివృద్ధి సంస్థ మరొక అధ్యయనం చేసింది. 1901 - 02 నుంచి 2010 -11 వరకు 110 సంవత్సరాల నీటి వివరాల ఆధారంగా నీటి లభ్యత వినియోగం మిగులును అంచనా వేసింది. ఈ అధ్యయనం ప్రకారం శ్రీరామ్ సాగర్ దిగువన గోదావరిలో 75 శాతం ప్రకారం 2106 టీయంసీలు, 50 శాతం ప్రకారం 2633 టీయంసీలు నీటి లభ్యత వున్నట్లు అంచనా వేసింది. 1989 అంచనాల ప్రకారం 75 శాతం నీటి లభ్యత కింద 231 టీయంసీలు తగ్గిపోయినట్లు ప్రకటించింది. తెలంగాణ చేపట్టిన ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ చేపట్టిన పోలవరం సహా వివిధ పథకాలు ఇరురాష్ట్రాల అవసరాలను పరిగణనలోకి తీసుకుంటే ఇచ్చంపల్లి నుంచి 140 టీయంసీలు విడుదల చేయవల్సి వుందని నిర్ధారించింది. ఇచ్చంపల్లి, ధవళేశ్వరం మధ్య రెండు రాష్ట్రాల అవసరాలు కలుపుకుంటే 646 టీయంసీ జలాలు అవసరమౌతాయని నీటి లభ్యత పరిశీలిస్తే 75 శాతం కింద ఇచ్చంపల్లి ధవళేశ్వరం 204 టీయంసీలు శబరి సబ్ బేసిన్ నుంచి 302 టీయంసీలు లభ్యత వుంటుందని, ఇవిపోగా ఇచ్చంపల్లి నుంచి 140 టీయంసీలు విడుదల చేస్తేనే ధవళేశ్వరం వరకు అవసరాలు తీరుతాయని ఈ అధ్యయనం నిగ్గు తేల్చింది.

1989 అధ్యయనం మేరకు ఇచ్చంపల్లి వద్ద 717 టీయంసీలు పోలవరం వద్ద 530 టీయంసీలు మిగులు వుంటుందని తేల్చినప్పుడే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పట్లోనే ముఖ్యమైన ప్రాజెక్టులు పరిగణనలోకి తీసుకోకుండా అధ్యయనం జరిగిందని, జాతీయ జల అభివృద్ధి సంస్థ నివేదిక ప్రకారమే గోదావరిలో నీటి లభ్యత 3710 టీయంసీలుగా కాగా అవసరాలు 3682 టీయంసీలున్నాయని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్డుచెప్పింది. తాజా అధ్యయనం ప్రకారం ఇచ్చంపల్లి వద్ద మిగులు 1989 అంచనాలతో పోల్చితే భారీగా తగ్గిపోయింది. గతంకన్నా మిగులు తగ్గినా కొంత మిగులు జలాలు వుంటాయని మాత్రం ఈ అధ్యయనం తేల్చింది. ప్రస్తుతం తెలంగాణ 180 టీయంసీల జలాలు మేడిగడ్డ (కాళేశ్వరం) నుంచి ఎగువకు ఎత్తిపోతల పథకం (రివర్స్ పంపింగ్)తో శ్రీరామ్ సాగర్‌కు నీరు తరలిస్తోంది. ఇదిలావుండగా జాతీయ జల అభివృద్ధి సంస్థ కూడా ఒక్కోరకంగా గణాంకాలను వెలువరించడం గమనార్హం. ఈ అధ్యయనాలు పక్కనబెడితే అటు తెలంగాణ ముఖ్యమంత్రి, ఇటు ఏపీ ముఖ్యమంత్రి ప్రతియేటా 3 వేల టీయంసీల జలాలు సముద్రం పాలవుతున్నాయని ఈ జలాలు తరలించింతే రాష్ట్రం మొత్తం సుభిక్షమౌతుందని పదేపదే చెబుతున్నారు. ఇరు రాష్ట్రాలు నిర్మిస్తున్న ప్రాజెక్టులు పూర్తైన తదుపరి ఏ అధ్యయనం మేరకు 3 వేల టీయంసీల జలాలు సముద్రం పాలవుతున్నాయో ఎవరూ వివరించడం లేదు. వాస్తవం చెప్పాలంటే మహారాష్ట్ర బాబ్లీ బ్యారేజ్ సహా పలు బ్యారేజీలు నిర్మించినందును శ్రీరామ్‌సాగర్‌కు నీళ్ళు రాకపోవడంతో తెలంగాణ 300 కి.మీ దిగువ నుంచి 180 టీయంసీల జలాలు రివర్స్ పంపింగ్‌తో పథకం ప్రారంభించింది. పైగా దేవాదుల ఎత్తిపోతల పథకం సామర్థ్యం 100 టీయంసీలకు పెంచుతున్నారు. గత సంవత్సరకాలంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు గోదావరి పెన్నా అనుసంధానం గురించి పలు ప్రత్యామ్నాయాలతో కూడిన పథకాలు ప్రకటించారు. తాజాగా 80 వేల కోట్ల వ్యయంతో పథకం ప్రారంభమైంది. 625 కి.మీ కాలువతో గోదావరి నుంచి 300 టీయంసీల జలాలు పెన్నాకు తరలించాలనేది ఈ ప్రతిపాదన. ఈ పథకం తొలిదశలో కృష్ణానదిపై వైకుంఠపురం వద్ద బ్యారేజి నిర్మిస్తామని, ఇందుకు 3278 కోట్లు వ్యయమవుతుందని ప్రకటించారు. ఇందుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపినట్లు కూడా ప్రచారంలో వుంది. రెండుమూడు దశలకు 87 వేల కోట్లు వ్యయ మవుతుందని ప్రకటించారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు గడ్కరి మరో అనుసంధానం తెరమీదకు తెచ్చారు. తమిళనాడు ప్రజలను బుట్టలో వేసుకొని తమిళనాడులో బీజేపీ ప్రాబల్యం పెంచుకునేందుకు ఈ పథకం ప్రతిపాదించారు. తెలంగాణలోని అకినేపల్లి వద్ద బ్యారేజి నిర్మించి తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు కొద్దిపాటి నీరిస్తూ తమిళనాడుకు గోదావరి జలాలు తరలించాలనేది ఈ పథకలక్ష్యం. కాళేశ్వరం వద్ద 500 టీయంసీలు మిగులుంటాయని, ఇందులో నుంచి 247 టీయంసీలు తరలిస్తూ మార్గమధ్యంలో తెలంగాణకు 102 టీయంసీలు ఏపీకి 55 టీయంసీలివ్వగా తమిళనాడుకు 100 టీయంసీలు ఉపయోగించనునట్లు ప్రకటించారు. అయితే గత 17న ఢిల్లీలో జరిగిన నదీజలాల అనుసంధాన 14వ సమావేశంలో తెలంగాణ మంత్రి అడ్డం తిరిగి ముందుగా మహానది గోదావరి అనుసంధానం జరిగిన తర్వాతనే ఇందుకు పూనుకోవాలని ప్రకటించడంతో గడ్కరి ప్రకటించిన ఈ పథకం ముందుకు సాగే పరిస్థితులు కన్పించడం లేదు. గడ్కరి ప్రకటించిన ప్రతిపాదన ద్వారా ఏపీకి కేవలం 55 టీయంసీల జలాలు మాత్రమే లభ్యమవుతాయి. వాస్తవంలో గొంతెండిపోతున్న రాయలసీమకు నదీ జలాలు ఇవ్వాలంటే గతంలో జాతీయ జల అభివృద్ధి సంస్థ ప్రకటించిన తొమ్మిది అనుసంధానాల్లో 5వ అనుసంధానం ఆల్మట్టి-పెన్నా పథకం అమలులోకి వస్తే రాయలసీమకు పుష్కలంగా నీరు అందించే అవకాశముంటుంది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం అడ్డం తిరగడంతో ప్రతిష్టంభన నెలకొనింది. పైగా బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు కూడా గోదావరి, కృష్ణానదీ జలాల పంపకంపై ప్రభావం చూపే అవకాశముంది.



> **గడ్కరి ప్రకటించిన ప్రతిపాదన ద్వారా ఏపీకి కేవలం 55 టీయంసీల జలాలు మాత్రమే లభ్యమ వుతాయి. వాస్తవంలో గొంతెండిపోతున్న రాయల సీమకు నదీజలాలు ఇవ్వాలంటే గతంలో జాతీయ జల అభివృద్ధి సంస్థ ప్రకటించిన తొమ్మిది అనుసంధానాల్లో 5వ అనుసంధానం ఆల్మట్టి-పెన్నా పథకం అమలులోకి వస్తే రాయలసీమకు పుష్కలంగా నీరు అందించే అవకాశ ముంటుంది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం అడ్డం తిరగడంతో ప్రతిష్టంభన నెలకొనింది.**

◆ **వి. శంకరయ్య**
విశ్రాంతపాత్రికేయుడు
9848394013

మన లేఖలు

రబీకి నీరందించాలి

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శ్రీరాం సాగర్ ప్రాజెక్టు(యస్.ఆర్.ఎస్.పి.) దాని ఉపకాలువ అయిన 38డి.బి.యం. జిల్లాలోని ములుగు మండలం మల్లంపల్లి దగ్గర మొదలై రేగొండ మండలం వెంకటేశ్వర్ల పల్లి మీదుగా చిట్యాల మండలం గరిమిళ్ళపల్లి వరకు వందలాది గ్రామాల మీదుగా ఈ కాలువల నిర్మాణం చేయబడి ఉంది. అయితే ప్రస్తుతం జిల్లా రైతాంగం వరి నాట్లు పోసుకొని, నాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. మరికొంత మంది ఇప్పటికే నాట్లు వేయడం జరిగింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువల ద్వారా నీటిని వ్యవసాయరంగానికి నీటిని విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. జిల్లాలోని మోరంచవాగు మీద చెక్ డ్యాం నిర్మాణం చేసి భూపాలపల్లి, గణపురం, చిట్యాల మూడు మండలాల రైతులకు ఉపయోగపడే విధంగా కాలువల ద్వారా నీటినందించాలి. మల్లంపల్లి నుండి గరిమిళ్ళ పల్లి వరకూ ఉండబడిన 38డిబియం ద్వారా నీటిని విడుదల చేయడం ద్వారా కాలువ పొడవున ఉండబడిన వందలాది గ్రామాల చెరువులు, కుంటలు నింపుకొని వ్యవసాయం చేయడానికి వీలుగా ఉంటుంది.


- శ్రీనివాస్ చిరిపోతుల,
జయశంకర్ భూపాల పల్లి జిల్లా.
96034 71199

ప్రత్యక్షమా? పరోక్షమా?

పంచాయతీ ఎన్నికలకు నగారా మోగేలా కనిపిస్తుంది. ఫిబ్రవరి నెలలో జరుగుతాయంటూ ఊహాగానాలు వస్తున్నాయి. ఇప్పటినుంచే గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల వేడి రాజుకుంటుంది. ఇదేలా ఉన్నా అందరి మదిలో ఒకటే ప్రశ్న. సర్పంచ్ ఎన్నికలు ప్రత్యక్షంగా జరుగుతాయా? పరోక్షంగా జరుగుతాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది. సర్పంచ్ ఎన్నికలని పరోక్షంగా నిర్వహించేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలు స్తోంది. ప్రతి పక్షాలు మాత్రం ప్రత్యక్షంగా నిర్వహించాలని వాదిస్తు న్నాయి. పాత విధానం ప్రకారం అయితే సర్పంచ్ అభ్యర్థుల్లో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారే ఎన్నికయ్యేవారు. తాజాగా ఒకవేళా ప్రభుత్వం అనుకున్నట్లు నిర్వహిస్తే మాత్రం గెలుపొందిన వార్డు సభ్యుల్లో ఒకరిని సర్పంచ్‌గా ఎన్నుకోవాలనేది ఆలోచన. కానీ ఇదే జరిగితే మాత్రం ఆశావహులకి నిరుత్సాహమనే చెప్పాలి.

- అనంతవరం సిద్దిరామప్ప,
గుండారెడ్డిపల్లి, సిద్దిపేట జిల్లా

మంచిమాట



'విజయ గాథల వల్ల సందేశాన్ని మాత్రమే పొందుతావు. అదే వైఫల్య గాథల వల్ల ఎలా విజయం సాధించాలో తెలుసుకోగలుగుతావు.'

- అబ్దుల్ కలాం

ముస్తాబవుతున్న మేడారం మహామేళ

జీఎస్‌ఇ అంతర్జాతీయ సదస్సు, భాగ్యనగరి మెట్రోరైలు నిర్మాణం, తెలుగు ప్రపంచ మహాసభల నిర్వహణ వంటి విజయాలు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను, సమర్థతలను చాటి చెబుతుం డగా, మరో గిరిజన కుంభమేళా జాతరగా పిలిచే వరంగల్ పూర్వ జిల్లా సమ్మక్క-సారలమ్మ కోయ జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమవుతోంది. కాకతీయుల కాలం నాటి వీరవనితల పేరిట జరిగే ఈ జాతర మహిళల ప్రాధాన్యతలను, తెలంగాణ ధిక్కార స్వరాల్ని చెప్పకనే చెబుతున్నది. వీరి దగ్గర నుంచి వారసత్వంగా తెచ్చుకున్న ధిక్కార స్వరమే మనకు ప్రత్యేక తెలంగాణ రావడానికి ఉపకరించిందని చెప్పవచ్చు. మొదటి ప్రతాపరుద్రుని పరిపాలనా కాలం క్రీ.శ. 1158 - 1195ల మధ్య ఈ సమ్మక్క సారలమ్మల వీరవనితల యుద్ధం కాకతీయ సైన్యాలతో జరుగగా, వీరంతా వీర మరణం పొందారని చరిత్ర చెబుతోంది. అప్పటి నుంచే ఈ జాతర సుమారు వెయ్యేళ్ళ చరిత్రను సంపాదించుకున్నది.



వరంగల్ పూర్వ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతమైన భూపాలపల్లి జయశంకర్ జిల్లా తాడ్వాయి మండలం మేడారం అభయారణ్యంలో 2018 జనవరి 31, ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో నాలుగురోజులపాటు జరిగే గిరిజన జాతర తెలంగాణ ప్రాంత వైశిష్ట్యాన్ని, వన దేవతలపట్ల సామాన్య ప్రజలకున్న ఆధ్యాత్మిక విశ్వాసాల్ని చాటి చెప్పనున్నది. 1940లో చిలుకలగుట్టపై నుంచి మైదానానికి దిగివచ్చిన ఈ జాతర అంచలంచెలుగా ఎదుగుతూ పోయింది. ఈసారి జరిగే జాతరకు కోటిన్నరకు పైగా భక్తులు తరలివస్తారని అధికారుల అంచనా. ఉభయ తెలుగు రాష్ట్రాలే కాకుండా, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పోటెత్తనున్నట్లు అధికారులు చెబుతున్నారు. గత పక్షం రోజులుగా మేడారానికి వివిధ చోట్ల నుంచి లక్షలాది మంది భక్తులు పోటెత్తుతున్నారు. ఆసియా ఖండంలోనే గంగానది పవిత్ర పుష్కరాల కుంభమేళా తర్వాత జరిగే ఈ జాతరకు గత మూడు దశాబ్దాల నుంచి విశేష ప్రాధాన్యం లభిస్తున్నది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అవుతుందనగా 2014లో ఈ జాతర ఫిబ్రవరిలో నాలుగు రోజులపాటు జరిగింది. జూన్ 2న ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ అవతరించాక 2016లో తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ జాతర ఎలాంటి లోటుపాట్లు లేకుండా జరిగింది. అప్పుడు 180 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశారు. ఈసారి నుంచి ఈ జాతరను జాతీయ జాతరగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడును ఆహ్వానిస్తూ తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం ఢిల్లీ వెళ్లి ఆహ్వానపత్రం ఇవ్వడం విశేషాంశమే కాగలదు. రాష్ట్రపతి, ప్రధాని ఈ జాతరను సందర్శిస్తే, జాతీయ జాతరగా గుర్తింపువచ్చే అవకాశం వుంటుందని రాష్ట్ర యంత్రాంగం భావిస్తోంది. జాతీయ జాతరగా గుర్తించడానికి కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తున్నది. సుమారు నాలుగువేలకు పైగా ప్రత్యేక జాతర బస్సులను ఆపరేట్ చేస్తున్నారు. అంతేకాక సుమారు పదివేల మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఈసారి సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణంలో గిరిజన తెగల ఆచారాలను, సంప్రదాయాలను పరిరక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం గిరిజన మ్యూజియాన్ని ఏర్పాటు చేస్తున్నది. ఐదు ఎకరాల స్థలంలో ఈ మ్యూజియం శరవేగంతో నిర్మాణమవుతోంది. ఇందుకు ఐదుకోట్ల రూపాయలను వెచ్చిస్తోంది. గత దశాబ్దం నుంచి గిరిజనులు కోరుతున్న గిరిజన విశ్వవిద్యాలయం కోరిక నెరవేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. జయశంకర్ జిల్లా ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. సుమారు ఐదువందల ఎకరాల అటవీభూమిని కేంద్ర అధికారుల బృందం గుర్తించింది. కేంద్ర గిరిజన శాఖ, మానవ వనరుల అభివృద్ధి శాఖ, యుజిసి, విశ్వవిద్యాలయాల ఉప కులపతుల బృందం ములుగు ప్రాంతంలో క్షేత్ర పర్యటన జరిపి ఈ ప్రాంతాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. ఈ భూములను స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు తెలిసింది.

తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్ కాకతీయ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, పురావస్తు, సాంస్కృతిక, టూరిజం, గిరిజన శాఖల సంయుక్తాధ్వర్యంలో పరిశోధక పీఠాన్ని ఏర్పాటు చేసి, సమ్మక్క సారలమ్మ జాతరలపై సూక్ష్మాతిసూక్ష్మంగా చారిత్రక పరిశోధనలు జరిపించాలని గిరిజన నేతలు కోరుతున్నారు. ఈ గిరిజన జాతరకు అధిక సంఖ్యలో గిరిజనేతరులు కూడా వస్తున్నారు. దీనివల్ల ఆసియాఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు వస్తోందని కోయ నాయకులు అంటున్నారు. గిరిజనులతో పాటు, గిరిజనేతరులు లక్షల సంఖ్యలో పాల్గొనడం ఆచారమైపోయింది. సుమారు 9 వందల సంవత్సరాల చరిత్ర వున్న ఈ జాతరను పరిశోధించి వాస్తవాలను వెలుగులోకి తేవాలి. గత కొన్నాళ్ల నుంచి జరుగుతున్న ఈ జాతర సమాచారాన్ని అధికారికంగా సేకరించి, డాక్యుమెంటేషన్ చేయాలని, రాష్ట్ర పురావస్తు, గిరిజన శాఖల సంయుక్తాధ్వర్యంలో చరిత్ర పరిశోధకుల బృందాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.

తెలంగాణలోని పూర్వ కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్‌లలో జరిగే ఈ వీర నారీమణులైన ఆడబిడ్డల ఉపజాతరలు గత మూడు దశాబ్దాలుగా జరుగుతున్నాయి. పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖనిలో రెండు ఉపజాతరలు నిర్వహిస్తుండటం పరిపాటైంది. సింగరేణి ఆధ్వర్యంలో ఈ ఉప జాతరలు జరుగుతున్నవి. మేడారం వెళ్లలేని వారు ఇక్కడ జరిగే ఉపజాతరల్లో పాల్గొని తమ మొక్కుబడులను చెల్లించుకుంటారు. సమీప దేవుళ్లను సందర్శించిన తర్వాతే ఈ వనజాతరకు వెళ్ళే ఆచారాన్ని గిరిజనులు పాటిస్తున్నారు.

◆ **సంకేపల్లి నాగేంద్రశర్మ**
తెలంగాణ చరిత్ర విశ్లేషకులు కరీంనగర్
9441797650

సాయుధ పోరాట స్వాతంత్ర్య శిల్పి


విద్యార్థి దశ నుంచే బ్రిటిష్ వారిని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ద్వేషించటం ప్రారంభించారు. 1897 జనవరి 23న సుభాష్ ఒరిస్సా రాష్ట్రంలోని కటక్‌లో జన్మించారు. తండ్రి జానకీనాథ్ బోసు, తల్లి ప్రభావతి దే వి. వీరికి 14 మంది సంతానం. తొమ్మిదవ వాడు సుభాష్. తండ్రి జానకీనాథ బోస్ కటక్‌లో న్యాయవాదిగా స్థిరపడ్డారు. ప్రాథమిక విద్య అనంతరం కటక్‌లోని రేవెన్ షా కాలేజి మేట్ హైస్కూలులో చేరారు సుభాష్. 1913లో మెట్రిక్ పరీక్షలు రాసి, కలకత్తా విశ్వవిద్యాలయం పరిధిలో రెండవ స్థానంలో ఉత్తీర్ణుడయ్యారు. కలకత్తాలోని ప్రెసిడెన్సీ కళాశాలలో జేరా రు. యఫ్.ఎ. అనంతరం బి.ఎ. కూడా ప్రెసిడెన్సీ కళాశాలలో చేరారు. ఆ కళాశాలలో ఇంగ్లీషు ప్రొఫెసర్ ఇ.యఫ్.ఓటెన్ భారత విద్యార్థులను చులకనగా చూసేవాడు. విద్యార్థి బృందం ప్రిన్సిపాల్‌కి వివరించింది. ఆయన కూడా ప్రొఫెసర్‌ని సమర్ధించారు. పైగా ఆయనకు క్షమాపణ చెప్పండంటూ హితోపదేశం చేశారు. బోస్ నాయకత్వంలో క్లాసులు బహిష్కరించి సమ్మె చేశారు. చివరకు ప్రొఫెసర్ ఓటెన్ క్షమాపణ చెప్పటంతో విద్యార్థులు సమ్మె విరమించారు. కళాశాలలో ప్రశాంతత నెలకొన్న దశలో ఓ దురదృష్టకర సంఘటన జరిగింది. ఓటెన్‌ని వెనక నుంచి ఎవరో కొట్టారు. ఆ నెపం సుభాష్‌పై పడింది. అవకాశం కోసం ఎదురుచూస్తున్న ప్రిన్సిపాల్ కళాశాల నుంచి బహిష్కరించారు. ప్రజాసేవ చేయాలనే దృక్పథంతో 'స్వచ్ఛంద సేవాదళం' స్థాపించారు. అదే కాలంలో ఒరిస్సాలో అంటువ్యాధులు ప్రబలాయి. తన సేవాదళంతో రోగులకు సేవలుచేసి, ప్రజల్లో గుర్తింపు తెచ్చుకొన్నారు. అప్పుడే కలకత్తా విశ్వవిద్యాలయానికి అశుతోష్ ముఖర్జీ వైస్‌చాన్స్‌లర్‌గా వచ్చారు. ఆయన జాతీయవాది. సుభాష్‌కు స్కాటిచ్ చర్చి కళాశాలలో చదువుకొనే అవకాశం కల్పించారు. ఆ సంవత్సరమే ఆ కళాశాలలో మిలటరీ శిక్షణ ప్రారంభమైంది. మిలటరీ శిక్షణలో చేరి, క్రమశిక్షణతో మెలిగి, ధైర్యం, సాహసం చూపించటంతో పాటు, 1919లో బి.ఎ.ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా 1919 ఏప్రిల్ 6న దేశవ్యాప్తంగా హర్తాళ్ళు జరపాలని గాంధీజీ పిలుపు మేరకు సుభాష్ ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొడుకును ఇంగ్లండ్ పంపి ఐ.సి.ఎస్. చదివించాలన్నది తండ్రి ఆలోచన. ఇ ష్టం లేకపోయినా, ఐ.సి.ఎస్. చదవటానికి ఇంగ్లాండ్ వెళ్ళారు. తండ్రి ఆశయం సఫలీకృతం చేస్తూ ఐ.సి.ఎస్.లో నాల్గవవాడుగా ఉత్తీర్ణుడయ్యారు. బాల గంగాధర్ తిలక్, చిత్తరంజన్ దాస్‌ల ఆ పిలుపు మేరకు 1921 ఏప్రిల్‌లో ఐ.సి.ఎస్. కి రాజీనామా సమర్పించారు. కాంగ్రెస్‌లో చురుకైన కార్యకర్తగా, నాయకునిగా గుర్తింపు పొందటం, గాంధీజీతో సన్నిహితం కావటం అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షుడు కావటం ఒకదాని వెంట ఒకటి జరిగిపోయాయి. కొంతకాలం తర్వాత శాంతి, సత్యాగ్రహాలతో స్వాతంత్ర్యం సిద్ధించటం సాధ్యంకాదని భావించి, గాంధీజీకి దూరమయ్యారు. అదేసమయంలో సహచరులు కొందరు సుభాష్‌ను తమనేతగా అభివర్ణించారు. అదే 'నేతాజీ' అనే బిరుదుగా స్థిరపడింది. నేతాజీ తాకిడికి తట్టుకోలేక బ్రిటిష్ అధికారులు ఆయన్ని గృహనిర్బంధం చేశారు. విదేశాల్లోని భారతీయులను సమీకరించాలని తలపోసి, మారువేషాలతో విదేశాలకు వెళ్ళిపోయారు. జపాన్‌కు చేరి 1941 నవంబరులో కేవలం 30 మందితో 'స్వతంత్ర భారత కేంద్రం' స్థాపించారు. దానిలో నినాదం అవసరమని అభిప్రాయపడ్డారు. ఆ బాధ్యతను 'అబిద్ హస్సన్' అనే యువకుడికి అప్పగించారు. అతని కృషిఫలితమే 'జై హింద్' నినాదం వెలుగు చూసింది. అలా 'జైహింద్' భారతదేశ నినాదంగా స్థిరపడిపోయింది. జర్మనీ, ఇంగ్లీషు భాషల్లో ''అజాద్ హింద్'' అనే పత్రికను, అజాద్ హింద్ రేడియో'' ప్రసారాలను, 'అజాద్ హింద్' పేరుతో సైన్యాన్ని ఏర్పాటు చేశారు. అలా 'అజాద్ హింద్' చరిత్రలో నిలిచిపోయింది.



◆ **దాసరి ఆళ్వారస్వామి**







సెంట్రల్ రైల్వేల్లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా, స్పెషల్ అట్రాక్షన్‌గా ఓ వినూత్న ప్రయోగం విజయవంతమైంది. దీంతో నిత్యం కిటకిటగా ప్రయాణికులతో రద్దీగా ఉండే ఆ స్టేషన్‌లో ఎక్కడ చూసినా ఫొటోల గోల కనిపిస్తుంది. గ్రూపులుగా వచ్చిన ప్రయాణికులు ఇక్కడ చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. ఇక్కడికి వచ్చిన రైల్వే ప్రయాణికులంతా చాలా ఉత్సాహంగా సెల్ఫీలు తీసుకోవడంవెనక ఆసక్తికరమైన కథనం ఉంది..

ఆ స్టేషనంతా ఆమే



ముంబైలోని మాతుంగ రైల్వే స్టేషన్ తొలి 'ఆల్ వుమెన్ మోడల్ స్టేషన్'గా సేవలను అందిస్తోంది. టికెట్ కౌంటర్, టికెట్ చెకింగ్ మొదలు, రైలు నడపడం, టెక్నికల్ వ్యవహారాలు కూడా కేవలం వుమెన్ స్టాఫ్ చూసుకుంటోంది. దీంతో ఈ స్టేషన్ ఇప్పుడో సెలబ్రేటెడ్ స్టేషన్‌గా దాని పేరు ఇప్పుడు ప్రపంచంలో మారుమోగిపోతోంది. ఇక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు, ప్రముఖులు, సామాన్యులంతా ఆ రైల్వేస్టేషన్ పేరు ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. సెంట్రల్ రైల్వేలో భాగమైన మాతుంగ రైల్వే స్టేషన్ డీకే శర్మ అనే సెంట్రల్ రైల్వేస్ జనరల్ మేనేజర్ మానసపుత్రి. జూలై 2017లో శర్మ చొరవతో ప్రాణం పోసుకున్న ఆల్ వుమెన్ రైల్వే స్టేషన్ భారతీయ మహిళల శక్తి సామర్థ్యాలకు నిలువెత్తు సాక్ష్యంగా మారింది. ఈ స్టేషన్‌మీదుగా నడిచే రైళ్ల వ్యవహారాలపై నిర్ణయాలన్నీ తీసుకునే బృందాన్ని ఎవరైనా అభినందించి తీరాల్సిందే, విశేషం ఏమిటంటే ఇప్పటివరకూ మాతుంగ స్టేషన్‌పై ఎటువంటి కంప్లైంట్ రాకపోగా, సేవలు మరింత మెరుగయ్యాయనే ఫీడ్‌బ్యాక్ రావడంతో రైల్వేశాఖ ఇలాంటి స్టేషన్ల సంఖ్య పెంచడంపై దృష్టిసారిస్తోంది.





లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు

41 మంది లేడీ స్టాఫ్‌తో 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించిన మాతుంగ రైల్వే స్టేషన్ ఇప్పుడు భారతీయ రైల్వేలకు గర్వకారణంగా మారింది. స్టేషన్ మేనేజర్, పాయింట్ పర్సన్, బుకింగ్ స్టాఫ్, టికెట్ చెకర్స్, ఆర్‌పీఎఫ్ పోలీసులు, స్వీపర్లు ఇలా అన్ని విభాగాల్లోనూ మహిళా ఉద్యోగులే విధులు నిర్వహిస్తున్నారు. టీం లీడర్ అండ్ స్టేషన్ మేనేజర్‌గా ముంబై డివిజన్‌లో మొట్టమొదటి మహిళా స్టేషన్ మేనేజర్ అయిన మమతా కులకర్ణి మాతుంగ మోడల్ రైల్వే స్టేషన్‌ను అత్యంత సమర్థవంతంగా నడుపుతున్నారు. 17మంది మహిళా ఉద్యోగులు కమర్షియల్ డిపార్ట్ మెంట్ ఆపరేషన్స్ వ్యవహారాలను చూసుకుంటున్నారు. 24 మంది మహిళా కానిస్టేబుళ్లు కంటికి రెప్పవేయకుండా స్టేషన్‌లో భద్రత కల్పించేందుకు గస్తీ నిర్వహిస్తున్నారు. ఎనిమిదిమంది టికెట్ చెకింగ్, ఇద్దరు అనౌన్సర్లతో స్టేషన్ విజయవంతంగా రైలు ప్రయాణికులకు సేవలందిస్తోంది.

మరిన్ని మాతుంగలు!

ఇలాంటి మరిన్ని స్టేషన్లను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తేనున్నట్టు రైల్వే శాఖామంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం సంపాదించిన స్టేషన్‌ను ప్రత్యేకంగా అభినందించేందుకు స్వయంగా వచ్చిన రైల్వేమంత్రి వీరిని కలుసుకుని, పలు విషయాలపై చర్చించారు. రైళ్లలో మహిళలపై జరిగే ఈవ్ టీజింగ్, అత్యాచారాలు ఇతర ఇబ్బందులపై దృష్టిసారించినట్టు, 2018 సంవత్సరాన్ని మహిళలు, చిన్నారులు రైళ్లలో సురక్షితమైన ప్రయాణం చేసేందుకు అంకితం చేసినట్టు వెల్లడించారు. దేశవ్యాప్తంగా 2022 కల్లా అత్యంత సురక్షితమైన రైల్వే వ్యవస్థను అందించేలా ప్రయత్నాలు సాగుతున్నట్టు ఇందులో భాగంగానే ఇలాంటి ప్రయోగాలు చేస్తున్నట్టు పీయూష్ గోయల్ సగర్వంగా ప్రకటించారు. వుమెన్ ఎంపవర్‌మెంట్‌కు రూపం ఇచ్చేలా తమ శాఖ చేస్తున్న కృషి విజయవంతం కావడంతో, రైల్వేశాఖలో వుమెన్ స్టాఫ్‌ను ప్రోత్సహించేలా, వారిని బలోపేతం చేసేలా మరిన్ని పథకాలు, ప్రణాళికలు అమలు చేయనున్నట్టు గోయల్ చెబుతున్నారు. దీంతో రైల్వే చరిత్రలోనే మొట్టమొదటిసారి మహిళలకు పెద్ద పీట వేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక రైళ్లలో మహిళలు ప్రయాణించడానికి ఏమాత్రం భయపడకుండా ఉండేలా, లోకల్ ట్రైన్లలో సీసీటీవీలు అమర్చి, వాటిని నిరంతరం పర్యవేక్షించేలా వీటిని పోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేస్తే, మరింత సురక్షితంగా మహిళా ప్రయాణికులు తమ గమ్యస్థానాలు చేరుకోవచ్చుని, అడ్వాన్స్ టెక్నాలజీతో మహిళా భద్రత సాధ్యమని రైల్వే శాఖ మహిళా ప్రయాణికులకోసం సరికొత్త కసరత్తులు చేస్తోంది. మొత్తానికి ఆల్ వుమెన్ మోడల్ స్టేషన్ ద్వారా భారత మహిళల శక్తి సామర్థ్యాలు, మహిళలకున్న అవకాశాలు, అభివృద్ధిలో వీరి పాత్ర వంటివి లోకానికి పరిచయం చేసేలా ఉంది. యావత్ దేశం ఇక్కడి మహిళా ఉద్యోగుల బృందంపై ప్రశంసల వర్షం కురిపిస్తోంది.







ఒంటరితనం చంపేస్తోంది

మన పూర్వీకులు అన్నట్టు 'ఒంటరితనం పెద్ద శాపం' అక్షరాలా నిజంగా మారి జపాన్ దేశస్థులను చంపుకుతింటోంది. ఏటా కనీసం 28 శాతం మంది జపనీయులు ఈ ఒంటరితనం బారినపడి మరణిస్తున్నారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పిల్లలు పట్టించుకోక, జీవిత భాగస్వామి ఒకరు మరణించడంతో ఇంకొకరు ఒంటరితనాన్ని భరించలేక, ఉన్నట్టుండి మరణిస్తున్నారు. దీన్ని సైకాలజీలో 'లోన్లీ డెత్' ఫినామినా అంటారు. తమను చూసుకునేవారు దిక్కులేక వీరు అనాథలుగా కన్నుమూస్తుంటే, ఇరుగుపొరుగువారు శవం వాసన వచ్చినప్పుడు పోలీసులకు సమాచారమిస్తున్నారు. ఇలా అనాథలుగా, దిక్కులేని చావు చస్తున్నవారి సంఖ్య నానాటికీ పెరుగుతుండడంతో జపాన్ ప్రభుత్వం వీటికి ఎలా అడ్డుకట్ట వేయాలా అని యోచిస్తోంది. జపానీయుల ఆయుష్షు ఎక్కువకావడంతో ఒంటరితనానికి చిక్కిపోకుండా ప్రజలను కాపాడేందుకు మధ్యవయస్కులు, ముసలివారు తమ జీవిత భాగస్వాములు మరణిస్తే మళ్లీ పెళ్లి చేసుకోమని సర్కారు కౌన్సిలింగ్ ఇస్తోంది. జీవన ప్రమాణంలో మెరుగైన జపాన్‌లో మలివయసులోమాత్రం ఈ ప్రమాణాలు తగ్గుముఖం పడుతున్నాయి.

కొండగుర్తులతో..



జీవిత చరమాంకంలో ఉన్న తల్లిదండ్రులకు ఇదో పెద్ద మానసిక వ్యాధిగా మారుతోంది. తామెప్పుడు మరణిస్తామో తెలియదు కనుక, మేం మరణిస్తే మీకు ఇక మెయిల్స్ రావు, మెసేజీలు రావు, కాల్స్ రావు, ఎప్పుడు మీకు మానుంచి ఇలాంటివి ఏవీ రావో అప్పుడు తాము మరణించినట్టు గుర్తు కనుక తక్షణం ఇక్కడికి వచ్చి తమకు అంత్యక్రియలు నిర్వహించాలని కొందరు కొండగుర్తులు కూడా చెబుతున్నారు. పాతికేళ్ల క్రితం భర్త, కుమార్తెను పోగొట్టుకున్న 91 సంవత్సరాల చికో ఇటో తమ పక్కింటివారికి ఒక విషయం చెప్పారు, 'రోజూ రాత్రి పూట ఈ కిటికీకి కర్టెన్ వేసి నేను నిద్రిస్తా, మరుసటి రోజు నిద్ర లేవగానే ముందుగా ఈ కర్టెన్ తీస్తాను, ఏరోజు నేను ఈ కర్టెన్ తీయలేదో ఆరోజు నేను మరణించినట్టు అర్థం చేసుకో' అంటూ చెప్పినట్టు వాషింగ్టన్ పోస్ట్‌లో ప్రచురితమైన వార్త సంచలనం సృష్టించింది. ఇదే ప్రాంతంలో నివసించిన మరో 69 ఏళ్ల వ్యక్తి మరణించిన మూడేళ్లకుగానూ ఎవరూ గుర్తించలేదని ఇదే పత్రిక మరో అవాక్కయ్యే కథనం ప్రచురించింది. మూడేళ్లుగా బిల్లులన్నీ ఆటోమేటిక్‌గా అతని బ్యాంకు ఖాతాల్లో కట్ అయ్యేవి, అయితే డిపాజిట్ మొత్తం అయిపోవడంతో ప్రభుత్వాధికారులు ఇతనుండే ఫ్లాట్‌కు వచ్చి, తాళం పగులగొట్టి చూడగా, కేవలం అస్థిపంజరం మాత్రమే కనిపించింది. మనుషుల మధ్య ఆప్యాయాలు, అనురాగాలు సన్నగిల్లితే ఏ దేశంలోనైనా కనిపించేది ఇలాంటి పరిస్థితులేనంటూ మానసిక శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. మొత్తానికి ఆర్థికబంధాలతోపాటు, హార్థిక బంధాలు కూడా దృఢపడితే మనిషికి మనిషి తోడుగా నిలిస్తే, మానవ మలిజీవితం కూడా సంతోషంగా సుఖాంతమవుతుంది.



గోళ్ళ రంగుతో గర్భిణులకు ప్రమాదం!




ఆ.. రెండు చుక్కల గోళ్ల రంగుతో ఏం జరుగుతుందిలే అనుకునేవారు మనలో చాలామంది ఉన్నారు. కానీ మీకు తెలుసా? గోళ్లకు రంగులు వేసుకుని ఆహారం వండడం, తినడం, తినిపించడం వంటివి చేయడం ఎంత ప్రమాదమో? కాస్మెటిక్స్‌కు అతిగా అలవాటుపడ్డ మహిళలు గర్భం దాల్చినప్పుడు వాటికి కాస్త దూరంగా ఉండలేకపోతే ఎంత ప్రమాదమో తాజా పరిశోధనలో మరోమారు తేటతెల్లమైంది.

అందం సరే పిండం జాగ్రత్త

అందాన్ని ఇనుమడించే కాస్మెటిక్స్ అంటే మోజుపడ్డం తప్పు కాదు, కానీ బిడ్డకు జన్మనిచ్చే గర్భిణీలు మాత్రం తాము ఏమి తిన్నా, ఏం చేసినా బిడ్డపై ఎలా ప్రభావం ఉంటుందో, కాస్మెటిక్స్ వల్ల కూడా అంతే దుష్ప్రభావం ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. కాబోయే తల్లులపై కాస్మెటిక్స్ సైడ్ ఎఫెక్ట్స్‌పై జరిగిన పరిశోధనలు తేల్చిన విషయాలన్నీ ఇదే విషయాన్ని రుజువుచేసాయి. కాస్మెటిక్స్‌లోని కెమికల్స్ ప్రభావం గర్భస్థ శిశువుకు పెట్టే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అత్యంత ప్రమాదకరమైన రసాయనాలు

హార్మోన్స్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపే, యాంటీ ఏజింగ్ క్రీములు, నెయిల్ పాలిష్, యాంటీ బ్యాక్టీరియల్ సోపులు, హెయిర్ స్ప్రేలు, పర్ఫ్యూముల్లో ఉండే ట్యాక్సిక్ కెమికల్స్ శిశువు ఎదుగుదలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి.





గర్భస్రావాలు కూడా..

మీకు తెలుసా అత్యధిక గర్భస్రావాలకు కారణం మహిళలు వాడుతున్న ఈ కెమికల్స్ ఉన్న కాస్మెటిక్సే అని. ఆఖరుకి కొంతమంది మహిళలు గర్భం దాల్చకుండా దుష్ప్రభావంచూపేంత శక్తివంతమైన ఈ కాస్మెటిక్స్‌కు కాస్త దూరంగా ఉంటే కాబోయే తల్లులు తమ పిల్లలను ప్రమాదాలనుండి కాపాడుకున్నవారవుతారు. ఇవి సోపులు, షాంపులు, కండిషనర్లు, టాల్కంపౌడర్లు ఇలా ప్రతి సౌందర్య సాధనాల్లోనూ ఉంటాయి. గర్భస్త శిశువు శారీరక, మానసిక ఎదుగుదలను శాశించే కొన్ని రసాయనాలు కాస్మెటిక్స్‌లో ఉన్నాయని, ఎంత మంచి బ్రాండ్ ప్రొడక్ట్ అయినా వాటిలో ఇవి అంతర్లీనంగా దాగి ఉంటాయన్నది పరిశోధకుల వాదన.



బ్యూటీషియన్లు పారాహుషార్

కేవలం మేకప్ చేసుకునేవారు మాత్రమే కాదు, బ్యూటీషియన్లు అత్యంత జాగ్రత్తగా ఉండాలని వీరు చెబుతున్నారు. గంటలతరబడి ఇలాంటి రసాయనాల మధ్య గడిపే వీరు, కాస్మెటిక్స్ వాడకపోయినా, వాటిని వాడినంతలా ప్రమాదాలున్నాయని పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. ఉదాహరణకు నెయిల్ పాలిష్‌లో ఉండే టీపీహెచ్‌పీ (ట్రైఫినైల్ పాస్ఫేట్) తక్షణం మెటబాలైజ్ అయి డీపీహెచ్‌పీ (డిఫినైల్ పాస్ఫేట్)గా మారి, మహిళల్లో ఫర్టిలిటీ సమస్యలు సృష్టిస్తుందని, ఉదయ్‌పూర్‌కు చెందిన ఐవీఎఫ్ నిపుణురాలు డాక్టర్ అల్కా హెచ్చరించారు. టీపీహెచ్‌పీ అధికంగా ఉన్న నెయిల్ పాలిష్ ఉపయోగించిన గర్భిణీకి గర్భస్రావం జరిగే ప్రమాదముంది లేదా గర్భస్థ శిశువు పిండాభివృద్ధిపై దుష్ప్రభావం చూపే సూచనలున్నాయి. నెలలు నిండకముందే ప్రసవం కావడం వంటివి కూడా జరిగే ప్రమాదాలున్నాయి. నెయిల్ పాలిష్ వేసిన వారిపైన కాసింత పాలిష్ పడిందో, వారిపైన కూడా అంతే ప్రభావం చూపే అవకాశముంది. అందుకే కన్సీవ్ అయ్యాక డెలివరీ అయ్యేవరకూ చాలా మితంగానే కాస్మెటిక్స్‌ను ఉపయోగించాలి, లేదా వాటికి విరామమిస్తే మరీ మంచిది. ఒకవేళ వీటిని వాడాల్సివస్తే, అందులోని రసాయలనాలు ఏమిటి, ఎంతపాళ్లలో అవి ఉన్నాయి వంటి విషయాలపై అవగాహన ఉండడం తప్పనిసరి. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ ద్యాన్ క్యూర్' అన్నట్టు గర్భిణీలు కెమికల్స్‌తో జాగ్రత్తగా ఉండడం అత్యవసరం అన్న విషయాన్ని కుటుంబీకులంతా గుర్తెరగాలి.



భారత్‌కు ఎస్-400 క్షిపణులు

(మొదటిపేజీ తరువాయి)


అరేబియా దేశాలు కూడా రష్యా నుంచి ఈ క్షిపణులను కొనుగోలు చేశాయి. ఇక ఉక్రెయిన్ సరిహద్దుల్లో రక్షణ వ్యవస్థను పటిష్ఠ పరిచేందుకు రష్యా ఈ క్షిపణులను ఉపయోగిస్తోంది. కాగా, వైమానిక దాడులను నిరోధించే పటిష్ఠ వ్యవస్థను ఈ క్షిపణులతో ఏర్పాటు చేసుకోవచ్చని రక్షణ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఉపరితలం నుంచి గగనతలంపైన ప్రయాణించే శత్రు దేశాల విమానాలను, మిస్సైల్స్‌ను, నిఘా, యుద్ధ విమానాలను ఈ క్షిపణులతో కూల్చివేయవచ్చని తెలిపాయి. ఇప్పటి వరకు ఉన్న రక్షణ వ్యవస్థల్లో ఎస్-400 ట్రయంఫ్ అత్యాధునికమైనది. శత్రు దేశాల స్ట్రాటజిక్ బాంబర్లు, స్టెల్త్ ఫైటర్లు, గూఢచర్య విమానాలు, మిసైల్స్, డ్రోన్లను ఇది గుర్తించి ఇది నాశనం చేయగలదు. ఆకాశంలో 30 కిలోమీటర్ల ఎత్తులో 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించేందుకు ఈ క్షిపణులు తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాల సమాచారం ప్రకారం ఈ ఒప్పందాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలోనే కుదుర్చుకోవాలనుకుంటున్నారు. రానున్న 54 నెలల్లో ట్రయంఫ్ క్షిపణులు మన దేశానికి వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఈ క్షిపణితో పాకిస్థాన్ వద్ద ఉన్న షార్ట్ రేంజ్ నస్ర్ న్యూక్లియర్ మిస్సైల్‌ను మధ్యలోనే ఎదుర్కొన్ని ధ్వంసం చేయొచ్చు. తక్కువ పరిధిగల ఈ అణు క్షిపణిని ప్రదర్శిస్తూ భారత్‌కు పాక్ హెచ్చరికలు పంపిన విషయం తెలిసిందే! దీంతో ఎస్-400 క్షిపణులు అందుకుంటే పాక్ బెదిరింపులను లక్ష్యపెట్టాల్సిన అవసరం ఉండబోదని రక్షణ శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

కేరళలో నేడు డ్యాం సేఫ్టీ సదస్సు

- ఇదే తొలి అంతర్జాతీయ సదస్సు
- ప్రారంభించనున్న సీఎం విజయన్
- రెండు రోజులపాటు నిర్వహణ

న్యూఢిల్లీ, జనవరి 22: సాగు, తాగు నీటి నిల్వ కోసం నిర్మించిన భారీ డ్యాంలకు సంబంధించి భద్రతా పరమైన అంశాలను చర్చించేందుకు తొలి అంతర్జాతీయ సమావేశం కేరళలో జరగనుంది. మంగళవారం నాడు తిరువనంతపురంలో అంతర్జాతీయ డ్యాం సేఫ్టీ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభిస్తారని పేర్కొంది. ఈ సమావేశానికి కేంద్ర జలవనరుల శాఖ సహాయమంత్రి అర్జున్ రాం మేఘవాల్ హాజరుకానున్నారని తెలిపింది. ప్రపంచంలోని 20 దేశాలకు చెందిన 550 మంది ప్రతినిధులు పాల్గొనే ఈ సమావేశంలో డ్యాంల భద్రతపై చర్చ జరగనుంది. డ్యాంల భద్రతకు సంబంధించి రూపొందించిన ఏడు విధివిధానాల అమలు సాధ్యాసాధ్యాలను కూలంకషంగా పరిశీలించనున్నారు. డ్యాం రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు(డ్రిప్)గా వ్యవహరించే ఈ పద్ధతిలో సుమారు 223 పెద్ద డ్యాంల విషయంలో అమలుచేయాలని కేంద్రం నిర్ణయించిందని సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ ప్రమోద్ నారాయణ్ పేర్కొన్నారు. డ్యాంల రక్షణ వ్యవహారలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ధర్మ పేరుతో ఓ వెబ్ టూల్‌ను అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. దీంతో పాటు ఈ సమావేశంలో భద్రత ఏర్పాట్లకు సంబంధించిన 140 సాంకేతిక పరిశోధన పత్రాలను ప్రెజెంట్ చేయనున్నట్లు నారాయణ్ వివరించారు.

రెండుచోట్లా పోటీ



(మొదటిపేజీ తరువాయి)

చేరకపోయినా వారి సూచనలతో ముందుకు వెళ్తామని పవన్ వెల్లడించారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో రెండు రోజుల పాటు పర్యటించనున్నట్లు వివరించారు. మంగళవారం, బుధవారం పూర్వపు కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల కార్యకర్తలతో సమావేశమై ఇక్కడి సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. తెలంగాణ అంటే తనకు ఎంతో ప్రేమ ఉందని, ఇక్కడ కూడా తనకు అభిమానులు ఉన్నారని, 2019 ఎన్నికల్లో రెండు రాష్ట్రాల్లో పోటీ చేస్తామని వెల్లడించారు. అయితే ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ఇప్పుడే చెప్పలేమని, తమ పార్టీ బలమెంత అనేది ఎన్నికలకు రెండు నెలల ముందు తెలుస్తుందని, అప్పుడే నిర్ణయం తీసుకోగలుగుతామని చెప్పారు. అయితే తన రాజకీయాలతో చిరంజీవికి సంబంధం లేదని, కుటుంబంలో ఎవరి మద్దతు కోరలేదని, కోరబోనని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం సినిమాలపై ఇక తనకు దృష్టి లేదని వెల్లడించారు. తమ పార్టీని బీజేపీ అసలు గుర్తించడం లేదని, పార్టీ పెట్టడం ఎందుకు బీజేపీలో చేరాలని అమిత్ షా తనకు సూచించారని, ఆయన ప్రతిపాదనను తాను సున్నితంగా తిరస్కరించానని పవన్ చెప్పారు. సమస్యల పరిష్కారం కోసమే తాను రాజకీయాలు చేస్తానని, ఎవరికీ లబ్ధి చేకూర్చడానికి పార్టీ పెట్టలేదని వివరించారు. ఇరు తెలుగు రాష్ట్రాల్లో చాలా సున్నితమైన సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి పోరాడుతామని అన్నారు. విధ్వంసపూరిత రాజకీయాలు చేయబోనని, తాను ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూసే వ్యక్తిని కాదని, జనసేన ప్రతి అడుగు నిర్మాణాత్మకంగా ఉంటుందని చెప్పారు. ఓటుకు నోటు అంశం తప్పని తనకు తెలిసినప్పటికీ రాజకీయంగా అస్థిరతకు కారణమవ్వడం ఇష్టంలేక మౌనంగా ఉన్నానని చెప్పారు. ఇప్పుడు ఈ పని అన్ని పార్టీలు చేస్తున్నదేనని అభిప్రాయపడ్డారు. జనసేన పార్టీ కార్యాలయాలను అనంతపురం జిల్లా నుంచే ప్రారంభించామని, అక్కడి నుంచి ఏపీలో తన ప్రజాయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ నెల 27 నుంచి ఇక్కడ కరువు యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఒంగోలులో ఫ్లోరోసిస్, కిడ్నీ బాధితులను కలుస్తామని, విశాఖ ఏజెన్సీ ప్రాంతంలోనూ పర్యటిస్తామని పేర్కొన్నారు. అలాగే కొవ్వాడ అణు విద్యుత్ ప్రాజెక్టుకు వెళ్తామని, దీనిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని అన్నారు. అయితే అనంతపురం పర్యటన పూర్తయిన తర్వాత ఇతర జిల్లాల పర్యటన తేదీలను ఖరారుచేస్తామని పవన్ వెల్లడించారు.

కేసీఆర్‌ను కలిస్తే తప్పేంటి?

సీఎం కేసీఆర్‌ను కలవడంపై వచ్చిన ఆరోపణలను పవన్ కల్యాణ్ ఖండించారు. సీఎం కేసీఆర్‌కు తాను నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు ఆయనను కలవడంలో తప్పేంటని ప్రశ్నించారు. దశాబ్దాలుగా ఉన్న తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్ష కేసీఆర్ వల్లే సాకారమైందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రాజకీయ ఏకీకరణ చేసిన ఘనత ఆయనదేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఆయన ఎంతగానో కష్టపడుతున్నారని, ఆయన చేయగలిగింది చేస్తున్నారని పవన్ చెప్పారు. రెండు రాష్ట్రాల్లోనూ ఎన్నో సవాళ్లు ఉన్నాయని, వాటి పరిష్కారానికి జనసేన చేయగలిగి సాయం చేస్తుందని వెల్లడించారు.

అంజన్నను నమ్మితే అసాధ్యాలు సుసాధ్యం

కొండగట్టు ఆంజనేయస్వామిని నమ్మితే అసాధ్యాలు కూడా సుసాధ్యమవుతాయని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చెప్పారు. హైదరాబాద్ నుంచి సోమవారం ఉదయం కొండగట్టుకు బయలుదేరిన పవన్‌కు ఆయన భార్య అన్నా లెజినోవా హారతి ఇచ్చి.. బొట్టు పెట్టి సాగనంపారు. ఆయన కారుకు మహిళలు గుమ్మడికాయతో దిష్టి తీసి పంపారు. అంతకు ముందు పార్టీ మహిళా విభాగం 'వీర మహిళ' ఫేస్‌బుక్ పేజీని పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి కరీంనగర్ చేరుకున్న ఆయనకు అభిమానులు ఘనస్వాగతం పలికారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికి పవన్ కల్యాణ్ కొండగట్టుకు చేరుకుని అంజన్న దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఈ రోజు నేను ఇలా ఉన్నానంటే అంజన్న దయ వల్లే. నేను 2009 ఎన్నికల ప్రచారానికి ఇక్కడికి వచ్చినప్పుడు నాకు విద్యుత్ తీగలు తగిలి ప్రమాదం జరిగింది. ఆయన దయతో ప్రాణాలతో బయటపడ్డా. నేను సంపూర్ణ రాజకీయ జీవితంలోకి రావాలనుకున్నప్పుడు కొండగట్టు అంజన్నను దర్శించుకోవాలనుకున్నాను. అంజన్నను నమ్ముకుంటే అసాధ్యాలైనా సుసాధ్యం కావాల్సిందే. అందుకే ఇక్కడి నుంచే ప్రజా యాత్ర ప్రారంభిస్తున్నా' అని చెప్పారు. కాగా, ఆలయ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని పవన్ చెప్పారు. ఈ సందర్భంగా ఆలయానికి రూ.11 లక్షల విరాళాన్ని అందజేశారు.



ఎన్నారైలే అంబాసిడర్లు

(మొదటిపేజీ తరువాయి)

చేసేందుకు, ఆసక్తిగల పారిశ్రామికవేత్తలను తెలంగాణ ప్రభుత్వంతో అనుసంధానించడానికి ఎన్నారై మిత్రులు కలిసి రావాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నారైలు కీలకపాత్ర పోషించారన్నారు. తెలంగాణ ప్రజలు ఆకాంక్షించిన లక్ష్యాల సాధన దిశగా ప్రయాణం మొదలైందని, సీఎం కేసీఆర్ నేతత్వంలో బంగారు తెలంగాణను సాధిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు, పాలసీలు, రాష్ట్రంలో వాటి అమలు తీరుతెన్నులు తదితర అంశాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులను కూడా ప్రస్తావించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వం అద్భుతమైన ప్రగతి దిశగా రాష్ట్రాన్ని తీసుకెళ్తోందన్నారు. పదిహేనేళ్ల క్రితం ఏర్పాటైన రాష్ట్రాలు కూడా ఇంకా పూర్తిగా కుదురుకోని పరిస్థితుల్లో ఉంటే తెలంగాణ మాత్రం మూడున్నరేళ్ల లోనే అనేక రంగాల్లో ముందుకెళ్తోందన్నారు.

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణ ప్రజలకి విద్యుత్ కష్టాలు తొలగిపోయాయి కానీ కాంగ్రెస్ పార్టీకి మాత్రం పవర్ పోయిందన్నారు. కేవలం రాష్ట్రంలోనే కాదు దేశంలోనే కాంగ్రెస్ పవర్ పోతోందని, అందుకే రైతాంగానికి ఇస్తున్న 24 గంటల విద్యుత్ సరఫరాను రాజకీయం చేస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం పరిపాలనలో ప్రజల కనీస అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. రాష్ట్రం అంతటా తాగు, సాగునీరు కల్పనకు సీఎం కేసీఆర్ ప్రాముఖ్యత ఇస్తున్నారని వివరించారు.

ఎన్నారైల ప్రశ్నలకు జవాబులు

ప్రసంగం అనంతరం ఎన్నారైలు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానాలు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రులు, స్కూళ్లను చక్కదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. ఎన్నారైలు తెలంగాణలో భూములు ధైర్యంగా కొనవచ్చని, భూ రికార్డుల ప్రక్షాళనచేసి అన్నీ ఆన్‌లైన్‌లోకి తెస్తున్నామని చెప్పారు. చెరువుల ప్రక్షాళన, హైదరాబాద్ నగరంలో మెరుగు పడిన శాంతి భద్రతలు, వాతావరణ కాలుష్యం, క్రీడల అభివృద్ధి తదితర అంశాలపైన మంత్రి సమాధానాలిచ్చారు. జ్యూరిచ్ నగరంలోని శ్రీధర్ గండె, అల్లు క్రిష్ణ రెడ్డి, అనిల్ జాలా, కిషోర్ తాటికొండ తదితరులు ఈ సమావేశాన్ని నిర్వహించారు. స్వీడన్, జర్మనీ, యూకే, స్విట్జర్లాండ్ దేశాల నుంచి తెలుగువాళ్లు ఈ సమావేశానికి హాజరయ్యారు.

అభివృద్ధిలో దూసుకెళ్తున్న హైదారాబాద్..

తెలంగాణ అన్ని రంగాల్లో ముందుకెళుతుండగా.. హైదరాబాద్ నగరం అభివృద్ధిలో దూసుకెళుతోందని నగర మేయర్ బొంతు రామ్మోహన్ పేర్కొన్నారు. జ్యూరిచ్‌లో ఎన్నారైల ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లలో హైదరాబాద్‌లో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఇప్పటికే అనేక కార్యక్రమాలను రూపకల్పన చేశామని, వాటి అమలును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. నగరాభివృద్ధికి సలహాలు, సూచనలు చేయాలంటూ మేయర్ ఏన్నారైలను కోరారు.





చెక్కు చెదరలే

(మొదటిపేజీ తరువాయి)

వరుసపెట్టి పార్టీ నుంచి బయటకు వలసలు ఎన్ని కనిపించినా.. ప్రజల్లో మాత్రం వైఎస్ఆర్‌సీపీకి బలం బాగానే ఉందని రిపబ్లిక్-సీ ఓటర్ సర్వేలో తేలింది. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రంలోని మొత్తం 25 లోక్‌సభా స్థానాలకు గాను వైఎస్ఆర్‌సీపీ 13 చోట్ల గెలుస్తుందని, టీడీపీ-బీజేపీ కూటమికి మిగిలిన 12 వస్తాయని ఈ సర్వే చెప్పింది. 2014 సంవత్సరంలో 17 స్థానాలను గెలుచుకున్న ఈ కూటమి.. తన బలంలో ఐదు స్థానాలను కోల్పోతుందని స్పష్టం చేసింది. మరోవైపు వైఎస్ఆర్‌సీపీకి ప్రజల్లో బలం పెరగడం వల్ల ఆ పార్టీ లోక్‌సభా స్థానాల విషయంలో తన బలాన్ని పెంచుకుంటుందని తెలిపింది. అయితే.. ప్రస్తుతం వైఎస్ఆర్‌సీపీకి రాజకీయ సలహాదారుగా ఉన్న ప్రశాంత కిషోర్ చేయించుకున్న సొంత సర్వేలో మాత్రం ఫలితాలు ఇంత ఆశాజనకంగా ఉన్నట్లు చెప్పలేదని వినికిడి. ఆ సర్వే వివరాలు ఎక్కడా ఇంతవరకు బయటపడలేదు.

రజనీ హవా!

గతంలో ఇండియాటుడే చేసిన సర్వేలో తమిళనాట ఇంకా పేరు ప్రకటించని రజనీకాంత్ పార్టీ కేవలం 33 అసెంబ్లీ స్థానాల్లో మాత్రమే గెలుస్తుందని చెప్పగా.. రిపబ్లిక్ టీవీ మాత్రం ఏకంగా 23 ఎంపీ సీట్లను కైవసం చేసుకుంటుందని చెబుతోంది. డీఎంకేకు 13, అన్నాడీఎంకేకు 3 స్థానాలు వస్తాయట.

జాతీయ స్థాయిలో...

నరేంద్ర మోదీ - అమిత్‌షాల సారథ్యంలో విజయవిహారం చేస్తున్న బీజేపీ రాబోయే ఎన్నికల్లో 335 లోక్‌సభా స్థానాలలో గెలుస్తుందన రిపబ్లిక్ టీవీ- సీ ఓటర్ అంచనా వేసింది. ప్రధాని మోదీకి 66 శాతం మంది మద్దతు పలకగా, రాహుల్‌గాంధీకి కేవలం 28 శాతం మందే మద్దతుగా నిలిచారన్నారు. యూపీఏ భాగస్వామ్య పార్టీలన్నింటికీ కలిపి 89 స్థానాలు మాత్రమే వస్తాయని చెప్పారు. కర్ణాటకలో మళ్లీ బీజేపీ తన కాషాయధ్వజాన్ని ఎగరేసే అవకాశాలున్నాయని అంటున్నారు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఎన్డీయేకు 60, యూపీఏకు 18, ఇతరులకు 2 స్థానాలు వస్తాయని చెప్పారు. మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో ఎన్డీయేకు 23, యూపీఏకు 3 సీట్లు వస్తాయన్నారు. దేశ రాజధాని అయిన ఢిల్లీలో మొత్తం 7 లోక్‌సభ స్థానాలూ ఎన్డీయే ఖాతాలోకే వెళ్తాయట. దక్షిణ భారతంలో ఆ పార్టీకి ఒక్క కర్ణాటక తప్ప వేరెక్కడా పెద్దగా ఆశలు లేకపోయినా ఏకంగా 61 శాతం లోక్‌సభా స్థానాలు ఆ పార్టీకే ఎలా దక్కుతాయో చూడాలి. సర్వే ఫలితాలు అన్నీ ఏకపక్షంగా కనిపిస్తున్నాయని, చూడబోతే కావాలని బీజేపీ.. దాని మిత్రులకు అధిక న్యాయం చేయడానికి ప్రయత్నించినట్లు క నిపిస్తోందని కొన్ని విమర్శలు సైతం వచ్చాయి.



2017లో అత్యధిక ఉష్ణోగ్రతలు

- రికార్డుల్లో రెండో స్థానం.. నాసా పరిశోధకుల వెల్లడి


వాషింగ్టన్, జనవరి 22: ఏటేటా పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో గత ఏడాది అత్యధిక ఉష్ణోగ్రత నమోదు చేసిన రెండో సంవత్సరంగా 2017 నిలిచిందని నాసా ప్రకటించింది. భూతాపంపై నాసా సుదీర్ఘకాలంగా పరిశోధన చేస్తోంది. ఏటా నమోదవుతున్న ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. నానాటికీ వేడి పెరుగుతోందని వెల్లడైంది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 2017లో సగటున 0.90 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగిందని నాసా పరిశోధకులు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. 1951 నుంచి 1980 వరకు సగటు ఉష్ణోగ్రత ఏటా పెరుగు తూ వస్తోందని తెలిపారు. ఈమేరకు న్యూయార్క్‌లోని నాసాకు చెందిన గోడార్డ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ స్టడీస్(జీఐఎస్ఎస్) సంస్థ పరిశోధకులు వెల్లడించారు. మరోవైపు నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్(ఎన్ఓఏఏ) జరిపిన స్వతంత్ర పరిశోధనలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరాలలో 2017 కూడా ఒకటని.. రికార్డుల ప్రకారం చూస్తే గత ఏడాది మూడో స్థానంలో ఉందని తేల్చింది. నాసా పరిశోధనలో 2017కు రెండో స్థానం, ఎన్ఓఏఏ అధ్యయనంలో మూడో స్థానం దక్కడానికి ఆయా సంస్థలు ఉపయోగించిన పద్ధతులేనని సమాచారం. భూతాపం లెక్కించడానికి ఈ రెండు సంస్థలు రెండు వేర్వేరు పద్ధతులను ఉపయోగించాయని పరిశోధకులు తెలిపారు. అయితే, అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన టాప్-5 సంవత్సరాల వివరాలను ఇవి రెండూ ప్రకటించడం విశేషం! కాగా, ఉష్ణోగ్రత లెక్కించేందుకు వాతావరణ శాఖ ఏర్పాటు చేసిన ప్రాంతాలు ఏటేటా మారడం, లెక్కింపు విధానాలను తరచుగా మార్చడం, ఉష్ణోగ్రతల అంచనాలు తప్పడం తదితర పరిమితులను మినహాయించి ఈ లెక్కలు తీసినట్లు చెప్పారు. అయితే, ఏటేటా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, భూతాపం పెరుగుతోందనే విషయం సత్యదూరం కాదని స్పష్టంచేశారు.

సరిహద్దు ఉద్రిక్తం

పాక్ దాడికి బీఎస్ఎఫ్ దీటుగా బదులు


- నాలుగు రోజుల్లో 9 వేల మోర్టార్ల వర్షం
- 190 కిలోమీటర్ల పరిధిలో పరిస్థితి తీవ్రం
- అంతర్జాతీయ హద్దున అత్యంత అప్రమత్తత

న్యూఢిల్లీ, జనవరి 22: జమ్ముకశ్మీర్ పరిధిలో అంతర్జాతీయ సరిహద్దు వద్ద పరిస్థితి అత్యంత ఉద్రిక్తంగా ఉంది. కవ్వింపు కాల్పులకు తెగబడుతున్న పాక్ సైనికులకు భారత సరిహద్దు భద్రత దళం (బీఎస్ఎఫ్) జవాన్లు దీటుగా బదులిస్తున్నారు. ఈ మేరకు పాక్ రేంజర్ల స్థావరాలు లక్ష్యంగా 4 రోజుల వ్యవధిలో 9వేల మోర్టార్ బాంబుల వర్షం కురిపించినట్లు బీఎస్ఎఫ్, కేంద్ర హోంశాఖ ఉన్నతాధికారులు సోమవారం ప్రకటించారు. దీంతో పలు ప్రదేశాల్లో శత్రువుల చమురు డంపులు, స్థావరాలు ధ్వంసమైనట్లు వెల్లడించారు. ఆదివారం నుంచీ పాక్ సైనిక మూకలు భారీస్థాయిలో కాల్పులకు దిగడంతో 190 కిలోమీటర్ల అంతర్జాతీయ సరిహద్దు తీవ్ర ఉద్రిక్తంగా ఉందని పేర్కొన్నారు. వారిని అదుపు చేసేందుకు భారీ సంఖ్యలో మోర్టార్ బాంబులు ప్రయోగించడంతోపాటు ఇతర ఆయుధాలను, ఆయుధ సామగ్రిని కూడా వినియోగిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండాసరిహద్దు పొడవునా కనీసం వారం పాటు 'అత్యంత అప్రమత్తత' ప్రకటించామన్నారు. జవాన్ల దాడితో పాక్ సరిహద్దు దళాల ఇంధన డంపులు ధ్వంసమై తగలబడుతున్న దృశ్యాలతో కూడిన రెండు వీడియోలను కూడా బీఎస్ఎఫ్ విడుదల చేసింది. మక్వాల్-కనాచక్‌ల సమీపాన బీఎస్ఎఫ్ శిబిరాలున్న 'చికెన్ నెక్' ప్రాంతంలో ఇప్పటివరకూ ఎలాంటి అలజడి లేదని, తాజాగా అక్కడ కూడా పాక్ కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడిందని అధికారులు చెప్పారు. దీంతో ఇక్కడ భద్రతదళ జవానుతోపాటు కొందరు పౌరులు గాయపడ్డారని తెలిపారు. మరోవైపు భారత సరిహద్దు సమీపంలో పాక్ సైనిక ఉన్నతాధికారుల సంచారం కూడా కనిపిస్తోందని పేర్కొన్నారు. ''భారత్ ప్రతి దాడితో చాలామంది పాక్ సైనికులు తీవ్రంగా గాయపడటంతోపాటు చెల్లాచెదరవుతుండటంతో వారిలో ఆత్మస్థైర్యం నింపడానికే ఉన్నతాధికారులు వచ్చారని మా అభిప్రాయం'' అని ఈ సందర్భంగా ఒక అధికారి అన్నారు. తాము చర్చలకు పిలిచినా పాక్ సైనికులు తిరస్కరిస్తున్నారని, ఉగ్రవాదులను భారత భూభాగంలోకి పంపడమే వారి ఉద్దేశంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. అలాంటి దుస్సాహసానికి పాల్పడే ముష్కరులను కనిపిస్తే కాల్చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.



కాలేజీల్లో ఆత్మహత్యలపై హైకోర్టు విచారణ

- లోక్‌సత్తా నేత లేఖ.. పిల్‌గా పరిగణించిన కోర్టు
- నేడు విచారించనున్నట్లు వెల్లడి



హైదరాబాద్, జనవరి 22 (మనం లీగల్ ప్రతినిధి): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై లోక్‌సత్తా నేత ఒకరు రాసిన లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణిస్తూ హైకోర్టు విచారణ స్వీకరించింది. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, విద్యా శాఖ, హోం శాఖల ముఖ్య కార్యదర్శులు, ఇంటర్ బోర్డు కార్యదర్శులు, శ్రీచైతన్య, నారాయణ కాలేజీల యాజమాన్యాలను ప్రతివాదులు చేసింది. ఈ అంశంపై మంగళవారం విచారణ జరపనున్నట్లు కోర్టు తెలిపింది. ఇరు రాష్ట్రాల్లోని కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరపాలని, సంబంధిత కాలేజీ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెట్టా లని కోరుతూ ప్రకాశం జిల్లాలోని లోక్‌సత్తా ఉద్యమ సొసైటీ జిల్లా కన్వీనర్ దాసరి ఇమ్మాన్యుయల్ హైకోర్టుకు లేఖ రాశారు. కాలేజీల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై కమిటీలు వేసినా నివేదికలు ఇవ్వలేదని అందులో పేర్కొ న్నారు. కాలేజీల్లో ఒత్తిడి తట్టుకోలేక ఇటీవల పది మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఈ ఘటనల తర్వాత కూడా కాలేజీ యాజమాన్యాల్లో మార్పు రాకపోవడం లేదని ఆయన లేఖలో ప్రస్తావించారు. ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్న కాలేజీల్లో ఒకటి ఏపీ మంత్రిదని పేర్కొన్నారు. కాలేజీలకు, దానికి అనుబంధంగా ఉన్న హాస్టళ్లకు అనుమతులుకూడా లేవన్నారు. విద్యార్థుల ఆత్మహత్యల అంశాన్ని తీవ్రంగా పరిగణించిన కోర్టు ఈ లేఖను పిల్‌గా పరిగణిస్తూ విచారణకు స్వీకరించింది.

Dwaraka

మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అరెస్ట్


- 2008 గుజరాత్ బాంబు పేలుళ్ల నిందితుడు
- ప్రధాన నగరాల్లో బాంబు దాడుల్లో హస్తం
- ఢిల్లీలో పట్టుబడిన 'భారత్ బిన్ లాడెన్' ఖురేషి
- సిమి, ముజాహిద్దీన్ సంస్థలతో సంబంధాలు
- బాంబు మేకర్‌గా మారిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



న్యూఢిల్లీ, జనవరి 22: దేశంలోనే మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, 2008లో గుజరాత్ వరుస బాంబు పేలుళ్ల నిందితుడు, భారత్ బిన్ లాడెన్‌గా పిలిచే అబ్దుల్ సుభాన్ ఖురేషి (46)ని ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఘాజీపూర్‌లో ఖురేషి కాల్పులు జరిపేందుకు ప్రయత్నించగా.. పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి పిస్టల్, పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన ఖురేషి ముజాహిద్దీన్ ఉగ్రవాద సంస్థలో చేరాక బాంబులు తయారు చేసేవాడు. సిమి, ఇండియన్ ముజాహిద్దీన్ ఉగ్రవాద సంస్థలకు మళ్లీ ఊపిరి పోసేందుకు అతను ప్రయత్నిస్తున్నట్టు ఢిల్లీ స్పెషల్ సెల్ డీసీపీ ప్రమోద్ కుష్వావా చెప్పారు. గుజరాత్ పేలుళ్ల తర్వాత ఖురేషి తప్పుడు పత్రాలతో నేపాల్ వెళ్లి కొన్నేళ్లు అక్కడే తలదాచుకున్నాడని తెలిపారు. 2013–2015 మధ్య సౌదీ అరేబియాకు వెళ్లాడని, తర్వాత భారత్‌కు తిరిగి వచ్చి ఉగ్రవాద ముఠాను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించినట్టు వెల్లడించారు. నిషేధిత సిమితోనూ ఖురేషికి సంబంధాలున్నట్టు తెలిపారు. కొన్నేళ్లుగా అతడిని అరెస్ట్ చేసేందుకు దేశ వ్యాప్తంగా గాలిస్తున్నామని, రిపబ్లిక్ డే వేడుకలకు ముందు అదుపులోకి తీసుకోవడం ఊరట కలిగించే విషయమని డీసీపీ పేర్కొన్నారు. 2008 జూలైలో గుజరాత్‌లోని సూరత్‌లో రద్దీగా ఉండే ప్రాంతంలో టిఫిన్ కారియర్లు, మోటార్ సైకిళ్లలో ఖురేషి 21 బాంబులు అమర్చాడని చెప్పారు. ఈ పేలుళ్లలో 56 మంది మరణించారు. 2014 బెంగళూరులో, 2010లో ఢిల్లీలో, 2006లో ముంబైలో బాంబు పేలుళ్ల ఘటనలో అతడి పాత్ర ఉన్నట్టు భావిస్తున్నారు. ఎన్‌ఐఏ మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఖురేషి ఉన్నాడు. గతంలో పలుమార్లు పోలీసుల నుంచి తృటిలో తప్పించుకున్నాడు.

లోయా కేసు చాలా తీవ్రమైంది

- అన్ని ఫైళ్లనూ పరిశీలిస్తాం: సుప్రీం



న్యూఢిల్లీ, జనవరి 22: సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి బీహెచ్ లోయా మృతి కేసుకు సంబంధించిన అన్ని పిటిషన్లను సుప్రీం కోర్టులోనే విచారణ సాగనుంది. ఈ మేరకు బాంబే హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న రెండు పిటిషన్లను కూడా అత్యున్నత న్యాయస్థానానికి బదిలీ చేస్తూ సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని ఫైళ్లను తమకు అందజేయాలని ఆదేశించింది. ఈ కేసును తీవ్రత దృష్ట్యా అన్ని డాక్యుమెంట్లను లోతుగా పరిశీలించాల్సి ఉందని ఈ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 2కు వాయిదా వేసింది. సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి లోయా 2014లో అకస్మాత్తుగా మరణించారు. సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా సహా పలువురు ప్రముఖులపై అభియోగాలు ఉన్నందును లోయా మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఓ కాంగ్రెస్ నేత, మహారాష్ట్రకు చెందిన పాత్రికేయుడు కోర్టును ఆశ్రయించారు. పెండింగ్‌లో ఉన్న ఈ పిటిషన్లపై తాజాగా సుప్రీంలో మరికొందరు వ్యాజ్యం దాఖలు చేయడంతో అన్ని పిటిషన్లను కలిపి విచారించాలని ధర్మాసనం నిర్ణయించింది.

అప్పు వసూలుకు వచ్చి.. ట్రాక్టర్ కింద పడేసి చంపేశారు

- లోన్ రికవరీ ఏజెంట్ల దారుణం
- యూపీలోని సీతాపూర్‌లో దారుణం



సీతాపూర్, జనవరి 22: రుణం రికవరీకి వచ్చిన ఏజెంట్లు అత్యంత కిరాతకంగా వ్యవహరించారు. ఓ రైతును ఆయన ట్రాక్టర్ కింద పడేసి.. ఆయన మీద నుంచి నడుపుకుంటూ వెళ్లి హత్య చేశారు. ఈ దారుణ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం జ్ఞాన్‌చంద్ర (45) ట్రాక్టర్ కొనడానికి రూ.99 వేలు అప్పు చేశారు. ఇంకా రూ.90 వేలు చెల్లించవలసి ఉంది. దానిని వసూలు చేయడానికి కొందరు ఏజెంట్లు ఆయన వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా వారి మధ్య ఘర్షణ జరిగింది. ఆ ఏజెంట్లు ట్రాక్టర్‌ను తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. తాను రూ.35 వేలు చెల్లించానని జ్ఞాన్‌చంద్ చెప్పినప్పటికీ వారు వినలేదు. ఆయన వద్దనుంచి ట్రాక్టర్ తాళాలను లాక్కున్నారు. ట్రాక్టర్‌ను తీసుకెళ్లకుండా అడ్డుకునేందుకు జ్ఞాన్‌చంద్ర ప్రయత్నించగా, ఆయనను ట్రాక్టర్‌పై బలవంతంగా కూర్చోబెట్టారు. అనంతరం క్రిందకు తోసేసి, ఆయనపై నుంచి ఆ ట్రాక్టర్‌ను నడిపించుకుంటూ వెళ్లిపోయారు. కాగా, లోన్ రికవరీ ఏజెంట్లపై కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

ఢిల్లీ మెట్రోలో బుల్లెట్ల కలకలం

- మహిళ బ్యాగ్‌లో 20 రౌండ్లు స్వాధీనం

న్యూఢిల్లీ, జనవరి 22: ఇరవై రౌండ్ల బుల్లెట్లను బ్యాగులో తీసుకెళుతున్న ఓ మహిళను ఢిల్లీలోని ఓ మెట్రో స్టేషన్‌లో భద్రత సిబ్బంది పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మురదాబాద్‌కు చెందిన ఓ మహిళ ఆదివారం సాయంత్రం ఆదర్శనగర్ మెట్రో స్టేషన్‌లో రైలు ఎక్కేందుకు తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చింది. ఆమె బ్యాగును తనిఖీ చేసిన సీఐఎస్ఎఫ్ సిబ్బంది అందులో బుల్లెట్లును గుర్తించారు. ఆ బుల్లెట్లు తనవని, తన తుపాకీకి సంబంధించి లైసెన్సు కాపీని ఆ మహిళ తండ్రి భద్రత అధికారులకు సమర్పించారు. సంబంధిత మహిళ, ఆమె కుటుంబసభ్యులను సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఢిల్లీ పోలీసులకు అప్పగించారు.

ఏడుగురు చిన్నారుల సజీవ దహనం

- యూఏఈలో దుర్ఘటన

దుబాయ్, జనవరి 22: అగ్నిప్రమాదం సంభవించడంతో ఓ ఇంట్లో నిద్రిస్తున్న ఏడుగురు చిన్నారులు మరణించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని తీర ప్రాంతంలోని దాదనా అనే గ్రామంలోని ఓ ఇంట్లో సోమవారం ఉదయం ఈ దుర్ఘటన జరిగింది. మృతుల్లో నలుగురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. మంటలు కారణంగా ఇల్లంతా పొగలు వ్యాపించగా, పొగకు ఊపిరి ఆడకా పిల్లలంతా మరణించారు. వీరంతా ఐదు నుంచి పదమూడేళ్ల లోపు వయస్సు వారే. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆపివేశారు. మంటలు రేగడానికి గల కారణం తెలియాల్సి ఉంది.

ఫాక్‌ల్యాండ్ దీవుల్లో 'తరిణి'

పోర్ట్ స్టాన్లీ, జనవరి 22: అందరూ మహిళా సిబ్బందితో కూడిన ఐఎన్ఎస్‌వీ తరిణి సోమవారం ఫాక్‌ల్యాండ్ దీవుల్లోని పోర్ట్ స్టాన్లీ ఓడరేవుకు చేరుకుంది. ఈ నెల 18న కేప్ ఆఫ్ హార్న్‌ను దాటుకుని ఈ నౌక దూసుకెళ్లింది. ప్రపంచాన్ని చుట్టి రావడమే లక్ష్యంగా ఈ నౌకాయానం జరుగతున్న విషయం తెలిసిందే. అయితే.. వివిధ మరమ్మత్తుల అనంతరం పోర్ట్ స్టాన్లీ నుంచి ఈ యాత్ర ఫిబ్రవరి 4 నుంచి మళ్లీ ప్రారంభంకానుంది. కాగా, నావికాసాగర్ పరిక్రమ పేరుతో ఈ నౌక పసిఫిక్ మహా సముద్రంలో 41 రోజులపాటు ప్రయాణించిందని, ఆ సమయంలో వాతావరణ పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నాయని ఓ ప్రకటనలో నావికా దళం తెలిపింది. 60 నాట్స్‌కు పైగా గాలులు, 7 మీటర్లకు పైగా కెరటాలు వచ్చాయని పేర్కొంది. ఐఎన్ఎస్‌వీ తరిణి 56 అడుగుల పొడవైన నౌక. దీనిని మన దేశంలోనే నిర్మించారు. 'మేక్ ఇన్ ఇండియా'కు గుర్తుగా నిలుస్తుంది. మహిళలు సంపూర్ణ సాధికారత సాధించాలన్న జాతీయ విధానానికి అనుగుణంగా ఈ యాత్ర జరుగుతోంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటడమే దీని లక్ష్యం.

కర్ణాటకలో కాంగ్రెస్ దూకుడు

- బీజేపీపై మరో వీడియో విడుదల

బెంగళూరు, జనవరి 22: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార కాంగ్రెస్ తన దూకుడు పెంచింది. బీజేపీ, ఆరెస్సెస్‌లపై సామాజిక మాధ్యమాల బరిలో తీవ్రంగా తలపడుతోంది. తాజాగా మరో వీడియోను పోస్ట్ చేసింది. భారత రాజ్యాంగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చేయాలని బీజేపీ, ఆరెస్సెస్ పంతం పట్టాయని ఆరోపించింది. రాజ్యాంగంపై ఆరెస్సెస్ సిద్ధాంతకర్తలు వెల్లడించిన అభిప్రాయాలను దీనిలో పొందుపరిచింది. కేంద్ర మంత్రి అనంత్ కుమార్ హెగ్డే వ్యాఖ్యలతో ఈ వీడియో ప్రారంభమైంది. రాజ్యాంగాన్ని సవరించడానికే తాము అధికారంలోకి వచ్చినట్లు హెగ్డే చెప్తున్నట్లు కనిపిస్తోంది. ఆరెస్సెస్ వారసత్వాన్ని హెగ్డే అనుసరిస్తున్నారని ఆరోపించింది. ఆరెస్సెస్ సిద్ధాంతకర్త గోళ్వాల్కర్‌ను చూపిస్తూ భారత రాజ్యాంగంలో భారతీయ భావనలు కానీ, రాజకీయ సిద్ధాంతాలు కానీ లేవని అభిప్రాయపడినట్లు పేర్కొంది. రాజ్యాంగంలో ''లౌకికవాదం''ను చేర్చడంపై జనసంఘ్ వ్యవస్థాపకుడు దీన్ దయాళ్ ఉపాధ్యాయ వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని కూడా దీనిలో ఉంచారు. భారతదేశాన్ని లౌకిక రాజ్యంగా ప్రకటించడం ద్వారా భారతదేశ ఆత్మపై దాడి జరిగిందని, లౌకికవాద రాజ్యమంటే పూర్తిగా కష్టాలే ఉంటాయని దీన్‌దయాళ్ అన్నారని పేర్కొంది. ఎన్డీయే ప్రభుత్వం రాజ్యాంగాన్ని సమీక్షించేందుకు 2000వ సంవత్సరంలో వెంకటాచలయ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందని కాంగ్రెస్ పేర్కొంది. దీనిపై దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమైన సంగతిని గుర్తు చేసింది.

దావోస్‌లో ప్రధాని

ఐబీసీ ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ విందు భేటీ

- డబ్ల్యూఈఎఫ్ వార్షిక సదస్సు నేడు ప్రారంభం
- మోదీ కీలకోపన్యాసంతో సమావేశాలకు శ్రీకారం
- 24 గంటల పర్యటనలో ముమ్మర కార్యక్రమాలు



దావోస్, జనవరి 22: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో 'ప్రపంచ ఆర్థిక వేదిక' (డబ్ల్యూఈఎఫ్) ఐదు రోజులపాటు నిర్వహించే 48వ వార్షిక సదస్సు మంగళవారం ప్రారంభం కానుంది. ఈ ఏడాది ''భిన్నధ్రువ ప్రపంచం కోసం ఉమ్మడి భవిష్యత్ సృష్టి'' ఇతివృత్తంగా దీన్ని నిర్వహిస్తున్నారు. సదస్సులో పాల్గొనేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీసహా పలు దేశాల అధినేతలు, ప్రసిద్ధ పారిశ్రామికవేత్తలు సోమవారమే ఇక్కడికి చేరుకున్నారు. ప్రధాని వెంట కేంద్రమంత్రులు అరుణ్‌జైట్లీ, పీయూష్ గోయల్, సురేశ్ ప్రభు, ధర్మేంద్ర ప్రధాన్, ఎం.జె.అక్బర్, జితేంద్రసింగ్ కూడా ఉన్నారు. ఈ వేదిక చరిత్రలో తొలిసారిగా భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నేతృత్వంలో 130 మందితో కూడిన అతిపెద్ద బృందం దావోస్ చేరుకుంది. ముకేష్ అంబానీ, ఎన్.చంద్రశేఖరన్, గౌతమ్ అదానీ, అజీమ్ ప్రేమ్‌జీ, రాహుల్ బజాజ్, చందాకొచ్చర్, ఉదయ్ కోటక్, అజయ్ సింగ్ తదితర దిగ్గజాలు ఇందులో సభ్యులుగా ఉన్నారు. బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్, సంగీత దిగ్గజం ఎల్టన్ జాన్ ఈ వేదికపై సత్కారం అందుకోబోతున్నారు. రెండు దశాబ్దాల తర్వాత మొదటిసారిగా భారత ప్రధాని ఈ సదస్సుకు హాజరవుతున్నారు. ఇంతకుముందు 1997లో నాటి ప్రధాని దేవెగౌడ చివరిసారిగా ఇందులో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ కీలకోపన్యాసం, భారత్ తరపున విందుతో డబ్ల్యూఈఎఫ్ సదస్సు మంగళవారం శ్రీకారం చుట్టుకోనుంది. దావోస్‌లో ఆయన 24 గంటలపాటు మాత్రమే ఉంటారు. ఈ స్వల్ప వ్యవధిలోనే స్విస్ అధ్యక్ష, ప్రధానమంత్రులతోపాటు వివిధ దేశాల అధినేతలతో ఆయన సమావేశమవుతారు. కాగా, సోమవారం ప్రధాని స్విస్ రాజధాని జూరిక్ చేరుకుని, అక్కడినుంచి దావోస్ వెళ్లారు. అనంతరం భారత ప్రాంగణంలో 1500 మంది అతిథులకు మన దేశం తరపున ఆతిథ్యం ఇచ్చారు. ఆ తర్వాత స్విస్ అధ్యక్షుడు అలైన్ బెర్సెట్‌తో ప్రధాని ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఇది ముగిశాక రౌండ్ టేబుల్ విందులో డబ్ల్యూఈఎఫ్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ క్లాస్ ష్వాబ్‌తోపాటు 18 దేశాలకు చెందిన 40 మంది పరిశ్రమాధిపతులు, 20 మంది భారత సీఈవోలుసహా 120 మంది సభ్యులుగా ఉన్న అంర్జాతీయ వాణిజ్యమండలి (ఐబీసీ) ప్రతినిధులతో ప్రధాని ముచ్చటించారు.

భారత విజయగాధను ప్రపంచానికి చెప్పాలి

భారత వాణిజ్య బృందం ఈ సదస్సులో 'దౌత్యవేత్త' తరహా పాత్ర పోషించాలని ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ అన్నారు. ముఖ్యంగా వాణిజ్యానికి, వాణిజ్య విస్తరణకుగల సూక్ష్మ వ్యత్యాసాన్ని అవగతం చేసుకుని తగువిధంగా వ్యవహరించాలని అభిప్రాయపడ్డారు. దావోస్‌లో భారత ఘన విజయగాధను ప్రపంచానికి చెప్పాల్సి ఉందని స్పైస్‌జెట్ సీఈవో అజయ్‌సింగ్ అన్నారు. అయితే, ఇదంతా ప్రధాని ముఖతా వినాలని అంతర్జాతీయ సమాజం ఎదురుచూస్తున్నట్లు పలువురు భారత సీఈవోలు పేర్కొనడం గమనార్హం. ''ప్రపంచ ఆర్థిక వేదిక సృష్టికర్త ప్రొఫెసర్ క్లాస్ ష్వాబ్ ఆహ్వానం మేరకు తొలిసారి దావోస్ సదస్సుకు హాజరవుతున్న నేను అందుకోసం ఎదురుచూస్తున్నాను. ''భిన్న ధ్రువ ప్రపంచం కోసం ఉమ్మడి భవిష్యత్ సృష్టి'' అంశాన్ని దీనికి ఇతివృత్తంగా ఎంచుకోవడం ఆలోచనాత్మకం... ఎంతో సముచితం'' అని ఢిల్లీ నుంచి బయల్దేరే ముందు ఆయన ట్వీట్ చేయడం గమనార్హం.

మూడుదేశాల్లో ప్రధాని మోదీ పర్యటన

- 10న పాలస్తీనా.. తర్వాత ఒమన్.. యూఏఈ

న్యూఢిల్లీ, జనవరి 22: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 10 నుంచి మూడు అరబ్ దేశాల్లో పర్యటించనున్నారు. ఆ దేశాలతో భారత్ స్నేహబంధాల బలోపేతం లక్ష్యంగా తొలుత ఆయన పాలస్తీనా రాజధాని రమల్లా చేరుకుంటారు. అక్కడ పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాసీతో సమావేశమవుతారు. అనంతరం ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌నూ ప్రధాని సందర్శిస్తారు. ఇటీవల ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆరు రోజులపాటు భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ దేశానికి బద్ధ శత్రువులైన అరబ్ దేశాల సందర్శనద్వారా సంబంధాల సమతౌల్యం కోసం ప్రధాని మధ్యప్రాచ్యం వెళ్లనున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఐదు దశాబ్దాలుగా పాలస్తీనా డిమాండ్‌ను సమర్థిస్తున్న భారత్, 1988లో దానికి గుర్తింపునిచ్చింది. అయితే, నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత విదేశీ విధానాల్లో రెండు దేశాలవైపు మొగ్గు కనిపించడం మొదలైంది. కానీ, నిరుడు డిసెంబరులో ఇజ్రాయెల్ రాజధానిగా జెరూసలెంను గుర్తిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడాన్ని భారత్ వ్యతిరేకించడం గమనార్హం. ఈ మేరకు ఐక్యరాజ్యసమితిలో ఓటింగ్ సందర్భంగా 127 దేశాలతో గళం కలిపి వ్యతిరేక ఓటు వేసింది.

దావోస్‌లో స్వదేశీ రుచులు

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా స్విట్జర్లాండ్‌లో ప్రధానిసహా భారత బృందానికి స్వదేశీ రుచులు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ముంబై, హైదరాబాద్‌లోని తాజ్ గ్రూప్ హోటళ్లకు చెందిన 32 మంది పాకశాస్త్ర ప్రవీణులు ముందుగానే దావోస్ చేరుకున్నారు. వీరు 'ఇండియా అడ్డా, ఏపీ లౌంజ్, మహారాష్ట్ర లౌంజ్, ఇండియా రిసెప్షన్' వేదికలలో మొత్తం 12వేల మంది అతిథులకు తమ శాకపాకాల రుచిచూపుతారు. ఈ మూడు వేదికలలోనూ ప్రధానికి స్వదేశీ రుచులు అందుబాటులో ఉంటాయి. దీంతోపాటు తొలిరోజు మంగళవారం ప్రత్యేక 'ఇంటర్ కాంటినెంటల్' విందు ఉంటుంది. అయితే, అన్నీ శాకాహార వంటకాలే ఉంటాయని ఈ బృందానికి నేతృత్వం వహిస్తున్న రఘు దేవరా తెలిపారు. భారత్‌కే ప్రత్యేకమైన దినుసులు స్విట్జర్లాండ్‌లో లభించవని, అందుకే భారత్ నుంచి సుమారు వెయ్యికిలోల సుగంధ ద్రవ్యాలను నేరుగా, రవాణా విమానాలద్వారా చేర్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఇక్క డ ఎముకలు కొరికే శీతల వాతావరణం ఉండటంతో భారత ఫలహార శాలలో వేడివేడి దోశ, పకోడీ, వడాపావ్, చాయ్‌లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.

1% కుబేరుల వద్ద 73% సంపద

- దేశంలో పెరుగుతున్న ఆదాయ అంతరం..
- ధనవంతుల చేతుల్లోకి మరింత సంపద
- పేదరికంలో మగ్గుతున్న 67 కోట్ల మంది
- అంతర్జాతీయ సంస్థ ఆక్స్‌ఫామ్ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 22: భారత్ ఎంతో అభివృద్ధి చెందుతోంది.. ప్రపంచ శక్తిగా ఎదుగుతోంది.. నేతలు తరచూ చెప్పే మాటలు ఇవి. కానీ దేశంలో పేదలు పేదరికంలోనే మగ్గిపోతుండగా.. ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారు. ఉన్నవారికి, లేనివారికి మధ్య ఆదాయ అంతరం రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. దేశంలో నిరుడు ఉత్పత్తి అయిన మొత్తం సంపదలో 73 శాతం.. ఒక్క శాతం ధనవంతుల దగ్గరే ఉండటం ఇందుకు నిదర్శనం. అంతర్జాతీయ హక్కుల సంస్థ ఆక్స్‌ఫామ్ నిర్వహించిన తాజా సర్వేలో ఈ విషయం వెల్లడింది. ఇక దేశ జనాభాలో సగం మంది అంటే 67 కోట్ల పేదలే. వీరి సంపద నిరుడు కేవలం ఒక శాతమే పెరిగింది. ఇక ప్రపంచ వ్యాప్తంగా చూస్తే ఈ అంతరం మరింత ఎక్కువగా ఉంది. నిరుడు ప్రపంచంలో ఉత్పత్తి అయిన సంపదలో 82 శాతం.. ఒక్క శాతం ధనవంతుల చేతుల్లోకి వెళ్లింది. ఇదే సమయంలో ప్రపంచ జనాభాలో సగమంది అంటే 370 కోట్ల మంది సంపద ఏమాత్రం పెరగలేదు.

ఒక్కశాతం మంది వద్దే 58 శాతం సంపద


దేశంలోని మొత్తం సంపదలో 58 శాతం కేవలం ఒక్క శాతం సంపన్నుల దగ్గరే ఉన్నట్లు నిరుడు నిర్వహించిన సర్వేలో తేలింది. ప్రపంచ సగటు 50 శాతంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. 2017లో ఈ ఒక్క శాతం కుబేరుల సంపద 20.90 లక్షల కోట్ల రూపాయలు పెరిగినట్టు తాజా సర్వేలో వెల్లడైంది. అంటే ఈ మొత్తం భారత బడ్జెట్‌కు దాదాపు సమానం. 2010 నుంచి బిలియనీర్ల సంపద ఏటా సగటున 13 శాతం పెరుగుతోంది. సాధారణ ఉద్యోగుల వేతనాల కంటే ఆరు రెట్లు వేగంగా వృద్ధి చెందుతోంది. కాగా ఉద్యోగుల సంపద ఏటా సగటున కేవలం 2 శాతమే పెరుగుతోంది. దేశంలో అత్యున్నత గార్మెంట్ సంస్థలో పనిచేసే అత్యున్నత అధికారి ఏడాదిలో పొందే సంపదను.. గ్రామీణ ప్రాంతాల్లోని సాధారణ వేతనం పొందే పనివాళ్లు సంపాదించాలంటే 941 ఏళ్లు పడుతుందని ఈ సర్వేలో తేలింది. ఇక అమెరికాలో సీఈవో ఒక్క రోజుకు పొందే వేతనాన్ని.. సాధారణ కార్మికుడు సంపాదించాలంటే ఏడాదంతా పనిచేయాలని పేర్కొంది. ఇక ప్రపంచంలో 10 మంది బిలియనీర్లలో 9 మంది మగవారు ఉన్నారు. నిరుడు దేశంలో మరో 17 మంది బిలియనీర్లు పెరగగా, వీరి సంఖ్య మొత్తం 101కి పెరగడం గమనార్హం. నిరుడు దేశంలో బిలియనీర్లు సంపాదించిన మొత్తం రూ.4.89 లక్షల కోట్లుగా ఈ సర్వే అంచనా వేసింది. ఈ మొత్తం అన్ని రాష్ట్రాలు విద్య, ఆరోగ్యానికి కేటాయించే బడ్జెట్‌తో 85 శాతం కావడం గమనార్హం.

ఆదాయ అంతరంపై దృష్టి సారించాలి

సంపన్నులు మరింత సంపన్నులు అవుతున్నా.. దేశంలో కింది స్థాయిలో కష్టపడి పనిచేసే సగటు వేతన జీవి ఆదాయంలో మాత్రం ఎలాంటి మార్పూ లేదని ఈ సర్వే స్పష్టం చేసింది. దేశంలో ఆర్థిక వృద్ధి ఫలాలు కొందరి చేతుల్లోనే ఉన్నాయని, ఇదే పద్ధతి కొనసాగుతోందని ఆక్స్‌ఫామ్ ఇండియా సీఈవో నిషా అగర్వాల్ అభిప్రాయపడ్డారు. కేవలం కొందరికే కాకుండా దేశ ప్రజలందరికీ ఆర్థిక ఫలాలు అందేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆక్స్‌ఫామ్ సర్వేలో దేశంలోని వేలాదిమంది ప్రజల అభిప్రాయాలను సేకరించింది. దేశంలో బాగా డబ్బున్న ఆ ఒక్క శాతం మందికి భారీగా పన్నులు వేయాలని చాలా మంది అభిప్రాయపడ్డారు. సర్వేలో పాల్గొన్న 73 శాతం మంది పెరిగిపోతున్న ఆదాయ అంతరంపై అత్యవసరంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 10 దేశాల్లో 70 వేల మంది అభిప్రాయాలను ఈ సర్వే సేకరించింది. ఈ ఆక్స్‌ఫామ్ సర్వేకు చాలా ప్రాధాన్యత ఉంది. ఏటా విడుదలయ్యే ఈ సర్వేపై వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లోనూ చర్చిస్తారు.

రాజస్థాన్‌లో 'పద్మావత్' లేనట్లే!

- విడుదలకు డిస్ట్రిబ్యూటర్లు నో..
- కర్ణిసేన హెచ్చరికలతో వెనుకంజ
- నిషేధంపై స్టే ఉపసంహరణకు సుప్రీంలో రాజస్థాన్, ఎంపీ వ్యాజ్యం



ఉజ్జయిని/న్యూఢిల్లీ, జనవరి 22: 'పద్మావత్' సినిమాకు సుప్రీం కోర్టు ఉపశమనం కల్పించినా మళ్లీ కష్టాలు తప్పడం లేదు. రాజస్థాన్‌లో ఈ చిత్ర ప్రదర్శన దాదాపుగా లేనట్లే కనిపిస్తోంది. కర్ణిసేన హెచ్చరికలతో సినిమాను తీసుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు జంకుతున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, హరియాణా రాష్ట్రాల్లో సినిమా విడుదలపై విధించిన నిషేధం చెల్లదని సుప్రీంకోర్టు స్టే ఈ నెల 18 ఉత్తర్వులిచ్చింది. దీంతో నిర్మాతలు 25న సినిమాను దేశవ్యాప్తంగా విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే 'పద్మావత్' చిత్ర రాజ్‌పుత్‌ల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని తొలి నుంచీ హింసాత్మక ఆందోళనలు చేస్తున్న కర్ణిసేన మాత్రం సినిమా విడుదలైతే థియేటర్లను తగులబెడతామని హెచ్చరించింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో నిరసనలకు దిగింది. దీంతో రాజస్థాన్‌లో డిస్ట్రిబ్యూటర్లు పద్మావత్ సినిమాను తీసుకోకూడదని నిర్ణయించుకున్నట్లు సోమవారం ప్రకటించారు. ఇదిలా ఉండగా, సినిమా నిషేధంపై స్టే ఉత్తర్వులను ఉపసంహరించాలని కోరుతూ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు సోమవారం సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశాయి. సినిమాటోగ్రాఫ్ చట్టంలోని సెక్షన్–6 ప్రకారం సినిమాల విడుదలను అడ్డుకునే హక్కు తమకు ఉంటుందని కోర్టుకు విన్నవించాయి. అయితే పద్మావత్ సినిమాపై తక్షణం ఎటువంటి వ్యాజ్యాలను విచారించవద్దని నిర్మాతల తరపు న్యాయవాది హరీశ్ సాల్వే కోరారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. మంగళవారం దీనిపై వాదనలను వింటామని కోర్టు స్పష్టం చేసింది.

మధ్యప్రదేశ్‌లో కర్ణిసేన నిరసనలు

పద్మావత్ సినిమాను ఎట్టి పరిస్థితుల్లోనూ విడుదల కానీయకుండా అడ్డుకోవాల్సిందేనని డిమాండ్ చేస్తూ రాజ్‌పుత్‌ల కర్ణిసేన మధ్యప్రదేశ్‌లో నిసరనలు చేపట్టింది. ఉజ్జయిని–నాగ్దా, దేవాస్–మాక్సి, ఆగ్రా–కోట రహదారులపై టైర్లు తగు లబెట్టి కర్ణిసేన కార్యకర్తలు ఆందోళనలు చేశారు. ఆయా మార్గాల్లో గంటలపాటు వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరించారు.



మనం మూవీ
manammovie
మంగళవారం, 23 జనవరి 2018 | హైదరాబాద్ | 8

దైవ సన్నిధానం చైర్మన్‌గా మోహన్‌బాబు



విశాఖ శ్రీశారదా పీఠం అధిపతి శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి వారు ఆధ్వర్యంలో 12 మంది పాలక మండలి కొత్త సభ్యులుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌గా డా.మోహన్‌బాబు నియమితులు కాగా, కమిటి సభ్యులుగా ప్రముఖ నటులు గిరి బాబు, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, రెబల్‌స్టార్ కృష్ణంరాజు సతీమణి శ్రీమతి శ్యామల, మెగాస్టార్ చిరంజీవి సతీమణి శ్రీమతి కొణిదెల సురేఖ, చాముండేశ్వరినాథ్, వి.రామ్‌ప్రసాద్ ఉన్నారు. కార్యదర్శిగా కాజా సూర్య నారాయణ కొనసాగుతున్నారు. ఫిలిం నగర్ దైవ సన్నిదానం ప్రాంగణంలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎం.పి, 'కళాబంధు' శ్రీ టి.సుబ్బరామిరెడ్డి, రాజమండ్రి ఎంపి. మురళీమోహన్ పాల్గొన్నారు. పూర్ణకుంభ స్వాగతనంతరం.. సంప్రదాయ, ఆచారాలతో వేద మంత్రోచ్చారణల నడుమ చైర్మన్‌గా డా. మోహన్‌బాబు, ఇతర సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ ''దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన మెండుగా ఉన్న మోహన్‌బాబుగారు చైర్మన్‌గా పదవి చేపట్టడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు. మోహన్‌బాబు మాట్లాడుతూ ''నేను ఎన్నడూ గుడి చైర్మన్ అవ్వాలనుకోలేదు. ఎందుకంటే మా సంస్థలు, చిత్రాలతో బిజీగా ఉన్న నాకు మళ్ళీ ఈ అదనపు బాధ్యత ఎందుకను కున్నాను. కానీ, ఆ మహాశివుడు టి.సుబ్బరామిరెడ్డిగారి స్వరూపంలో వచ్చి ఫిలిం నగర్ దైవ సన్నిధానం చైర్మన్ బాధ్యతలు స్వీకరించమన్నాడు. సన్నిధానంలో ఉన్న పద్దెనిమిది దేవాలయాల్లో కొలువై ఉన్న దేవుళ్ళ ఆశీస్సులతో మంచి కార్యక్రమాలు చేపడతామని ఆశిస్తున్నాను. దేవుడి డబ్బు పైసా ముట్టుకోకుండా అవసరమయితే నా సొంత డబ్బులు ఖర్చుపెట్టయినా సరే సన్నిధానంలో అభి వృద్ధి పనులు చేపట్టాలని సంకల్పిస్తున్నాను'' అన్నారు.



నా హృదయానికి దగ్గరగా ఉండే 'భాగమతి'

– అనుష్క

అనుష్క టైటిల్ పాత్రలో యు.వి.క్రియేషన్స్ బ్యానర్‌లో నటించిన చిత్రం 'భాగమతి'. అశోక్ దర్శకుడు. వంశీ, ప్రమోద్ నిర్మాతలు. ఈ చిత్రం జనవరి 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ జరిగింది. అనుష్క మాట్లాడుతూ ''యు.వి.క్రియేషన్స్ వంశీ, ప్రమోద్, విక్కీలకు థాంక్స్. ఎందుకంటే 2012లో కథ వినగానే నచ్చిందని చెప్పాను. అయితే డేట్స్ లేకపోవడంతో చేయలేనన్నాను. అయినా నా కోసం ఇప్పటి వరకు వెయిట్ చేశారు. నా హృదయానికి దగ్గరైన సినిమా. ఇది అనుష్క సినిమా అని చెప్పను. ఉన్ని ముకుందన్, జయరాం, ఆశా శరత్, ప్రభాస్ శ్రీను, ధనరాజ్, విద్యుల్లేఖ, రవీందర్, తమన్ సహా ఇది అందరి సినిమా'' అన్నారు. దర్శకుడు అశోక్ మాట్లాడుతూ ''తను గెలుస్తూ.. తన చుట్టూ ఉన్న వారిని గెలిపిద్దాం అని ఎవరైనా ఆలోచిస్తే .. అతనితో దైవత్వం మొదలైనట్లు. అలాంటి వ్యక్తి ముందు ఈ కథ విన్నారు. ఆ దేవుడు ప్రభాస్‌గారు, ఇక్కడి దాకా నడిపించారు. వంశీ, ప్రమోద్, విక్కిగారు త్రిమూర్తులు. ఈ సినిమాను శ్రమ, మానసిక ఒత్తిడిని తీసుకుని చేశాం. అరుంధతిగా, సరోజగా, రుద్రమదేవిగా కనిపించిన అనుష్క ఇప్పుడు భాగమతిగా కనపడబోతున్నారు'' అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ ''నిర్మాతలు వంశీ, ప్రమోద్, విక్కీలను అభినందిస్తున్నాను. అరుంధతి సినిమా ఎంత పెద్ద హిట్ అయ్యిందో ఈ సినిమా కూడా అంతే పెద్ద హిట్ కావాలి'' అన్నారు. నాని మాట్లాడుతూ ''ఇలాంటి సినిమాను పెద్ద స్క్రీన్‌పైనే చూడాలని, స్వీటీ ఈ ఏడాది అన్ని అవార్డులను గెలుచుకుంటుందని ఒక ఫ్రెండ్ చెప్పాడు. సినిమాను ఎప్పుడెప్పుడు చూడాలా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను'' అన్నారు. మారుతి మాట్లాడుతూ ''డైరెక్టర్ తెచ్చుకున్న కథకు పూర్తిగా న్యాయం చేసే నిర్మాతలు వీరు. ట్రైలర్‌లో చూసింది చాలా తక్కువ.ఈ నెల 26న సినిమా చూస్తే అర్థమవుతుంది. అనుష్క విశ్వరూపాన్ని రేపు థియేటర్‌లో చూస్తారు'' అన్నారు.

'ఇంటిలిజెంట్' ఫస్ట్ లుక్



● సాయిధరమ్ తేజ్

సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్ పతాకంపై సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ నిర్మిస్తున్న భారీ చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు. ఫిబ్రవరి 9న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ ''ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ టోటల్‌గా పూర్తయింది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. సాయిధరమ్‌తేజ్ పెర్‌ఫార్మెన్స్, వినాయక్ టేకింగ్ హైలైట్‌గా ఈ చిత్రం రూపొందింది. సాయిధరమ్, వినాయక్ కెరీర్‌లో 'ఇంటిలిజెంట్' మరో బిగ్గెస్ట్ హిట్ మూవీ అవుతుంది. అలాగే మా సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌లో మరో కమర్షియల్ హిట్ సినిమాగా నిలుస్తుంది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.

బంగారు ఆలోచన



● కీర్తి సురేష్

మహానటి సావిత్రి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా 'మహానటి. ఈ చ్రితంలో సావిత్రి పాత్రలో కీర్తి సురేష్ నటిస్తోంది. నాగ అశ్విన్ దర్శకుడు. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సావిత్రి తను చేసే సినిమా యూనిట్ సభ్యులకు బహు మతులు ఇస్తుండేది. ఇప్పుడు సావిత్రి పాత్రలో నటిస్తున్న కీర్తి సురేష్ కూడా ఆ సంప్రదాయాన్ని పాటించింది. 'మహానటి' చిత్రానికి పనిచేసిన ప్రతి ఒక్కరికీ బంగారు నాణేలను బహుమతిగా అందించింది. దీంతో యూనిట్ సభ్యులకు ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా కలిగింది. తమిళ్ హీరో విజయ్ 'మెర్సల్' సినిమా షూటింగ్ పూర్తయిన సందర్భంలో యూనిట్ సభ్యులకు గోల్డ్ కాయిన్స్ గిఫ్ట్‌గా అందించారు. 'మహా నటి' యూనిట్‌కి కీర్తి సురేష్ గిఫ్ట్ ఇవ్వడం గొప్ప విషయమని పలువురు ప్రశంసిస్తున్నారు.

త్వరలో 'టిక్ టిక్ టిక్'



జయం రవి, నివేదా పేతురాజ్ జంటగా చదలవాడ బ్రదర్స్ సమర్పణలో శ్రీతిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలింస్ బ్యానర్‌పై పద్మావతి చదలవాడ నిర్మాతగా వస్తోన్న సినిమా 'టిక్ టిక్ టిక్'. శక్తి సౌందర్ రాజన్ దర్శకుడు. ఇండియన్ సినిమా చరిత్రంలో ఫస్ట్ స్పేస్ సినిమాగా రూపొందింది. త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ ''నేను ఫ్రాన్స్ వెళ్ళినపుడు అక్కడ ఓ కపుల్ నేను ఇండియన్ అని తెలుసుకొని 'బాహుబలి' పదిసార్లు చూశామని చెప్పారు. ఇండియన్ సినిమాకి అంత గుర్తింపు వచ్చింది. ఆ స్థాయిలో తీసిన సినిమా 'టిక్ టిక్ టిక్'. ఈ సినిమా నచ్చి తెలుగు హక్కులు తీసుకున్నా. 'బిచ్చగాడు' తరహాలో ఈ చిత్రాన్నీ ఆదరిస్తారని, ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. హీరో 'జయం' రవి మాట్లాడుతూ ''మన దేశంలో ఫస్ట్ స్పేస్ ఫిలిం ఇది. ఇటువంటి సినిమాలను ఈజీగా చేయలేము. ఒక్కొక్క షాట్ వెనుక చాలా కష్టం ఉంటుంది. 90లలో కొన్ని స్పేస్ సినిమాలు వచ్చాయి. అంతకంటే బాగా చేయాలంటే బడ్జెట్ కావాలి' అన్నారు. లక్కీగా మంచి ప్రొడక్షన్ టీం, చెన్నైలో అజాక్స్ గ్రాఫిక్ స్టూడియో దొరికాయి. టీజర్, ట్రైలర్లలో ప్రేక్షకులు చూసిన దానికంటే ట్రైలర్లో పది రెట్లు ఎక్కువ ఉంది'' అన్నారు. చదలవాడ లక్ష్మణ్ మాట్లాడుతూ– ''తమిళంలో ఈ సినిమా చేస్తున్నారని తెలిసి పోటీ ఎక్కువ ఉన్నా తెలుగు హక్కులు తీసుకున్నాం. త్వరలో ఈ సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు.

'మహానటి' తల్లిగా...



● దివ్యవాణి

బాపు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లిపుస్తకం' చిత్రంతో హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకుంది దివ్యవాణి. ఆ తర్వాత 'ఎదురింటి మొగుడు–పక్కింటి పెళ్ళాం', ఇద్దరు పెళ్లాల ముద్దుల పోలీస్ వంటి విజయవంతమైన 50 చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం దివ్యవాణి 'నా పేరు మీనాక్షి', 'పవిత్ర బంధం' సీరియల్స్‌లో నటిస్తున్నారు. అలాగే మహానటి సావిత్రి జీవిత కథ ఆధారంగా నిర్మిస్తున్న 'మహానటి' చిత్రంలో సావిత్రి తల్లి పాత్రలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా దివ్యవాణి మాట్లాడుతూ ''మహా దర్శకుడు సర్గీయ బాపుగారి ఆశీస్సులతో తెలుగు ప్రేక్షకులకు బాపు బొమ్మగా పరిచయం కావడం నిజంగా నా అదృష్టం. హీరోయిన్‌గా 'పెళ్లి పుస్తకం' చిత్రంతో పరిచయమైనప్పటికీ నా మొదటి సినిమా 'సర్దార్ కృష్ణమనాయుడు'. దాని తర్వాత 'ముత్యమంత ముద్దు' చిత్రాల్లో నటించాను. ఈ రెండు సినిమాల తర్వాత 'పెళ్లి పుస్తకం' కోసం వచ్చిన ఇరవై మందిలో నేను ఎంపిక య్యాను. ఇప్పటివరకు తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో 50 సినిమాల్లో నటించాను. ప్రస్తుతం ఈ రెండు సీరియల్స్, వైజయంతి మూవీస్ వారి 'మహానటి' చిత్రంలో నటిస్తున్నాను. నట నకు అవకాశం ఉన్న మంచి పాత్రలు వస్తే తప్పకుండా చేస్తాను'' అన్నారు.

ఘనంగా 63 ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానం



● ఇర్ఫాన్ ఖాన్



● విద్యా బాలన్



● రాజ్‌కుమార్ రావ్

63వ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానో త్సవం ముంబయిలోని వర్లీలో జరి గింది. 2017లో విడుదలైన చిత్రాలకు సంబంధించిన అవార్డుల ప్రదానం ఈ కార్యక్రమంలో జరిగింది. ఈ వేడుకకు పలువురు బాలీవుడ్ ప్రముఖులు హాజర య్యారు. ఈ ప్రదానోత్సవానికి షారుఖ్ ఖాన్, కరణ్ జోహార్‌లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఉత్తమ చిత్రంగా 'హిందీ మీడియం' అవార్డు గెలుచు కుంది. ఈ చిత్రంలో నటించిన ఇర్ఫాన్ ఖాన్ ఉత్తమ నటుడుగా అవార్డును అందుకున్నారు. 'తుమారీ సూలూ' చిత్రంలో రేడియో జాకీగా నటించిన విద్యా బాలన్ మరోసారి ఫిల్మ్‌ఫేర్ అవా ర్డును గెలుచుకుంది. 'బరేలీ కి బర్ఫీ' చిత్రానికిగాను అశ్విని అయ్యర్ తివారి ఉత్తమ దర్శకురాలి అవార్డు అందుకు న్నారు.

63వ జియో ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్–2018 విజేతలు వీరే: ఉత్తమ చిత్రం: హిందీ మీడియం, విమర్శకుల మెప్పు పొందిన ఉత్తమ చిత్రం: న్యూటన్, ఉత్తమనటి: విద్యాబాలన్(తుమారీ సూలూ), ఉత్తమ నటుడు: ఇర్ఫాన్ ఖాన్(హిందీ మీడియం), విమర్శకుల మెప్పు పొందిన ఉత్తమ నటుడు: రాజ్‌కుమార్‌రావ్(ట్రాప్డ్), విమర్శకుల మెప్పు పొందిన ఉత్తమ నటి: జైరా వాసిమ్(సీక్రెట్ సూపర్‌స్టార్), ఉత్తమ దర్శకురాలు: అశ్వని అయ్యర్ తివారీ (బరేలీ కి బర్ఫీ), ఉత్తమ నూతన దర్శకుడు: కొంకణా సేన్‌శర్మ (ఎ డెత్ ఇన్ ది గంజ్), ఉత్తమ సహాయ నటుడు: రాజ్‌కుమార్ రావ్(బరేలీ కి బర్ఫీ), ఉత్తమ సహాయనటి: మెహర్‌విజ్ (సీక్రెట్ సూపర్‌స్టార్), ఉత్తమ మాటల రచయిత: హితేష్ కేవల్య (సుభ్ మంగళ్ సావధాన్), ఉత్తమ కథనం: సుభాషిశ్ భుటియాని (ముక్తి భవన్), ఉత్తమ కథ: అమిత్ మస్రూకర్ (న్యూటన్), ఉత్తమ నటుడు(లఘుచిత్రం): జాకీ ష్రాఫ్ (ఖుజ్లీ), ఉత్తమ నటి(లఘుచిత్రం): షిఫాలీ షా (జ్యూస్), ఉత్తమ గాయకుడు: అర్జిత్ సింగ్ (రోకే నా రుకే నైనా: బద్రినాథ్ కి దుల్హనియా), ఉత్తమ గాయని: మేఘనా మిశ్రా(నాచిది ఫిరే: సీక్రెట్ సూపర్‌స్టార్), ఉత్తమ గీత రచయిత: అమితాబ్ భట్టాచార్య (ఉల్లూకా పట్టా: జగ్గా జాసూస్), జీవిత సాఫల్య పురస్కారం: మాలా సిన్హా, బప్పీలహరి, ఉత్తమ కొరియోగ్రఫీ: విజయ్ గంగూలీ, రుయల్ దౌసన్ వరిన్‌దాని (గల్తీ సే మిస్టేక్: జగ్గా జాసూస్), ఉత్తమ నేపథ్య సంగీతం: ప్రీతమ్ (జగ్గా జాసూస్), ఉత్తమ యాక్షన్: టామ్ స్ట్రుతర్స్(టైగర్ జిందా హై), ఉత్తమ ఎడిటింగ్: నితిన్ బైదీ (ట్రాప్డ్), ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: పారుల్ సోనథ్ (డాడీ), ఉత్తమ సౌండ్ డిజైన్: అనిష్ జాన్ (ట్రాప్డ్), ఉత్తమ కాస్ట్యూమ్స్: రోహిత్ చతుర్వేది(ఎ డెత్ ఇన్ ది గంజ్)



● ఆమిర్ ఖాన్, జైరా వసీమ్


మొదటి మహిళ ఐశ్వర్యా రాయ్



బాలీవుడ్ హీరోయిన్ ఐశ్వర్యరాయ్ ఫస్ట్ లేడీ అవార్డును అందుకున్నారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఈ గౌరవాన్ని పొందారు ఐశ్వర్య. వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మరికొంత మంది మహిళలు ఫస్ట్ లేడీ అవార్డులు అందుకు న్నారు. రెండు దశాబ్దాలకు పైగా భారతీయ చలన చిత్ర రంగానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ ఫస్ట్ లేడీ అవార్డును ఐశ్వర్యారాయ్‌కి ప్రదానం చేశారు. గత పది హేను సంవత్సరాలుగా కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌కు హాజ రవుతున్న ఐశ్వర్య అంతర్జాతీయ చలన చిత్రోత్సవ జ్యూరీ సభ్యురాలిగా ఎంపికయ్యారు. ఈ సంద ర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖమంత్రి మేనకా గాంధీ.. ఐశ్వర్యను ఘనంగా సత్క రించారు. చిన్న వయసులోనే పైలట్ అయిన అయేషా అజీజ్‌ను, తొలి మహిళా ఐపీఎస్ రువేదా సలామ్‌లతో పాటు మరో 113 మందికి అవార్డు ప్రదానం చేశారు.

జనసేన.. ఎన్నికల 'నావ'

- ముంచేదెవరిని.. తీరానికి చేర్చేదెవరిని?
- పవన్ పర్యటనపై ప్రధాన పార్టీలలో చర్చ
- జనసేనాని అడుగులపై నిశిత పరిశీలన
- ఎన్నికల్లో లాభ నష్టాలపై అంతర్గత విశ్లేషణ



అమరావతి, జనవరి 22 (మనం ప్రతినిధి): జనసేనాని జనం వద్దకు పయనమయ్యారు. జగిత్యాల జిల్లా కొండగట్టు నుంచి ప్రారంభమైన పవన్ కల్యాణ్ పర్యటన తెలంగాణాలో ఎలా ఉన్నా.. ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ నెల 27 నుంచి అనంతపురం జిల్లాలో కరువు యాత్ర చేస్తానని పవన్ ప్రకటించారు. ఆ తర్వాత ఒంగోలు, విశాఖ పట్నం, శ్రీకాకుళం జిల్లాలో పర్యటిస్తానని చెప్పారు. అధికార టీడీపీ రానున్న ఎన్నికలకు మానసికంగా సిద్ధ మవుతుండగా.. జగన్ పాదయాత్ర త్వరలోనే రాయ లసీమ దాటి ఆంధ్రాలో అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యం లో పవన్ పర్యటన ఆ రెండు పార్టీల్లో చర్చనీయాంశ మైంది. కూడికలు, తీసివేతల విశ్లేషణలతో రెండు పార్టీల నాయకులు తలమునకలవుతున్నారు. తెలంగాణ గడ్డ కొండగట్టులో పవన్ అభిమాన వెల్లువ కనిపించింది. ఆయనను చూసేందుకు జనం విశేషంగా తరలివచ్చారు. తెలంగాణలో కన్నా ఆంధ్రాలో పవన్‌కు క్రేజ్ మరింత ఎక్కువ. ఆయన పర్యటనలు నల్లేరుపై నడకలా విజయవంతం కావడంలో ఎవరికీ భిన్నాభిప్రాయం ఉండదు. పవన్‌కు ఉన్న విశేషమైన అభిమానగణం ఆయన పర్యటనలకు విజయం చేకూర్చి పెట్టవచ్చు. కాగా పవన్ పర్యటనలను ఎన్నికలతో ముడిపడిన రాజకీయ పర్యటనలుగా భావించ లేరు. ఆయన కోసం వస్తున్న అభిమాన జనాన్ని చూసి ఇప్పుడే ఎన్నికల విశ్లేషణలు కూడా చేయ లేరు. ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అధ్యయనం చేయటానికి పర్యటన చేస్తున్నారని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. పర్యటనల్లో పవన్ ఏం అధ్యయనం చేస్తారో, ఎన్నికల్లో ఎలాంటి పాత్ర పోషిస్తారో ఇప్పుడే అంచనాకు రాలేమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అయితే అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీతో పాటు బీజేపీ కూడా పవన్ అడుగులను నిశితంగానే పరిశీలి స్తోంది. పవన్ గాలులు వస్తే, ప్రభంజనంలా కనిపిస్తే అధికార పార్టీ నుంచి అటు వైపు వెళ్లటానికి ఒక వర్గం సిద్ధంగానే ఉంది. నాయకుల మాటెలా ఉన్నా ఓట్ల రూపంలో వచ్చే లాభ నష్టాల గురించే అన్ని పార్టీల్లో చర్చ మొదలైంది. 2014 ఎన్నికల్లో మోదీ-చంద్రబాబు ద్వయానికి పవన్ అందించిన మద్దతు బాగానే ఉపయోపడింది.

తనకు కులం లేదని పవన్ వ్యక్తిగతంగా ఎంత చెప్పుకున్నా సంప్రదాయ కాంగ్రెస్ కాపు ఓట ర్లంతా టీడీపీ వైపు మళ్లారు. టీడీపీకి పవన్ మద్దతు లేక పోతే కాపు ఓట్లు చీలిపోయి వైసీపీ ఖాతాలోనూ జమ య్యేవనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఫలితాలను తారు మారు చేసి వైసీపీని ప్రతిపక్ష స్థానానికి పరిమితం చేసిన పరిణామం ఇదేనన్న అభిప్రాయం అన్ని పార్టీల్లోనూ బలంగానే ఉంది. కాగా 2009 ఎన్నికల్లో సంప్రదాయ కాంగ్రెస్ కాపు ఓట్లన్నీ ప్రజారాజ్యం వైపు మళ్లినా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కేవలం ఒక కులం ఓట్ల ఆధారంగా సార్వత్రిక ఎన్నికల విశ్లేషణ చేయటం అసంపూర్ణం అవుతుందన్న వాదన కూడా ఉంది.

ఈ నేపథ్యంలో పవన్ తన పర్యటనలో వెల్లడించే అంశాలు, పార్టీ నిర్మాణం, ఎన్ని సీట్లలో పోటీ చేస్తారు, ఎక్కడెక్కడ పోటీ చేస్తారన్న నిర్దిష్టమైన నిర్ణయాలు వెల్లడైన తర్వాతే.. రాష్ట్ర రాజకీయాల్లో, ప్రత్యేకించి రానున్న ఎన్నికల్లో జనసేన ప్రాబల్యం ఏ మేరకు ఉంటుందో రేఖామాత్రంగానైనా అంచనాకు రావటానికి వీలవుతుంది. మరోవైపు జగన్ పాదయాత్రకు జనం నీరాజనాలు పడుతున్నారు. పాదయాత్ర సందర్భంగా అధికార తెలుగుదేశం పార్టీపై జగన్ రాజకీయ అస్త్రాలన్నింటినీ ప్రయోగిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వస్తే, ఆయన ముఖ్యమంత్రి అయితే ప్రజలకు ఏం చేస్తారో స్పష్టంగా చెబుతున్నారు. నవ రత్నాలను ప్రజల ముందుంచారు.

నియోజకవర్గాల్లో 'సేవా' ఇన్‌చార్జిలు

రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనసేన సేవాదళ్ ఇన్‌చార్జిలను నియమించాలని భావిస్తున్నట్టు సమాచారం. ఏపీలో పవన్ పర్యటనలోనే ఇన్‌చార్జిలను నియమించే అవకాశం ఉందని తెలిసింది. సేవాదళ్ ఇన్‌చార్జిలే ఎన్నికల బరిలోకి దిగే అవకాశం ఉందని, ఎవరితో పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగా పోటీ చేయటమే జనసేన వ్యూహమని ప్రచారం జరుగుతోంది. ఇన్‌చార్జిలుగా ఉండే వారిలో అన్ని సామాజికవర్గాల వారు ఉంటారని, జనరల్ స్థానాల్లోనూ ఎక్కువగా బీసీలు, దళితులను నియమించే అవకాశం ఉన్నట్టు ఓ నాయకుడు తెలిపారు. పవన్ పర్యటనలోనే ఎలక్షన్ రోడ్ మ్యాప్ కూడా తయారవుతుందని ఆయన వెల్లడించారు.



కలెక్టర్ ఎదుట ఆత్మహత్యాయత్నం

- గుంటూరులో పెట్రోలు పోసుకున్న కౌలురైతు
- అధికారుల అలసత్వమే కారణమని ఆరోపణ
- డెయిరీ ఫాం ఏర్పాటుకు కలెక్టర్ హామీ

గుంటూరు, జనవరి 22 (మనం ప్రతినిధి): గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ కోన శశిధర్ ఎదుటే రైతు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. అధికారులు, పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని నిలువరించారు. కలెక్టర్ కౌలురైతుతో మాట్లాడి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నాదెండ్ల మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన కౌలు రైతు మాడా శివ ప్రసన్నబాబు డిగ్రీ పూర్తి చేశాడు. అతనికి ఇద్దరు పిల్లలు. అతనికి ఉన్న 2 ఎకరాలతో పాటు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల వల్ల పంట నష్టపోవడంతో 8 లక్షలు అప్పు చేశాడు. దీంతో సమస్యలపై కలెక్టరు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. గేదెల డెయిరీ పెట్టుకునేందుకు ముఖ్యమంత్రిని కలిసి విన్నవించుకోగా.. రూ. 25,000 వేలు ఆర్థిక సాయం, కాపు కార్పొరేషన్ ద్వారా గేదెల ఫారం ఇస్తామని హామీ ఇచ్చారని చెప్పాడు. కాగా అధికారులు ఇంతవరకు పరిష్కారం చూపలేదని వాపోయాడు. తన ఆత్మహత్యకు పూర్తి బాధ్యత కలెక్టర్, అధికారుల చేత సమస్యకు పరిష్కారం చూపించని ముఖ్యమంత్రే కారకులని అన్నాడు. కలెక్టర్.. ప్రసన్నబాబుతో మాట్లాడారు. వెంటనే అతనికి గేదెల డెయిరీ ఫాం ఏర్పాటుకు రుణం ఇప్పించాలని అధికారులను ఆదేశించారు.

ఆధునిక వ్యవసాయంలో ఏపీ నెంబర్ వన్

సాగును లాభసాటిగా మార్చడమే లక్ష్యం.. రైతు రథం పథకంలో 12,800 ట్రాక్టర్ల పంపిణీ.. 54 లక్షల మందికి భూసార కార్డులు: సోమిరెడ్డి



అమరావతి, జనవరి 22 (మనం ప్రతినిధి): ఆధునిక వ్యవసాయంలో దేశంలో ఆంధ్రప్రదేశ్‌దే ప్రథమ స్థానమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సోమవారం లాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళాలో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి సోమిరెడ్డి పాల్గొన్నారు. ఎన్జీరంగా విశ్వవిద్యాలయ వసతి గృహ భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం వ్యవసాయ ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను తిలకించి, రైతులకు ట్రాక్టర్లు, ఇంజన్లు, వ్యవసాయ పరికరాలను మంత్రులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో, 2017-18 మొదటి అర్ధ సంవత్సరంలో వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు 25.60 శాతం సాధించి దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానం సాధించిందని మంత్రి వివరించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా రైతులు ముందుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 54 లక్షల మంది రైతులకు భూసార పరీక్షా పత్రాలను అందించామని, భూసార పరీక్షల ఆధారంగా రైతులకు వంద శాతం సబ్సిడీతో మైక్రో న్యూట్రిషన్స్‌ను అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతు రథం పథకం కింద 12,800 ట్రాక్టర్లను రైతులకు పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా లోటులో ఉన్నా వ్యవసాయ రంగానికి రూ.18వేల కోట్లు కేటాయించామని సోమిరెడ్డి పేర్కొన్నారు. మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడం, కనీస మద్దతు ధరతో పాటు మార్కెట్ సదుపాయాలు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ప్రతి రైతుకూ మద్దతు ధర

- ధాన్యం సేకరణపై కలెక్టర్ల దృష్టి
- రీ-సైక్లింగ్ చేసేవారిపై కఠిన చర్యలు
- రబీ పంట రుణాలు వేగవంతం
- మైక్రో ఇరిగేషన్ లక్ష్యాన్ని చేరుకోవాలి
- అధికారులను ఆదేశించిన సీఎస్ దినేశ్



అమరావతి, జనవరి 22 (మనం ప్రతినిధి): ప్రతి రైతుకూ మద్దతు ధర లభించేలా చూడాలని, దావోస్ పర్యటనకు వెళ్తూ కూడా ధాన్యం సేకరణపై ముఖ్యమంత్రి మార్గదర్శకాలు ఇచ్చారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం వ్యవసాయం, నీరు-మీరు పురోగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లు, శాఖాధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం సేకరణ కేంద్రాలపై జిల్లాల కలెక్టర్లు నిశితంగా దృష్టి పెట్టి.. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రతి రైతుకు మద్దతు ధర లభించేలా శ్రద్ధ వహించాలని ఆదేశించారు. రైతులకు ప్రయోజనం కలిగించేందుకే ధాన్యం సేకరణ కేంద్రాలు పెట్టామని.. వాటిని రైస్ మిల్లర్లు, దళారులు దుర్వినియోగం చేయకుండా చూడాల్సిన బాధ్యత ఆయా జిల్లాల యంత్రాంగంపైనే ఉందని అన్నారు. ధాన్యం సేకరణ కేంద్రాలకు రీ-సైక్లింగ్ బియ్యాన్ని తెచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైస్ మిల్లులలో రేషన్ బియ్యం రీ-సైక్లింగ్ చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఖరీఫ్‌లో పంటరుణాల పంపిణీ సంతృప్తిగా జరిగిందని.. అయితే రబీలో కొన్ని జిల్లాల్లో పంట రుణాల పంపిణీ మందకొడిగా జరగడంపై దినేశ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీకాకుళం, కర్నూలు, విజయనగరం, నెల్లూరు జిల్లాల్లో పంటరుణాల పంపిణీ వేగంగా జరగాలని సూచించారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కౌలు రైతులకు పంట రుణాల పంపిణీ మరింత వేగం పుంజుకోవాలన్నారు. కాగా ఉద్యాన రంగంలో సూక్ష్మసేద్యంలో లక్ష్యాన్ని సగం మాత్రమే చేరామని, మరో 3 నెలల్లో లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. రాయలసీమ జిల్లాల్లో మైక్రో ఇరిగేషన్‌ను మరింత ప్రోత్సహించాలన్నారు. అన్ని జిల్లాల్లో 2016-17 ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. 2017-18 ఇళ్ల మంజూరు లక్ష్యాన్ని వెంటనే చేరుకోవాలన్నారు. 'నరేగా' పనులకు జిల్లాల కలెక్టర్లే నేతృత్వం వహించాలని, వ్యక్తిగతంగా పనుల పురోగతిని పర్యవేక్షించి, ఎప్పటికప్పుడు సమీక్షించాలని పేర్కొన్నారు. నరేగాలో మెటీరియల్ కాంపోనెంట్ పనులు 40 శాతం మించిరాదన్నారు. గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో లేబర్ కాంపోనెంట్ పెంచాలని సూచించారు. రాబోయే రెండు నెలలు 'ఎన్ఆర్ఎం' కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. జన్మభూమి- మా ఊరులో వచ్చిన వినతుల పరిష్కారంపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని దినేశ్ కుమార్ ఆదేశించారు. ఆర్థికేతర వినతులన్నింటినీ జనవరి 31లోపు పరిష్కరించాలన్నారు. మరో 8 రోజుల్లో అర్జీలన్నింటినీ పరిష్కరించాలని సూచించారు. ఆర్థికపరమైన వినతులను అర్హతను బట్టి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని కోరారు.

చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం

- విభజన హామీలు సాధించుకోలేకపోతే.. అది టీడీపీ వైఫల్యమే: నారాయణ



విజయవాడ, జనవరి 22 (మనం న్యూస్ ప్రతినిధి): విభజన హామీలను కేంద్రం సక్రమంగా అమలు చేయకుంటే సుప్రీం కోర్టుకు వెళతానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న తెలుగుదేశం విభజన హామీలను సాధించుకోలేని పక్షంలో అది ఆ పార్టీ వైఫల్యమేనని అన్నారు. తెలుగు రాష్ట్రాల సీఎంలు బాబు, కేసీఆర్ గొడవ పడుతూ ప్రజలను వెధవలను చేస్తున్నారని ఆరోపించారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 20 మంది శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నిర్ణయం తీసుకో వడం సరైనది కాదని నారాయణ అన్నారు. సోమవారం దాసరి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో అత్యున్నతి పదవి రాష్ట్రపతి అని, పదవికి విలువ లేకుండా కోవింద్ వ్యవహరించారని ఆరోపించారు. పదవీ విరమణ చేస్తున్న ఎలక్షన్ కమిషనర్ జ్యోతి ఇటువంటి కీలకమైన నిర్ణయాలు తీసుకోకూడదన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ ఉన్న సమయంలో ఆయనకు జ్యోతి అనుంగుడుగా ఉండేవారన్నారు. అందువల్లే బీజేపీకి అనుకూలంగా ఎలక్షన్ కమిషనర్ కీలక నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. న్యాయవ్యవస్థలోనూ అనూహ్యమైన సంక్షోభం వచ్చిందన్నారు. వేల కోట్ల మెడికల్ స్కామ్, ఇతర 5 ముఖ్యమైన కేసులను సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ రోటేషన్ పద్ధతిలో న్యాయమూర్తులకు కేటాయించకుండా ఆయన వద్దే ఉంచుకోవడంతో, మిగిలిన న్యాయమూర్తులు మీడియా ముందుకు వచ్చారన్నారు. సీపీఐ రాష్ట కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. అమరావతి రాజధాని నిర్మాణం కోసమని 33,000 ఎకరాల భూసేకరణ చేసి, వాటిని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. మార్చి 7,8,9 తేదీలలో సీపీఐ రాష్ట్ర మహాసభలు కడపలో జరుగుతాయని తెలిపారు.

మోసం చేయడంలో బాబు పీహెచ్‌డీ



- రాష్ట్రంలో ఏ వర్గానికి న్యాయం చేయలేదు
- ఎన్నికల్లో డప్పు కొట్టి పెద్దమాదిగనంటారు
- గెలిచాక దళితుల భూముల ఆక్రమణ
- దళిత ఆత్మీయ సభలో వైఎస్ జగన్ ధ్వజం

తిరుపతి, జనవరి 22 (మనం న్యూస్ బ్యూరో): ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు పీహెచ్‌డీ చేశారని, రాష్ట్రంలో ఏ వర్గానికీ ఆయన అధికారంలోకి వచ్చాక న్యాయం చేయలేకపోయారని వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఆరోపించారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా పల్లమాల గ్రామంలో నిర్వహించిన దళిత ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దళితులను కూడా నిండా మోసం చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు డప్పు కొట్టి తాను పెద్ద మాదిగని చెప్పుకొంటారని, అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల భూములనే ఆక్రమిస్తారంటూ జగన్ ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు ప్రతి పేద వాడికి స్థలం ఇస్తానని, ఇళ్లు కట్టిస్తానని చెప్పిన చంద్రబాబు అధికారం చేపట్టిన తర్వాత ఎవరినీ పట్టించుకోలేదన్నారు. ఏపీలో పలు చోట్ల దళితులపై దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని, దళిత మహిళలకు భద్రత కరువైందని చెప్పారు. మరోవైపు దళితుల అసైన్డ్ భూములను ప్రభుత్వం ఆక్రమిస్తోందని, వైఎస్ హయాంలో 32 లక్షల ఎకరాలను 22 లక్షల మంది దళితులకు ఇచ్చారని, ఆ భూములను చంద్రబాబు చేజిక్కించుకుంటున్నారని ఆరోపించారు. ఉపాధి హామీ నిధులను పక్క దారి పట్టిస్తున్నారని, దీని వల్ల నిరుపేదలకు ఉపాధి లభించడం లేదని అన్నారు. నవరత్నాలు దళితులకు వరప్రసాదం అని, తాము అధికారంలోకి వస్తే దళిత కుటుంబాల జీవితాలు మారుస్తామని జగన్ హామీ ఇచ్చారు. దళితులంటే చంద్రబాబు చులకన భావన ఉందని అన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరి దుర్మరణం

- అనంతపురం జిల్లాలో రోడ్డు ప్రమాదం

కళ్యాణదుర్గం,జనవరి22 (మనంన్యూస్): అనంతపురం జిల్లా శెట్టూరు మండలం చెర్లోపల్లి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కుందుర్పి మండలం వడ్డెపాళ్యం గ్రామానికి చెందిన బంధువులైన బోయ రాము, బోయ పూజారప్ప, శివలు ద్విచక్ర వాహనంలో కళ్యాణదుర్గం వెళ్తుండగా, మార్గమధ్యంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బోయరాము, బోయ పూజారప్ప అక్కడిక్కడే దుర్మరణం చెందగా, శివ తీవ్రంగా గాయపడ్డాడు. పొలాలకు వెళ్లే రైతులు గుర్తించి.. శివను 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.




ఆప్యాయత పెంచేందుకే అమ్మకు వందనం

- కార్యక్రమంలో మంత్రి పితాని

పెనుగొండ, జనవరి 22 (మనం న్యూస్): పిల్లలకు, తల్లికి మధ్య ఆప్యాయత పెంచేందుకు అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. నానాటికి పెరిగిపోతున్న యాంత్రిక జీవనంలో తల్లికి, పిల్లలకు ఆప్యాయతాను రాగాలు పెంచేందుకు ఈ ప్రయత్నమని పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం దేవ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో పితాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పిల్లలు మన సంస్కృతి, సాంప్రదాయాలు తెలుసుకోవలసిన అవశ్యకత ఉందని అన్నారు.

కొల్లేటి సమస్య పరిష్కారానికి కేంద్రం ఓకే

స్థానికులకు జీవనోపాధిపై సానుకూలం: మంత్రి కామినేని



న్యూఢిల్లీ, జనవరి 22: కొల్లేరు సరస్సు నీటి ప్రవాహానికి, పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా సరస్సుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పజల సమస్య పరిష్కారానికి కేంద్రం సానుకూలంగా స్పందించిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ చెప్పారు. ఈ అంశంపై కామినేని సోమవారం ఢిల్లీలో కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి హర్షవర్ధన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కామినేని మీడియాతో మాట్లాడుతూ.. కొల్లేరు సరస్సు పరిధిని 5 నుంచి 3 కాంటూరుకు తగ్గించే అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉందని చెప్పారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పునకు లోబడి కొల్లేటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రజలు జీవనోపాధిని కోల్పోకుండా తగు సహాయం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, జీవనోపాధి కల్పనతో పాటు అవసరమైతే వారికి నష్టపరిహారం అందించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కొల్లేరు సరస్సులో విడిది చేసేందుకు వచ్చే ఫెలికాన్ పక్షులకు, పర్యావరణానికి ఏవిధమైన నష్టం వాటిల్లకుండా ఫిబ్రవరి 4 వ తేదీ నుంచి 'ఫెలికాన్ ఫెస్టివల్'ను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని కామినేని వివరించారు. కాగా, అంతకుముందు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై.. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న పథకాలకు కేంద్ర ప్రోత్సాహకం కోరినట్లు చెప్పారు. ఎన్టీఆర్ వైద్య పథకాన్ని మరింత పటిష్టంగా అలమలు చేసేందుకు జాతీయ ఇన్సూరెన్స్ పథకాల పరిధిలోకి దీన్ని చేర్చాలని అన్నారు.



2019నాటికి పోలవరం పూర్తి

- శరవేగంగా ప్రాజెక్టు పనులు: జలవనరుల శాఖ మంత్రి ఉమా

పోలవరం, జనవరి 22 (మనం న్యూస్ బ్యూరో): పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయని, 2019 నాటికి ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రాజెక్టు పూర్తి చేసి తీరుతామని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమమహేశ్వరరావు చెప్పారు. సోమవారం ప్రాజెక్టు పనుల పరిశీలనకు పోలవరం వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని కరువు రహితంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని మంత్రి ఉమా చెప్పారు. దేశంలో అత్యంత వేగంగా పనులు జరుగుతున్న ప్రాజెక్టుల్లో పోలవరం ఒకటని, ఇటీవల ప్రాజెక్టును సందర్శించిన నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ రాజీవ్‌కుమార్ కూడా పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. పోలవరం ప్రతి తెలుగువాడు చూడదగ్గ ప్రాజెక్టు అని మంత్రి తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని అవాంతరాలు సృష్టించినా అభివృద్ధి ఆగబోదని చెప్పారు.

తొలి ముద్దాయి కేంద్రమే

- ప్రత్యేక హోదా ఏదీ?: చలసాని శ్రీనివాస్

విజయవాడ, జనవరి 22 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చి అభివృద్ధి చేస్తామని ఎన్నికల వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ఇప్పటి వరకు అతీ గతీ లేదని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ అన్నారు. ప్రత్యేక హోదా అంశంలో ప్రధాన మంత్రే తొలి ముద్దాయి అని విమర్శించారు. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విభజన హామీల అమలు-ప్రత్యేక హోదా సాధన దిశగా జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలు పక్కన పెట్టి ప్రత్యేక హోదా కోసం అన్ని పార్టీలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీలకు రాజకీయ ఎజెండాలు ఎన్ని ఉన్నా హోదా కోసం కేంద్రంపై వివిధ రూపాల్లో ఒత్తిడి తేవాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంతో పాటు సీఎం చంద్రబాబు కూడా దోషే అని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే హోదా కావాలన్న పాలకులు తమ స్వార్థం కోసం నేడు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. హోదా కావాలని పార్లమెంట్‌లో వైసీపీ సభ్యులు నిలదీసిన ప్రతిసారీ టీడీపీ సభ్యులు ఆటంకాలు కల్పిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన మస్తాన్ వలీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పోతిన వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.


'బౌద్ధ పర్యాటకం'పై నిర్లక్ష్యమా?

- పర్యాటకులకు సౌకర్యాల లేమి
- ప్రభుత్వ తీరుపై ఐఏటీవో విమర్శలు

విశాఖపట్నం, జనవరి 22 (మనం న్యూస్ బ్యూరో): రాష్ట్రంలో 2 వేల ఏళ్ల నాటి బౌద్ధారామాలు ఉన్నాయని, వాటి సందర్శనకు విదేశీ పర్యాటకులు వస్తుంటారని, కానీ ఆయా ప్రాంతాల్లో కనీసం సదుపాయాలు లేవని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ ఆరోపించింది. బౌద్ధ పర్యాటకంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని ఆ సంస్థ ప్రతినిధులు అన్నారు. 25 మంది ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు 18 నుంచి 21 వరకు నాగార్జున కొండ, అమరావతి, విజయవాడ, విశాఖల్లో పర్యటించింది. ఆయా ప్రాంతాల్లోని బౌద్ధారామాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, కానీ వీటిని ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, పర్యాటకులకు కనీస సౌకర్యాలు కానీ, టూరిస్టు గైడ్‌లు కానీ లేరని బృందం పేర్కొంది. అనకాపల్లికి సమీపంలోని 2000 సంవత్సరాల నాటి బొజ్జన్నకొండ ప్రపంచవ్యాప్తంగా ఉన్న బౌద్ధ పర్యాటకులకు పెద్ద ఆకర్షణ అవుతుందని, అయితే ఇక్కడ తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాలు కూడా లేవని ట్రావెల్ ఐక్యూ ప్రతినిధి మురళి వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని పర్యాటక శాఖాధికారులకు ఇంతవిలువైన బౌద్ధ కట్టడాల గురించి ఏమీ తెలియకపోవడం విచారకరమని అన్నారు. తాము ఇంతకాలం బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోని బౌద్ధ స్థలాల గురించి తెలియజెప్పి అక్కడికే పర్యాటకులకు తీసుకువెళ్లామని, ఇకపై ఏపీ వైపు కూడా దృష్టిసారిస్తామని, అయితే ఇక్కడ ప్రభుత్వం సదుపాయాలు కల్పించాలని కోరారు.

సెన్సెక్స్ జనవరి 22 2018


35,798.01



పెరిగినవి	%	తగ్గినవి	%
టీసీఎస్	5.36	విప్రో	-2.33
రిలయన్స్	4.50	భారతీ ఎయిర్‌టెల్	-1.56
యాక్సిస్ బ్యాంక్	3.52	ఏషియన్ పెయింట్స్	-1.40
ఓఎన్‌జీసీ	3.28	హెచ్‌డీఎఫ్‌సీ	-1.38
యస్ బ్యాంక్	2.00	ఎస్‌బిఐ	-0.91

నిఫ్టీ జనవరి 22 2018

10966.20



పెరిగినవి	%	తగ్గినవి	%
టీసీఎస్	5.31	హెచ్‌పీసీఎల్	-3.46
రిలయన్స్	4.32	ఐడియా సెల్యులార్	-2.74
ఓఎన్‌జీసీ	3.61	గెయిల్	-2.42
యాక్సిస్ బ్యాంక్	3.61	విప్రో	-2.25
టెక్ మహీంద్రా	3.00	బీపీసీఎల్	-1.71

టాప్ గైనర్స్ 22 జనవరి

35,798.01


బి.ఎస్.ఇ సెన్సెక్స్ ▲286.43

పాయింట్లు		%
3113.15	టీసీఎస్	5.36%
971.20	రిలయన్స్	4.50%
611.05	యాక్సిస్ బ్యాంక్	3.52%
199.95	ఓఎన్‌జీసీ	3.28%
355.25	యస్ బ్యాంక్	2.00%
3272.10	బజాజ్ ఆటో	2.00%
1398.95	లార్సెన్ టూబ్రో	1.97%
1071.30	కోటక్ మహీంద్రా	1.07%
437.70	అదానీ పోర్ట్స్	0.91%
576.30	సన్ ఫార్మా	0.75%

బులియన్| గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్



సమ్మిళిత వృద్ధి

62వ స్థానంలో భారత్



దావోస్: సమ్మిళిత అభివృద్ధి సూచిలో ప్రవర్ధమాన ఆర్థిక వ్యవస్థలలో చైనా (26వ స్థానం), పాకిస్తాన్ (47వ స్థానం)ల కన్నా దిగువున భారతదేశం 62వ స్థానంలో నిలిచింది. ప్రపంచంలో అత్యంత సమ్మిళిత, అధునాతన ఆర్థిక వ్యవస్థగా నార్వే అగ్ర స్థానంలో కొనసాగింది. ప్రవర్ధమాన ఆర్థిక వ్యవస్థలలో లిథువేనియా తిరిగి మొదటి స్థానంలో నిలిచిందని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యు.ఇ.ఎఫ్) వెల్లడించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సహా కొందరు ప్రపంచ నాయకులు హాజరయ్యే వార్షిక సమావేశానికి ముందు అది ఇక్కడ ఈ వార్షిక సూచి వివరాలు విడుదల చేసింది. ఈ సూచి ''జీవన ప్రమాణాలు, పర్యావరణ స్థిరత్వం, తదుపరి రుణ భారం నుంచి భవిష్యత్ తరాలను కాపాడడం'' అనే అంశాలను లెక్కలోకి తీసుకున్నట్లు ప్రపంచ ఆర్థిక వేదిక తెలిపింది. సమ్మిళిత వృద్ధి, అభివృద్ధిని తెచ్చిపెట్టే నూతన నమూనాకు తక్షణం మరలవలసిందిగా అది నాయకులకు విజ్ఞప్తి చేసింది. ఆర్థిక విజయానికి కొలబద్దగా స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి)పై ఆధారపడడం వల్ల స్వల్పకాలిక దృష్టి, అసమానతలు పెరుగుతున్నాయని తెలిపింది.

క్షీణించిన స్థానం

గత ఏడాది 79 అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారత్ 60వ స్థానంలో నిలవగా, చైనా 15వ, పాకిస్తాన్ 52వ స్థానంలో నిలిచాయి. ప్రపంచంలో 103 ఆర్థిక వ్యవస్థల ప్రగతిని 2018 సూచి గణించింది. వృద్ధి–అభివృద్ధి, సమ్మిళితత్వం, తరాల మధ్య సమానత్వం అనే మూడు అంశాలను పరామితులుగా తీసుకుంది. ఈ సూచిని రెండు భాగాలుగా విభజించారు. మొదటి భాగంలోకి 29 అధునాతన ఆర్థిక వ్యవస్థలు వస్తాయి. రెండవదానిలోకి 74 ప్రవర్ధమాన ఆర్థిక వ్యవస్థలు వస్తాయి. ఐదేళ్ళ కాలంలో మొత్తంమీద అవి కనబరచిన సమ్మిళిత అభివృద్ధి, వృద్ధి ధోరణిని బట్టి దేశాలను ఈ సూచి తిరిగి ఐదు ఉప వర్గాలుగా విభజించింది. సమ్మిళిత వృద్ధి తగ్గుతోంది, నెమ్మదిగా తగ్గుతోంది. స్థిరంగా ఉంది, నెమ్మదిగా పురోగమిస్తోంది, పురోగమిస్తోంది అనే ఐదు కేటగిరీలు రూపొందించింది.

మొత్తంమీద స్కోరు తక్కువగానే ఉన్నప్పటికీ, 'పురోగమిస్తున్న' ధోరణిని కనబరచిన పది ప్రవర్ధమాన ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం ఒకటిగా ఉంది. అధునాతన ఆర్థిక వ్యవస్థలలో నార్వే తర్వాత వరుసగా ఐర్లాండ్, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్, డెన్మార్క్‌లు మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి.

సూచి అగ్ర భాగంలో చిన్న యూరోపియన్ ఆర్థిక వ్యవస్థలు ప్రాబల్యం వహించాయి. టాప్ 10లో ఆస్ట్రేలియా (9) ఒక్కటే ఐరోపాయేతర ఆర్థిక వ్యవస్థ. జి7 ఆర్థిక వ్యవస్థలలో జర్మనీ (12) అగ్ర స్థానంలో నిలిచింది. కెనడా (17), ఫ్రాన్స్ (18), బ్రిటన్ (21), అమెరికా (23), జపాన్ (24) ఇటలీ (27)లు తర్వాత స్థానాల్లో నిలిచాయి. అత్యంత సమ్మిళిత వృద్ధిని కనబరుస్తున్న టాప్ 5 ప్రవర్ధమాన ఆర్థిక వ్యవస్థలలో లిథువేనియా, హంగరీ, అజెర్‌బైజాన్, లాట్వియా, పోలండ్ ఉన్నాయి.

'బ్రిక్స్' ఆర్థిక వ్యవస్థలలో పనితీరు మిశ్రమంగా ఉంది. రష్యన్ ఫెడరేషన్ 19వ స్థానంలో నిలవగా, చైనా (26), బ్రెజిల్ (37), ఇండియా (62), దక్షిణాఫ్రికా 69వ స్థానాల్లో నిలిచాయి.

భవిష్యత్ తరాలను కాపాడేందుకు సంపన్న, పేద దేశాలు రెండూ ఒకే విధంగా సతమతమవుతున్నాయని డబ్ల్యు.ఇ.ఎఫ్ పేర్కొంది. ఇటీవలి సంవత్సరాలలో అనేక దేశాలలో రాజకీయ వ్యవస్థలను ఒక కుదుపు కుదిపిన యువ తరాలలో నెలకొన్న అసంతృప్తితో సహా సామాజిక నిరాశా నిస్పృహలకు అధిక వృద్ధి మాత్రమే విరుగుడని భావిస్తున్న రాజకీయ, వ్యాపార నాయకులను అది హెచ్చరించింది.

జి.డి.పి.యే కొలబద్ద అనుకుంటే ఎలా?

సామాజిక ఈక్విటీకన్నా దశాబ్దాల తరబడి ఆర్థిక వృద్ధికి ప్రాధమ్యం కల్పించడం చారిత్రకంగా అధిక స్థాయిల సంపదకు, ఆదాయ అసమానతలకు దారి తీసిందని అది కనుగొంది. ఫలితంగా, మరింత గుణవంతమైన సర్కిల్‌ను ప్రభుత్వాలు కోల్పోయాయని తెలిపింది. సంపద ఎక్కువ మంది పంచుకున్నదిగా ఉంటే వృద్ధి పటిష్టమయ్యేదని చెప్పింది. అలా లేకపోవటం వల్ల, పర్యావరణంపై ఇంకా చెప్పాలంటే, భవిష్యత్ తరాలపై భారం అనుచితంగా పెరుగుతోందని పేర్కొంది. దేశ ఆర్థిక పనితీరుకు జి.డి.పి.ని ప్రాథమిక కొలమానంగా తీసుకుని, ఆర్థికవేత్తలు, విధాన నిర్ణేతలు దానిపై అతిగా ఆధారపడడం ఈ సమస్యకు కొంత కారణమని పేర్కొంది. జి.డి.పి. వస్తువులు, సేవల ప్రస్తుత ఉత్పత్తిని గణిస్తుంది. విస్తృత సామాజిక, ఆర్థిక ప్రగతికి అది ఏ మేరకు తోడ్పడుతోందో చూడదు. సగటు కుటుంబ ఆదాయం, ఉపాధి అవకాశాలు, ఆర్థిక భద్రత, జీవన నాణ్యతపై అది ఎలా ప్రతిబింబిస్తోందో చూడాలని చెప్పింది.

కొన్నింటిలో మెరుగు

సూచి మూడు స్తంభాలలో భారత్ సమ్మిళిత కేటగిరీలో 72వ, వృద్ధి–అభివృద్ధిలో 66వ, అంతర్ తరాల సమానత్వంలో 44వ స్థానంలో నిలిచింది. పొరుగు దేశాలైన శ్రీలంక (40), బంగ్లాదేశ్ (34), నేపాల్ (22) భారత్‌కన్నా ఎగువ ర్యాంక్‌లలో నిలిచాయి. ఇండియా కన్నా మెరుగైన స్థానం పొందినవాటిలో మాలి, ఉగాండా, రువాండా, బురుండీ, ఘనా, ఉక్రేన్, సెర్బియా, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, ఇరాన్, మెసడోనియా, మెక్సికో, థాయిలాండ్, మలేషియాలు ఉన్నాయి. జి.డి.పి. తలసరి వృద్ధిలో (6.8 శాతం) కార్మిక ఉత్పాదకత వృద్ధి (6.7 శాతం)తో 2012 నుంచి ప్రవర్ధమాన ఆర్థిక వ్యవస్థలలో చైనా మొదటి స్థానంలో ఉన్నప్పటికీ, సమ్మిళిత వృద్ధిలో పనితీరు పేలవంగా ఉండ డం వల్ల దాని మొత్తంమీద స్కోరు తగ్గిపోయిం దని ప్రపంచ ఆర్థిక వేదిక తెలిపింది.

పెరిగిన యాక్సిస్ బ్యాంక్ నికర లాభం

న్యూఢిల్లీ: యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ వడ్డీ, ఫీజుల రూపంలో ఆదాయం ఎక్కువగా లభించడం, మొండి బాకీలకు పక్కనపెట్టిన మొత్తాలు తగ్గడం ఫలితంగా యాక్సిస్ బ్యాంక్ త్రైమాసిక నికర లాభంలో 25 శాతం పెరుగుదలను నమోదు చేసింది. అయితే, దాని ఫలితాలు ఎక్కువ మంది అంచనా వేసినదాని కన్నా కొద్ది తక్కువగా ఉన్నాయి. బ్యాంకు నికర లాభం 2017 డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికంలో రూ. 726 కోట్లకు పెరిగింది. క్రితం ఆర్థిక సంవత్సరం అదే కాలంలో బ్యాంక్ రూ. 580 కోట్ల నికర లాభాన్ని మాత్రమే చూపగలిగింది. ఈ ఆర్థిక సంవత్సరం క్యూ 3లో, యాక్సిస్ బ్యాంక్ రూ. 798 కోట్ల నికర లాభం గడించగలదని చాలా మంది అంచనా వేశారు. మొత్తం రుణాలలో స్థూల మొండి బాకీల శాతం ఈ ఆర్థిక సంవత్సరం క్యూ 2లో ఉన్న 5.90 శాతం నుంచి క్యూ 3లో 5.28 శాతానికి స్వల్పంగా తగ్గింది. ఒక ఏడాది క్రితం అది 5.22 శాతంగా ఉంది.

'ఫిక్కీ' డి.జి.గా షెనాయ్



న్యూఢిల్లీ: భారతీయ పారిశ్రామిక, వాణిజ్య మండలుల సమాఖ్య (ఫిక్కీ) డైరెక్టర్ జనరల్‌గా దిలీప్ షెనాయ్ నియమితులయ్యారు. ''షెనాయ్ నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్.ఎస్.డి.సి) మేనేజింగ్ డైరెక్టర్, సి.ఇ.ఓ.గా, సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) డైరెక్టర్ జనరల్‌గా, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సి.ఐ.ఐ) డిప్యూటి డైరెక్టర్ జనరల్‌గా కూడా వ్యవహరించారు'' అని ఫిక్కీ ఒక ప్రకటనలో తెలిపింది. నైపుణ్యాల అభివృద్ధి సంస్థ పనితీరు పట్ల ప్రభుత్వం అసంతృప్తితో ఉందని వార్తలు రావడంతో ఆయన 2015 చివరలో ఎన్.ఎస్.డి.సి.కి రాజీనామా చేశారు. ఆయనను కాంగ్రెస్ నేతృత్వంలోని ఐక్య ప్రగతిశీల కూటమి (యు.పి.ఎ) ప్రభుత్వం నియమించింది. నైపుణ్యాల అభివృద్ధి, వ్యవస్థాపక సామర్థ్య శాఖ మాజీ మంత్రి రాజీవ్ ప్రతాప్ రూడీ గతంలో ఎన్.ఎస్.డి.సి. పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశ్రమలకు అవసరమైన సిబ్బందికి తర్ఫీదునిచ్చి అందించడంలో సంస్థ విఫలమైందని ఆయన విమర్శించారు.

కొనుగోళ్ళలో దేశ, విదేశీ నిధులు

నూతన గరిష్ఠ స్థాయిల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీలు



ముంబయి: స్థిరంగా వచ్చిపడుతున్న విదేశీ నిధులు, దేశీయ మదుపరులు కొనుగోళ్ళు కొనసాగించడంతో సోమవారంనాడు వరుసగా నాల్గవ సెషన్‌లో 'సెన్సెక్స్', 'నిఫ్టీ'లు రికార్డులు నెలకొల్పుతూ నూతన గరిష్ఠ స్థాయిల్లో ముగిసాయి. దేశీయ ఈక్విటీలు రికార్డుల పరంపరను కొనసాగిస్తున్నాయి. కంపెనీల త్రైమాసిక ఫలితాలు సానుకూలంగా ఉండడం, కొన్ని రంగాలకు వస్తువులు, సేవల పన్ను తగ్గించడంతో సహా, ప్రభుత్వం ఇటీవల తీసుకున్న కొన్ని చర్యలు ఈ ఉత్సాహానికి కారణమవుతున్నాయి. ''మొత్తంమీద మనోభావాలు చాలా సానుకూలంగా ఉన్నాయి. అట్టడుగు స్థాయిల్లోనూ కొనుగోళ్ళు కొంత కనిపిస్తున్నాయి'' అని ఆల్టామౌంట్ క్యాపిటల్ సహ అధిపతి, ఈక్విటీ సలహాదారు క్రిష్ సుబ్రమణ్యం చెప్పారు. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బి.ఎస్.ఇ) 30 షేర్ల 'సెన్సెక్స్' సోమవారం 286.43 పాయింట్లు లాభపడి 35,798.01 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్.ఎస్.ఇ) 50 షేర్ల సూచి 'నిఫ్టీ' 71.5 పాయింట్లు లాభపడి 10,966.20 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రా–డేలో 'సెన్సెక్స్' 35,827.70 పాయింట్లు, 'నిఫ్టీ' 10,975.10 పాయింట్ల ఆల్–టైమ్ గరిష్ఠ స్థాయిలను తాకాయి. బి.ఎస్.ఇ.లోని రంగాలవారీ సూచీలలో మెటల్, పి.ఎస్.యు. సూచీలు క్షీణిస్తే, ఐ.టి, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, టెక్ సూచీలు లాభపడ్డాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంపెనీల షేర్ల ధరల ఆరోహణ కొనసాగింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేర్ ధర ఇంట్రా–డేలో రూ. 3,130 గరిష్ఠ స్థాయిని తాకింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రికార్డు స్థాయిలో రూ. 5.76 లక్షల కోట్లుగా అత్యధికంగా నమోదైంది. ఐ.టి. సర్వీసుల కంపెనీలు 2018లో మంచి రోజులు చూస్తాయని మోర్గాన్ స్టాన్లీ అంచనాను వెల్లడించినప్పటి నుంచి అవి పెరుగుతూ వస్తున్నాయి. ఓ.ఎన్.జి.సి. షేర్ ధర దాదాపు 6.3 శాతం పెరిగింది. హెచ్.పి.సి.ఎల్.లో మెజారిటీ వాటాను 5.8 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేయనున్నట్లు అది వెల్లడించింది. అది చెల్లిస్తున్న ప్రీమియం ఊహించినదానికన్నా తక్కువగా ఉందని విశ్లేషకులు చెప్పడంతో దాని షేర్ ధరలు అమాంతం పెరిగాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ ధర దాదాపు 3.1 శాతం పెరిగింది. దాని టెలికాం వ్యాపారం జియో మొదటిసారిగా లాభదాయకంగా మారి, ఈ ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో రికార్డు స్థాయిలో నికర లాభాన్ని నమోదు చేయడమే అందుకు కారణం. నికర లాభాలు క్షీణించినట్లు తెలిపిన విప్రో షేర్ ధర దాదాపు 3.2 శాతం తగ్గింది. తాత్కాలిక డాటా ప్రకారం మునుపటి సెషన్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ. 988.25 కోట్లు విలువ చేసే షేర్లు కొనుగోలు చేయగా, దేశీయ మదుపు సంస్థలు రూ. 209.86 కోట్ల విలువ చేసే షేర్లు కొన్నాయి.

'ఎగుమతి ధరలపై ఆంక్షలు వద్దు'



న్యూఢిల్లీ: వ్యవసాయ వస్తువుల సరఫరాలో ప్రపంచ మార్కెట్‌లో భారతదేశాన్ని విశ్వసనీయమైన దేశంగా రూపుదిద్దేందుకు వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక కొత్త ప్రతిపాదన తీసుకురావాలని భావిస్తోంది. ఉల్లిపాయలు, టమాటాలు, బంగాళాదుంపలు వంటి నిత్యావసర వస్తువులు కానివాటిపై కనీస ఎగుమతి ధర (ఎం.ఇ.పి) రూపంలో ఎగుమతులపై ఆంక్షలు విధించే విధానానికి స్వస్తి పలకాలని వాణిజ్య మంత్రిత్వ శాఖ కోరనుంది. ''వ్యవసాయ ఎగుమతి విధాన ముసాయిదాను సంబంధిత వ్యక్తుల నుంచి అభిప్రాయాలు కోరుతూ త్వరలో ఆన్‌లైన్‌లో పెట్టనున్నారు. ఎం.ఇ.పి. సూత్రాన్ని మనిషి మనుగడకు అత్యవసరమైన బియ్యం లేదా గోధుమలు వంటి కొద్ది వస్తువుల జాబితాకు మాత్రమే పరిమితం చేస్తూ, దేశంలో ధరలను అదుపు చేసే సాధనంగా మాత్రమే దాన్ని వాడుకోవాలని కోరుతున్న ప్రతిపాదనను కూడా ఆ ముసాయిదాలో పొందుపరచే అవకాశం ఉంది. మిగిలిన అన్ని వస్తువుల మీద, ఎం.ఇ.పి.ని ఏకమొత్తంగా రద్దు చేయాలని ఈ ప్రతిపాదన కోరనుంది'' అని ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు. ఉల్లిపాయలకు కూడా ఎం.ఇ.పి.ని రద్దు చేసే నిర్ణయం కేంద్రానికి కష్టమవుతుంది. రాజకీయంగా సున్నితమైన అటువంటి వస్తువులపై ఎం.ఇ.పి.కి సంబంధించి చర్చ సాగాలని వాణిజ్య మంత్రిత్వ శాఖ కోరుతోంది. ''ప్రపంచ మార్కెట్‌లో భారతదేశ ప్రతిష్ఠను మెరుగుపరచాలని ప్రధాన మంత్రి పట్టుదలతో ఉన్నారు. అది కార్యరూపం ధరించడానికి భారత్ కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోక తప్పదు. వ్యవసాయ, వినియోగదార్ల వ్యవహారాల మంత్రిత్వ శాఖలతో సహా, ఈ వ్యవహారంతో ముడిపడిన అందరూ ఈ అంశంపై తమ అభిప్రాయాలు, వ్యాఖ్యలు తెలియజేస్తే స్వాగతిస్తాం'' అని ఆ అధికారి చెప్పారు. దేశీయ మార్కెట్లలో ధరలు పెరిగినప్పుడల్లా, ఉల్లిపాయలు, బంగాళా దుంపలు వంటి వస్తువులపై కేంద్రం కనీస ఎగుమతి ధరను విధిస్తూ వస్తోంది. ధరలు మరింత మండిపోకుండా నివారించడానికే ఎం.ఇ.పి.ని ఉద్దేశించారు. కానీ, ఎం.ఇ.పి. తరచుగా, ఎగుమతులపై నిషేధం విధించిన మాదిరిగా పరిణమిస్తోంది. మితిమీరిన ధరల వద్ద ఆ వస్తువులకు అంతర్జాతీయ మార్కెట్‌లో కొనుగోలుదార్లే ఉండడం లేదు. ''అకస్మాత్తుగా ఎం.ఇ.పి. విధించిన కారణంగా మన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదార్లు, వారి కొనుగోలుదార్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోతే, కొనుగోలుదార్లు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. మన ఎగుమతిదార్లు కొనుగోలుదార్లను శాశ్వతంగా కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు'' అని ఆ అధికారి వివరించారు. దేశంలో పెరుగుతున్న ధరలను అదుపు చేయడానికి వర్తకులు ఒక కూటమిగా ఏర్పడకుండా నిరోధించడం వంటి ఇతర మార్గాలు అనుసరించవచ్చు. వ్యవసాయ ఎగుమతుల విధాన ముసాయిదాను వచ్చే నెలలో బహిరంగపరచవచ్చు. ప్రతిపాదిత వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి వ్యూహం దేశంలో ఎగుమతుల దృశ్యాన్ని మారుస్తుందని వాణిజ్య, పరిశ్రమ శాఖ మంత్రి సురేశ్ ప్రభు ఇటీవల చెప్పారు. అది రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తుందని, వారి ఉత్పత్తులకు పెద్ద సంఖ్యలో కొనుగోలుదార్లను సంపాదించిపెడుతుందని ఆయన చెప్పారు.

పెరగనున్న ఎన్.పి.ఏలు

న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగ స్థూల నిరర్థక ఆస్తులు గత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఉన్న రూ. 8 లక్షల కోట్ల నుంచి వచ్చే మార్చి నెలాఖరునాటికి రూ. 9.5 లక్షల కోట్లకు పెరుగుతాయని ఒక నివేదిక వెల్లడించింది. అయితే, బ్యాంకింగ్ వ్యవస్థలో హెచ్చు స్థాయిలో ఉన్న 'స్ట్రెస్సడ్ ఎసెట్లు' ఎన్.పి.ఏ.ల పరిష్కార ప్రక్రియలో ముఖ్య పాత్ర పోషిస్తున్న ఆస్తి పునర్నిర్మాణ కంపెనీ (ఏ.ఆర్.సి)లకు అపరిమితమైన అవకాశాన్ని కల్పిస్తాయని 'అసోచామ్–క్రైసిల్' అధ్యయనం తెలిపింది. కానీ, అదే సమయంలో, మూలధన ప్రతిబంధకాల వల్ల ఏ.ఆర్.సి.ల వృద్ధి గణనీయంగా తగ్గుతుందని అంచనా. ''ఏ.ఆర్.సి.ల వృద్ధి 2019 జూన్ నాటికి దాదాపు 12 శాతం తగ్గుతుందని భావిస్తున్నాం. వాటి నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ మాత్రం లక్ష కోట్లకు చేరుకోవచ్చు. అది తక్కువ మొత్తం ఏమీ కాదు'' అని ఆ నివేదిక తెలిపింది. జి.ఎన్.పి.ఏ.లు ''2018 మార్చి 31 నాటికి, మొత్తం రుణాలలో సుమారు 10.5 శాతంగా రూ. 9.5 లక్షల కోట్లకు చేరవచ్చు. 'స్ట్రెస్సడ్ ఎసెట్లు' రూ. 11.5 లక్షల కోట్ల మేరకు ఉండవచ్చు'' అని నివేదిక పేర్కొంది. రికవరీ రేటు 38 శాతం నుంచి 44–48 శాతానికి పెరగవచ్చు'' అని చెప్పింది.

'ఎఫ్.ఆర్.డి.ఐ బిల్లు ఉపసంహరించాలి'

అహ్మదాబాద్: బ్యాంకుల ఉద్యోగుల సంఘాలు ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్స్యూరెన్స్ (ఎఫ్.ఆర్.డి.ఐ) బిల్లు 2017కి వ్యతిరేకంగా నిరసన గళం వినిపిస్తున్నాయి. భారతీయ బ్యాంకింగ్ రంగంలోని ప్రతికూలతలను వెలుగులోకి తెచ్చే జాతీయ స్థాయి సంతకాల సేకరణ ఉద్యమాన్ని బ్యాంక్ ఉద్యోగుల యూనియన్లు ప్రారంభించాయి. బ్యాంకులలో ప్రజలు చేసే నగదు డిపాజిట్ల భద్రతపై అవి కూడా ఆందోళనలు వ్యక్తం చేశాయి. బ్యాంకు డిపాజిట్లకు భద్రత తొలగించడానికి ప్రయత్నిస్తున్న ఎఫ్.ఆర్.డి.ఐ. బిల్లును ఉపసంహరించుకోవాలని అఖిల భారత బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏ.ఐ.బి.ఇ.ఏ) డిమాండ్ చేసింది. మార్చి 25 కల్లా దేశవ్యాప్తంగా కోటి సంతకాలు సేకరించి, పార్లమెంట్‌కు, లోక్ సభ స్పీకర్‌కు ఒక సామూహిక పిటిషన్ సమర్పించాలని ఏ.ఐ.బి.ఇ.ఏ. భావిస్తోంది. ''జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజున గుజరాత్‌లో మేం చైతన్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. గుజరాత్ ప్రజానీకం నుంచి 10 లక్షల సంతకాలు సేకరిస్తాం. బ్యాంకింగ్ వినియోగదార్లను కూడా మాతో చేర్చుకోవాలన్నది మా లక్ష్యం. దీనితో వారి డబ్బుతో ప్రభుత్వం ఏం చేయాలనుకుంటోందో వారికి కూడా తెలిసి వస్తుంది'' అని మహాగుజరాత్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భరత్ రావల్ చెప్పారు. ''ప్రస్తుతం బ్యాంకుల వద్ద మొత్తం దాదాపు రూ. 110 లక్షల కోట్ల మేరకు డిపాజిట్లు ఉన్నాయి. దేశ సామాన్య ప్రజానీకానికి చెందిన ఈ విలువైన నగదును మనం కాపాడాల్సిన అవసరం ఉంది. నేడు, కేంద్ర ప్రభుత్వం ఎఫ్.ఆర్.డి.ఐ. బిల్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. బ్యాంకులలో చేసే డిపాజిట్లకు రక్షణ లేకుండా చేయాలని అది ప్రయత్నిస్తోంది. బ్యాంకులలోని మొత్తం డిపాజిట్లకు పూర్తి రక్షణ, పూచీ ఉండాలి'' అని ఎఫ్.ఆర్.డి.ఐ. బిల్లు ఉపసంహరణను కోరుతూ ఏ.ఐ.బి.ఇ.ఏ. ప్రధాన కార్యదర్శి సి.హెచ్. వేంకటాచలం అన్నారు. భారతదేశంలో ఎఫ్.ఆర్.డి.ఐ. అవసరం లేదు. ఎందుకంటే, భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ అమెరికా, ఇతర దేశాలలో ఉన్న వ్యవస్థకు భిన్నమైనది. భారతదేశంలో మనది డిపాజిట్–ఓరియంటెడ్ బ్యాంకింగ్. ఇతర దేశాలలోవి ఇన్వెస్ట్‌మెంట్–ఓరియంటెడ్ బ్యాంకులు. కనుక, అమెరికాలోని బ్యాంకింగ్ నిబంధనలను భారతదేశానికి వర్తింపజేయకూడదని ఆయన అన్నారు. బిల్లులో చాలా లొసుగులు ఉన్నాయని ఆయన అన్నారు. ప్రజలకు చెందిన భారీ పొదుపు మొత్తాలు బ్యాంకులలో ఉన్నాయి కనుక, బ్యాంకింగ్ నిబంధనల చట్టం, డిపాజిట్లకు పూచీపడే నిబంధనను పొందుపరచింది. ఏ బ్యాంకునూ అమ్మేసి, మూయించడానికి లేదు. ఒకవేళ ఏవన్నా బ్యాంకులు సరిగ్గా పనిచేయకపోయినా, ఆర్.బి.ఐ. వాటిని విలీనం చేసి, నడిచేట్లు చేస్తుందని ఆయన చెప్పారు. ''ఏ.ఐ.బి.ఇ.ఏ. పోరాడి, 1960లో బి.ఆర్. చట్టానికి ఈ సవరణను సాధించింది. ఆ తర్వాత, ఏ బ్యాంకునూ మూసేయలేదు. కనుక, ఎఫ్.ఆర్.డి.ఐ. బిల్లు అవసరం లేదు. సామాన్య ప్రజానీకంలో గూడుకట్టుకున్న భయాన్ని ప్రభుత్వం తొలగించాలి'' అని ఆయన అన్నారు. బ్యాంకింగ్ సంస్కరణల పట్ల వేంకటాచలం అభ్యంతరాలు వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ సంస్కరణల పేరుతో ప్రభుత్వం బ్యాంకులను ప్రైవేటీకరించడానికి, వాటి విలీనానికి ప్రయత్నించడం ద్వారా, బ్యాంకుల ఏకీకరణకు ప్రయత్నిస్తోంది. దీని వల్ల అవి కుప్పకూలే ప్రమాదముందని ఆయన అన్నారు.

మనం
www.manamnews.com
మందిరం
మంగళవారం, 23 జనవరి 2018

ధర్మసందేహాలు

భీష్మపంచకం అంటే ఏమిటి?

- ఎల్. రమణ, కుత్బుల్లాపూర్

భీష్మాష్టమి గురించి పద్మపురాణంలో ఉంది. ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేవరకు మరణంకోసం అంపశయ్యపై ఎదురుచూసిన భీష్ముడు మాఘశుద్ధ అష్టమినాడు ప్రాణాలు వదిలాడు. మనిషికి పంచప్రాణాలని చెబుతారు. ఇచ్ఛామరణం వరంగా కలిగిన భీష్ముడు తన అయిదు ప్రాణాలనూ మాఘ శుద్ధ సప్తమి మొదలు మాఘశుద్ధ ఏకాదశి వరకు అయిదురోజుల పాటు ఒక్కో ప్రాణం చొప్పున వదులుకుంటూ వెళ్లాడని కొందరు విశ్వసిస్తారు. కానీ కాల నిర్ణయ చంద్రిక, నిర్ణయసింధు, ధర్మసింధు, కాలమాధవీయం వంటి గ్రంథాలన్నీ మా ఘశుద్ధాష్టమి భీష్మ నిర్యాణ దినంగా చెబుతున్నాయి. మొత్తం మీద రథసప్తమి, భీష్మాష్టమి, భీష్మ ఏకాదశి, భీష్మ ద్వాదశి అనే నాలుగు రోజులూ ముఖ్యమైనవి. కాగా అష్టమి నుంచి ద్వాదశి వరకు గల ఆరురోజులూ భీష్మపంచకం అవుతున్నాయి. భీష్మాష్టమినాడు భీష్మునికోసం తర్పణలు చేస్తారు. భీష్మ ఏకాదశినాడు విష్ణు సహస్రస్తోత్ర పారాయణ చేయాలి.



మాఘమాసం ప్రత్యేకతలేమిటో చెప్పండి?

- టి. కేశవరావు, వరంగల్

శివకేశవులిద్దరికీ ఇష్టమైనది మాఘమాసం. పల్లకీ ఆకారంలో ఉండే అయిదు నక్షత్రాల సమూహం మఖ నక్షత్రం. పౌర్ణమి తిథినాడు పూర్ణకళలతో మఖ నక్షత్రం వద్ద చంద్రుడు సంచరించేది మాఘమాసంలోనే. మఖ నక్షత్రానికి అధిపతి కేతువు. అధిష్ఠాన దేవత వినాయకుడు. ఈ మాసంలో వినాయక ఆరాధన సర్వవిఘ్న నాశని. మాఘమాసంలో సూర్యుని కిరణాలు నేలపై జలాలను తేజోమయంగా మార్చుతాయి. అందుకే ఈ మాసంలో చేసే నదీ, సముద్ర స్నానాలు చేస్తారు. అరుణోదయ వేళలో చేసే మాఘస్నానం సంపూర్ణ ఆరోగ్యాన్ని, తేజస్సును కలుగచేస్తుంది. పవిత్ర నదుల్లో చేసే స్నానం పుణ్యబలంతో పాటు శక్తి చైతన్యాన్ని కలిగిస్తాయి. ఈ మాసంలో తిలదానం, సాలిగ్రామదానం శుభఫలితాలనిస్తాయి.

సమాధానాలు : డాక్టర్ కాకునూరి సూర్యనారాయణమూర్తి

నారద భక్తిసూత్రాలు - 10

సర్వము నీ పూజయే!

61, 62 సూత్రాలు:

లోకహానౌ చింతా నా కార్యా
నివేదితాత్మలోకవేదత్వాత్ । న తదసిద్ధౌ
లోకవ్యవహారో హేయః కింతు
ఫలత్యాగస్తత్సాధనం చ కార్యమేవ ।

భక్తుడైనవాడు సమస్తమైన పనులను భగవంతుని సేవలాగే భావిస్తాడు. లౌకికంగా ఉండే కష్టనష్టాలకు, లేమిసంపదలకు దుఃఖించడు. చింతించడు. అంతమాత్రం చేత భక్తి ఫలరూపం చెందేవరకు లౌకిక కర్మలను విడిచిపెట్టడు. బుద్ధిపూర్వకంగా స్వకర్మలను విడిచిపెట్టడు. బద్ధకించడు. నిష్కామ భావంతో భక్తిసాధన చేస్తాడు. అలా చేసే క్రమంలో భక్తుడు పాటించాల్సిన నియమాలేంటో కూడా నారద మహర్షి తెలియ చేస్తున్నాడు.



63- సూత్రాలు

స్త్రీధననాస్తికవైరి చరిత్రం న శ్రవణీయమ్ ।
అభిమాన దంభాదికం త్యాజ్యమ్ ।
తదర్పితాఖిలా చారస్సన్
కామక్రోధాభిమానాదికం తస్మిన్నేవ
కరణీయమ్ ।


కామాన్ని పురికొల్పే స్త్రీ, ధన సంబంధమైన కథలను వినకూడదు. నాస్తికులు, భగవత్ వైరులు చెప్పే మాటలను ఆలకించకూడదు. స్వాభిమానాన్ని విడిచిపెట్టాలి. తనంత గొప్ప భక్తుడు లేడనే సాత్వికాహంకారం పనికిరాదు. తాను చేసే భగవత్ పూజలను గురించి డాంబికంగా చెప్పుకోకూడదు. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే అరిషడ్వర్గాలను జయించడానికి ప్రయత్నించాలి. చేస్తున్న అన్ని పనులను, ఆ పనుల ఫలితాలను కూడా పరమాత్మకే అంకితం చేయాలి.

- ముకుందప్రియ

మారేడుదళం

అజాగ్రత్తయే మృత్యువు

సనాతనుడైన సనత్సుజాతుడు మృత్యువు లేదని తీర్మానించాడు. మహాభారతంలో విదురుని కోరికమేరకు ఆయన ధృతరాష్ట్రుని ముందు ప్రత్యక్షమయ్యాడు. అజాగ్రత్తయే మృత్యువు. అప్రమత్తతయే అమృతత్వమని అతడు బోధించాడు. కొందరు మృత్యువును కర్మతో జయించవచ్చంటారు. మరికొందరు మృత్యువే లేదంటారు. ఆసురీభావమున్నవాళ్లు అజాగ్రత్త వల్లనే మరణం చేతిలో పరాభవం పొందుతారు. దైవీప్రకృతి ఉన్నవాళ్లు బ్రహ్మభూతులవుతారు. ఏ రూపమూ లేని మృత్యువుకు బ్రహ్మభూతులు భయపడరు అంటూ సనత్సుజాతుడు తన హితోపదేశాన్ని ప్రారంభించాడు. పండితులకు సనత్సు జాతీయం పట్ల ఎనలేని ఆకర్షణ. సాధకులను ఉద్ధరించే మహత్తర శక్తి దానిలో ఉందని తరచుగా చెబుతారు. ఆ విషయాన్ని మరింత వివరంగానూ, సరళంగానూ ముంజులూరి నరసింహారావు విశదపరిచారు. మనోజ్ఞమైన వారి వ్యాఖ్యానం మూలగ్రంథంపై ఆసక్తిని పెంచుతుంది. సమగ్రంగా అధ్యయనం చేసిన సంతృప్తిని కలిగిస్తుంది.



సనత్సుజాతీయం
అనువాదం, వివరణ : డాక్టర్ ముంజులూరి నరసింహారావు, పేజీలు : 239, వెల: రూ. 150/-, ప్రతులకు : రచయిత, 1-5-881, మారుతీనగర్, కొత్తపేట, హైదరాబాద్.ఫోన్ నెం : 9000765972

మీరూ రాయండి!

మందిరం పేజీపై మీ అభిప్రాయాలను, రచనలను, ధర్మసందేహాలను manammandiram@gmail.comకు పంపండి. మారేడుదళం శీర్షికలో సమీక్ష కోసం మీ ఆధ్యాత్మిక ప్రచురణలను పంపవలసిన మా చిరునామా : మందిరం పేజీ, మనం దినపత్రిక, 5-3-864/4/బి, ఎస్.బి.ఎన్. ఆర్కేడ్, ఫోర్త్ అండ్ ఫిఫ్త్ ఫ్లోర్, గ్రీన్ ల్యాండ్స్, గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా, హైదరాబాద్ - 500016

సూర్యాయ నమః

సూర్యుడు ప్రత్యక్షదైవం. త్రిమూర్తి స్వరూపుడు. ఆయనే సృష్టి కర్త. స్థితి పోషకుడు కూడా సూర్యనారాయణుడే. లయకారకుడైన శివుడే అసలు సూర్యుడు. ఉదయవేళ బ్రహ్మగా, మధ్యాహ్నవేళ మహేశ్వరునిగా, సాయంత్రవేళ విష్ణుమూర్తిగా సూర్యుణ్ణి పూజించడం మన సంప్రదాయం. మన సంస్కృతిలో సౌరమే తొలి మతం. రేపు రథసప్తమి సందర్భంగా......



సప్తమ్యాం అథవా షష్ఠ్యాం భక్త్యా
పూజాం కరోతియః
అనిర్విణ్ణో అనహంకారీ తం
లక్ష్మీర్భజతే నరమ్

మహాభారతం అరణ్యపర్వంలో సూర్యుణ్ణి ఆరాధించి అక్షయపాత్రను పొందాడు ధర్మరాజు. ఆ సందర్భంలో ధర్మజుడు చేసిన సూర్యస్తోత్రం ఇది. సప్తమి లేదా షష్ఠి తిథులలో అహంకారం, విచారం లేకుండా భక్తితో భాస్కరుణ్ణి పూజించిన వారికి సమస్త ఐశ్వర్యాలు లభిస్తాయని ఈ శ్లోకానికి అర్థం.

నమస్కార ప్రియుడైన భాస్కరుడు ఐశ్వర్యప్రదాత మాత్రమే కాదు ఆపదలను నివారించేవాడు. సమస్త జీవులకు ఆత్మ సూర్యుడే. అందుకే ఆయన ఆరోగ్యప్రదాతగా కీర్తిగడించాడు. చర్మ, నేత్ర, హృద్రోగాల నివారణకు సూర్యారాధన శ్రేష్ఠం. అలాగే సంతాన భాగ్యాన్ని ప్రసాదించే దేవత కూడా ఆయనే.

పరంజ్యోతి స్వరూపం

వెలుగు కిరణాలను ప్రసరించేవాడు. ప్రాణశక్తుల్ని చైతన్యవంతం చేసేవాడు. నీటిలోని రసాన్ని స్వీకరించి తిరిగి అందించేవాడు. ఆకాశంలో సంచరించేవాడు. లోకాన్ని సృష్టించేవాడు. ప్రాణుల్ని నిత్యకర్మలు అనుష్ఠించేందుకు ప్రేరేపించేవాడు సూర్యుడే. ద్వాదశాదిత్యులు అనే మాట ప్రముఖంగా వినబడుతుంది.

మిత్ర, రవి, సూర్య, భాను, ఖగ, పూష; హిరణ్యగర్భ, మరీచి, ఆదిత్య, సవిత, అర్క, భాస్కరుడనే వారు ద్వాదశాదిత్యులు. వాసుదేవుని ద్వాదశాక్షరీ మంత్రమే ద్వాదశాదిత్యుల రూపంలో ప్రకాశిస్తుందని వైష్ణవులంటారు. శివపరంగా చూస్తే అష్టమూర్తి తత్త్వంలో తొలి మూర్తి రూపమే సూర్యుడు. అలాగే శాక్తేయంలో, గాణపత్యంలో అన్నింటా సూర్యదేవుని ఆరాధన ఉంది.

**సూర్యా ద్భవంతి
భూ తాని
సూర్యేణ పాలీ
తానిచ
సూర్యే లయం
ప్రాప్నువంతి
య సూర్యః సోహ
మేవచ**



సృష్టి, స్థితి, లయాలు సూర్యుని వల్లనే జరుగుతున్నాయని సూర్యోపనిషత్తు చెబుతోంది. జీవులలో చైతన్యం నింపడం ద్వారా పోషక బాధ్యతలు నిర్వహిస్తున్నాడు సూర్యనారాయణుడు. సూర్యరశ్మి నుంచి పోషకాలు, విటమిన్లు లభిస్తాయి. సౌరశక్తి ఆధారంగానే సాంకేతికత కూడా అభివృద్ధి అవుతోంది. మానవ మనుగడకు, అభివృద్ధికి అన్నింటికీ సూర్యుడే దిక్కు.

ఆయన నారాయణ స్వరూపమై పోషక బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. సర్వసంగ పరిత్యాగి, యోగి, వీరమరణం పొందినవాడు మాత్రమే సౌరమండలాన్ని ఛేదించుకుని నేరుగా ముక్తిపథానికి వెళతారని పెద్దలు చెబుతారు. అలా సూర్యదేవుని లయకారకత్వం కూడా నిరూపితమైంది. అన్నింటికీ మించి యోగ్యత, అయోగ్యతల ప్రస్తావన లేకుండా అందరికీ సమానంగా వెలుగులు పంచే మహాదాత, ప్రత్యక్ష దైవం సూర్యుడు. అందుకే రథసప్తమినాడు ఆయనను ఆరాధించి కృతజ్ఞతలు చెప్పుకోవడం మన విధి.

రథసప్తమి విధులు

రవి మకరరాశిలో ఉండగా వచ్చే సప్తమికి 'మకరీ' అని పేరు. ఆరోజు నుంచి సూర్యుని కిరణాలు నేలపై పుష్కలంగా పడతాయి. ఆ సౌరశక్తి ప్రధానంగా జిల్లేడు, చిక్కుడు, రేగు చెట్లలోనూ, పారే నీటిలోనూ ఉంటుందంటారు. అందుకే రథసప్తమినాడు చేసే స్నానం ప్రత్యేకతను కలిగివుంటుంది. వ్రతచూడామణిలో రథసప్తమినాడు చేయాల్సిన స్నానవ్రతాన్ని గురించి వివరణ ఉంది. ఆనాడు అరుణోదయ వేళకంటే ముందుగా నెయ్యి లేదా నువ్వులనూనెతో దీపం వెలిగించాలి. ఆ దీపాన్ని ఆరిపోకుండా భద్రంగా కాపాడుకుంటూ, నదీతీరానికి గానీ, చెరువుల వద్దకు గానీ వెళ్లి, సూర్యప్రీతికోసం నీటిలో వదలాలి. తరువాత స్నానం చేసేటప్పుడు జిల్లేడు ఆకులు, రేగుపళ్లు తలపై ఉంచుకోవాలి.

**జననీ సర్వలోకానాం సప్తమీ సప్తసప్తికే
సప్తవ్యాహృతికే దేవీ నమస్తే సూర్యమండలే**

అంటూ సూర్యమండలాన్ని అర్చించి నమస్కరించాలి. సప్తమి తిథి దేవతకు, సూర్యమండలంలోని ఇతర దేవతలకూ కూడా అర్ఘ్యమివ్వాలి. రథసప్తమినాడు ఇలా చేయడం వల్ల తేజస్సు, ఐశ్వర్యం, ఆరోగ్యం వృద్ధి చెందుతాయి. చర్మరోగాలు నశిస్తాయి. జన్మాంతరాల్లో చేసిన సప్త విధాలైన పాపాలు హరిస్తాయి.

రథసప్తమినాడు అరుణపారాయణంతో సూర్యనమస్కారాలు చేస్తారు. ఆదిత్యహృదయం, సూర్యాష్టకం వంటివి పఠిస్తారు. మంచిగంధంతో పద్మం వేసి, ద్వాదశాదిత్యులను ఆవాహనచేసి పూజించడం మంచిది. ఎర్రని పూలతో, ఎర్రచందనంతో భాస్కరుని అర్చించడం వల్ల విశిష్ట ఫలితాలు పొందగలుగుతారు. ఆవుపేడతో చేసిన పిడకల మంటపై ఆవుపాల పాయసాన్ని తయారుచేయాలి. చిక్కుడు కాయలతో సూర్యరథం సిద్ధం చేయాలి. చిక్కుడాకుల్లో పాయసం వడ్డించి సూర్యుని ప్రకాశం తగిలేచోట తులసిచెట్టువద్ద సూర్యరథానికి నివేదన చేయాలి. ఆ ప్రసాదాన్ని చిక్కుడాకుల్లోనే భుజించాలి.


- కె. పూర్ణప్రజ్ఞాభారతి

ఆదిత్య వందనం

1 ఓం ప్రాం మిత్రాయ నమ:
2 ఓం ప్రీం రవయే నమః
3 ఓం ప్రూం సూర్యాయ నమః
4 ఓం ప్రైం భానవే నమః
5 ఓం ప్రౌం ఖగాయ నమః
6 ఓం ప్రః పూష్ణే నమః
7 ఓం ప్రాం హిరణ్యగర్భాయ నమః
8 ఓం ప్రీం మరీచయే నమః
9 ఓం ప్రూం ఆదిత్యాయ నమః
10 ఓం ప్రైం సవిత్రే నమః
11 ఓం ప్రౌం అర్కాయ నమః
12 ఓం ప్రః భాస్కరాయ నమః

నమస్కార ప్రియ భానునికి ఈ బీజమంత్రాలను ఉచ్చరిస్తూ సూర్యోదయ వేళ ఎవరైనా సరే, శుచిగా వందనం చేస్తే శుభఫలితాలు కలుగుతాయి.

దైవానికి కృతజ్ఞత



పూర్వం ఇస్రాయిల్ సంతతిలో ఒక కుష్టురోగి, ఒక బట్టతలవాడు, ఒక అంధుడు ఉండేవారు. దేవుడు వారిని పరీక్షించదలిచి ఒక దైవదూతను పంపాడు. ఆ దైవదూత మొట్టమొదట కుష్టురోగి వద్దకు వెళ్లి, 'నీకు అన్నింటికంటే ఎక్కువ ఇష్టమైన వస్తువేది?' అని అడిగాడు. దానికా కుష్టురోగి, 'అందమైన రంగు, చర్మం. ముందు ఈ వ్యాధిపోవాలి. దీని మూలంగానే జనం నన్ను అసహ్యించుకుంటున్నారు' అన్నాడు. దైవదూత అతని శరీరాన్ని స్పృశించాడు. అతని రూపం అతడు కోరుకున్నట్లుగానే మారింది. తరువాత దైవదూత, 'నీకెలాంటి సంపద అంటే ఇష్టం?' అని అడిగాడు మళ్లీ. దానికా వ్యక్తి, 'నాకు ఒంటెలంటే ఇష్టం అని అన్నాడు. వెంటనే అతనికి పదినెలల సూడి ఒంటెలు లభ్యమయ్యాయి. దైవదూత అతణ్ణి ఆశీర్వదిస్తూ, దేవుడు నీ పశుసంపదలో శుభాభివృద్ధులు ప్రసాదించుగాక!' అన్నాడు.

ఆ తరువాత అదే విధంగా దైవదూత బట్టతల వాడికి అందమైన శిరోజాలను, ఆవులను ప్రసాదించాడు. అంధుడికి కంటిచూపును, మేకలను ప్రసాదించాడు. దైవదూత ఇచ్చిన ఒంటెలు, ఆవులు, మేకలు ఈనిన తరువాత వారివద్ద మందలు మందలుగా పశుసంపద వృద్ధి చెందింది.

కొంతకాలం గడిచిపోయింది.

ఆ దైవదూత ఇదివరకటి లాగే మానవాకారంలో ఒకప్పటి కుష్టురోగి దగ్గరకు వచ్చి, 'అయ్యా నేనొక పేదవాణ్ణి. ప్రయాణంలో నా సాధన సంపత్తి అంతా పోయింది. ఇప్పుడు నేను దేవుని దయ, నీ సహాయం లేకుండా ఇంటికి చేరుకోలేను. నీకు అందమైన దేహం, రూపం, సిరిసంపదలు ప్రసాదించిన దేవుని పేరుతో అర్థిస్తున్నాను. నాకొక ఒంటెను దానం చెయ్యి. దాని మీదెక్కి నేను ఇంటికి చేరుకుంటాను' అన్నాడు. గత జీవితాన్ని పూర్తిగా విస్మరించి అర్థంతరంగా అబ్బిన సంపదతో మత్తెక్కిన ఆ ఒంటెలవాడు, 'ప్రస్తుతం నా బాధ్యతలు, ఖర్చులు బాగా పెరిగిపోయాయి. నేను నీకు ఎలాంటి సహాయం చేయలేను' అన్నాడు. దైవదూత ఆ మాటలు విని, 'బహుశా నేను నిన్ను గుర్తు పట్టాననుకుంటా. నీవు గతంలో కుష్టురోగిగా ఉండేవాడివి కదూ? దానివల్ల జనం నిన్ను అసహ్యించుకునేవారు. నువ్వు పేదవాడిగా ఉంటే, దేవుడు నీకు ఈ సంపద ప్రసాదించాడు. ఔనా' అని అడిగాడు.

అందుకా కుష్టురోగి అంగీకరించకుండా, 'ఈ సంపదంతా నాకు వారసత్వంగా వచ్చింద'ని సమాధానమిచ్చాడు. దైవదూత అతని మాటలు ఆలకించి, 'నువ్వు చెప్పింది అబద్ధమయితే దేవుడు నిన్ను పూర్వస్థితికి తెచ్చుగాక!' అని శపించి వెళ్లిపోయాడు.

ఒంటెల యజమాని కాస్తా మళ్లీ కుష్టువ్యాధి గ్రస్తుడయ్యాడు. అదేవిధమైన సమాధానమిచ్చిన ఆవుల యజమాని కూడా మళ్లీ బట్టతలవాడైపోయాడు. అక్కడినుంచి దైవదూత పేదవానిలా అంధుని వద్దకు వెళ్లి సాయం అడిగాడు. దానికా అంధుడు సమాధానమిస్తూ, 'నేను అంధునిగా ఉన్నప్పుడు దేవుడు నాకు దృష్టినిచ్చాడు. నన్ను ధనికుని చేశాడు. నేనాయన పట్ల కృతజ్ఞతతో అల్లాహ్ పేరుతో ఇస్తున్నాను. నా ఆస్తిలో నీవు కోరుకున్నది తీసుకునే అధికారం నీకిస్తున్నాను' అన్నాడు. అందుకు సంతోషించిన దైవదూత 'ఇదొక పరీక్ష మాత్రమే. నీలాగే నిరుపేదలుగా, అనేక కష్టాలు పడుతూ ఉన్నప్పుడు దైవం చేసిన సహాయాన్ని మరిచిపోయిన నీ సహచరులిద్దరూ దైవానుగ్రహానికి గురయ్యారు. నీవు దైవం పట్ల కృతజ్ఞత చెల్లించడం నా మనసుకు ఆనందాన్నిచ్చింది. నీ సంపద వల్ల నీకు సకల శుభాలూ చేకూరుగాక!' అని ఆశీర్వదించాడు.

- మూలం : మహాప్రవక్త మహితోక్తులు

ఆశల పల్లకిలో సింధు, శ్రీకాంత్



- నేటి నుంచి ఇండోనేషియా మాస్టర్స్ క్వాలిఫయింగ్
- బుధవారం నుంచి మెయిన్ డ్రా

జకార్తా: హైదరాబాద్ స్టార్ షట్లర్లు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్ ఈ ఏడాది కొత్త సీజన్‌ను ఆశావహంగా ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం ఇక్కడ ప్రారంభం కానున్న ఇండోనేషియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నీతో ఈ ఏడాది బ్యాడ్మింటన్ బిజీ క్యాలెండర్ మొదలవుతోంది. అయితే ఈ సీజన్ తొలి టోర్నీలో టైటిల్ గెలవడంపై సింధు, శ్రీకాంత్ దృష్టి పెట్టారు. గతేడాది అనేక టైటిళ్లు గెలిచి సింధు, శ్రీకాంత్ సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మహిళల తొలి రౌండ్‌లో ఇండోనేషియాకు చెందిన హన్నా రమదినితో సింధు, మలేషియాకు చెందిన జుల్ఫద్లి జుల్కిఫ్లితో శ్రీకాంత్ ఆడనున్నారు. గత సీజన్‌లో సింధు మూడు టైటిళ్లు, మూడు రజత పతకాలు గెలిచింది. కాగా శ్రీకాంత్ అందరి అంచనాలను అందుకుని నాలుగు సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచాడు. ఒకసారి రన్నరప్‌గా నిలిచాడు. ఈ ఇద్దరు స్టార్ షట్లర్లు ఈ కొత్త సీజన్‌లోనూ అదే జోరును కొనసాగిస్తారని అభిమానులు ఆశిస్తున్నారు.

ఇటీవల ముగిసిన ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో సింధు అద్భుత ఫామ్‌ను కనబరిచింది. కొరియాకు చెందిన సంగ్ జి హ్యూన్ చేతిలో మాత్రమే ఆమె ఓటమిపాలైంది. కానీ శ్రీకాంత్ చైనీస్ తైపీకి చెందిన జు వీ వాంగ్, సహచరులు హెచ్‌ఎస్ ప్రణయ్, బి. సాయి ప్రణీత్ చేతుల్లో ఓటమిపాలయ్యాడు. మడమ గాయం నుంచి కోలుకున్న లండన్ గేమ్స్ కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 8వ ర్యాంక్ షట్లర్ చెన్ యుఫీతో ఆడనుంది. గత



సీజన్‌లో సైనా ఏకైక పతకం వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచింది. కెరీర్‌లో అత్యుత్తమ ప్రపంచ 10వ ర్యాంక్ సాధించిన హెచ్‌ఎస్ ప్రణయ్ గతేడాది మిరుమిట్లుగొలిపే ప్రతిభను కనబరిచాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రణయ్ డెన్మార్క్‌కు చెందిన మాస్మస్ గెమ్కెతో, సమీర్ వర్మ జపాన్‌కు చెందిన కజుమస సకాయ్‌తో ఆడనున్నారు. పీబీఎల్‌లో ప్రణయ్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. అయితే వరుసగా 10 మ్యాచ్‌ల విజయ పరంపరకు థాయ్‌లాండ్‌కు చెందిన టి. సెన్సామ్‌బూన్సక్ బ్రేక్ వేశాడు. అంతేకాకుండా సెమీఫైనల్లో ప్రపంచ నంబర్ విక్టర్ యాక్సెల్‌సెన్ చేతిలో ప్రణయ్ ఓటమిపాలు కావడంతో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్ జట్టు పోరు ముగిసింది.

పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్ రాంకీ రెడ్డి, చిరాగ్ శెట్టి జంట జపాన్‌కు చెందిన టకుటొ ఇంక్యూ, యుకి కనెకొ జోడీతో, మను అత్రి, బి. సుమీత్ రెడ్డి జంట చైనీస్ తైపీకి చెందిన లు చింగ్ యావో, యాంగ్ పొ హాన్ ద్వయంతో తలపడతాయి. మంగళవారం క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు జరగనుండగా.. బుధవారం మెయిన్ డ్రా మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. అయితే ఈ క్వాలిఫయింగ్ పోటీల్లో కామన్వెల్త్ గేమ్స్ చాంపియన్ పారుపల్లి కశ్యప్ ఇండోనేషియాకు చెందిన షెసర్ హిరెన్ రుస్తవిటోతో, సౌరభ్ వర్మ ఇండోనేషియాకే చెందిన సోని డ్వి కుంకొరొతో, శుభాంకర్ డే స్థానిక షట్లర్ అహ్మద్ మౌలానాతో ఆడనున్నారు.

12 SPORTS హైదరాబాద్
మనం స్పోర్ట్స్
మంగళవారం, 23 జనవరి, 2018
www.manamnews.com

ఖేలో ఇండియా

- యువతకు ప్రధాని, క్రీడల మంత్రి, ఒలింపియన్స్ పిలుపు

న్యూఢిల్లీ: యువత పెద్ద ఎత్తున క్రీడల్లో పాల్గొనేలా చేసేందుకు కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ నిర్వహించ తలపెట్టిన ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ (కేఐఎస్‌జీ) తొలి ఎడిషన్‌కు అన్ని ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు జరగనున్న ఈ క్రీడలకు 16 వేదికలతో కూడిన టీజర్‌ను సోమవారం మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోవడంలో క్రీడల ప్రాముఖ్యతపై ప్రధాని నరేంద్ర మోదీ ఇందులో వివరించారు. అంతేకాకుండా కేఐఎస్‌జీలో పాల్గొనమని యువ వ్యవహారాలు, క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ పిలుపునిస్తారు. రాథోడ్‌తో పాటు జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, ఒలింపిక్ పతక విజేతలు పీవీ సింధు, సాక్షి మాలిక్, ఎంసీ మేరీ కోమ్, లియాండర్ పేస్, 2016 రియో ఒలింపియన్ దీపా మాలిక్, ఒలిపింక్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్, ఇండియన్ ఫుట్‌బాల్ కెప్టెన్ సునీల్ ఛెత్రి, భారత హాకీ మాజీ కెప్టెన్ సర్దార్ సింగ్ కూడా ఈ టీజర్‌లో కనిపిస్తారు. జాతీయ క్రీడల అభివృద్ధి కార్యక్రమంలో భాగమైన ఖేలో ఇండియా ఏడాదికోసారి జరుగుతుంది. ఇది యువతను క్రీడల పట్ల ఆకర్షించడంతో పాటు వారిలో ఆసక్తి పెంచుతుంది. వారిలోని ప్రతిభను వెలికి తీస్తుంది. అయితే ఈ తొలి కేఐఎస్‌జీ 17 ఏళ్ల లోపు వయస్కులకు నిర్వహిస్తారు. 16 క్రీడాంశాల్లో ఢిల్లీలోని పలు వేదికల్లో ఈ పోటీలు జరగనున్నాయి. ఖేలో ఇండియాలో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచిన 1000 మంది యువతీ యువకులకు ఎనిమిదేళ్ల పాటు ఏడాది రూ. 5 లక్షల చొప్పున స్కాలర్‌షిప్ ఇస్తారు. ప్రతి ఏడాది కొత్త వారిని ఈ స్కీంలోకి చేరుస్తారు. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో పతక ఆశావహులను ఈ గేమ్స్‌లో గుర్తించేందుకు కేఐఎస్‌జీ తొలి మెట్టుగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. కేఐఎస్‌జీకి రూ. 35 కోట్లు ఖర్చవుతాయని అంచనా.



సియెట్‌తో హర్మన్‌ప్రీత్ ఒప్పందం

న్యూఢిల్లీ: సియెట్‌తో బ్యాట్ ఎండార్స్‌మెంట్ పై సంతకం చేసిన భారత తొలి మహిళా క్రికెటర్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ నిలిచింది. గతేడాది ఐసీసీ మహిళల వరల్డ్ కప్‌లో భారత జట్టు ఫైనల్‌కు చేరుకోవడంతో హర్మన్‌ప్రీత్ కీలకపాత్ర పోషించిన సంగతి తెలిసిందే. సియెట్‌తో రెండేళ్ల ఒప్పందం కుదుర్చుకోవడంతో రోహిత్ శర్మ, అజింక్య రహానే, ఇషాన్ కిషన్ సరసన హర్మన్‌ప్రీత్ నిలిచింది. ఇక నుంచి అన్ని ఫార్మాట్లలో హర్మన్‌ప్రీత్ బ్యాట్‌పై సియెట్ స్టిక్కర్ కనిపించనుంది. 'భారత ప్రముఖ క్రికెటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న సియెట్‌లో ఒప్పందం కుదుర్చుకోవడం చాలా ఆనందంగా ఉంది. 2017లో మాదిరిగానే ఈ ఏడాది కూడా స్థిరంగా రాణిస్తూ జట్టుకు అండగా నిలుస్తానని భావిస్తున్నాను' అని హర్మన్‌ప్రీత్ చెప్పింది. భారత మహిళల జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న హర్మన్‌ప్రీత్ మూడు ఫార్మాట్లలో నిలకడగా రాణిస్తోంది.

ప్రీ క్వార్టర్‌లో ఓటమి



జొకోవిచ్‌కు షాక్

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్

మెల్‌బోర్న్: ఒకప్పుడు తిరుగులేని ఆటగాడిగా కొనసాగిన సెర్బియా ప్లేయర్ నోవక్ జొకోవిచ్ ఇప్పుడు కనీసం క్వార్టర్ ఫైనల్ వరకు కూడా చేరుకోలేకపోతున్నాడు. మోచేతి గాయం సమస్యలతో బాధపడుతున్న జొకోవిచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టోర్నీలో నాలుగో రౌండ్‌లోనే నిష్క్రమించాడు. ఈ మ్యాచ్‌లో కొరియాకు చెందిన 21 ఏళ్ల కుర్రాడు హియాన్ చుంగ్ 7-6, 7-5, 7-6తో వరుస సెట్లలో జొకోవిచ్‌ను ఓడించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ మ్యాచ్‌లో హియాన్ చుంగ్.. జొకోవిచ్ బలమైన షాట్లను సమర్థవంతంగా అడ్డుకున్నాడు. మళ్లీ అంతే బలంగా కొట్టాడు. ఈ టోర్నీలో ఆడేందుకు తన శరీరం ఏమేరకు సహకరిస్తుందో, ఎన్ని మ్యాచ్‌లు ఆడగలనో అనుకుంటూ జొకోవిచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలోకి దిగాడు. ఎందుకంటే గతేడాది వింబుల్డన్‌లో మోచేతి గాయానికి గురైన జొకోవిచ్ ఆ తర్వాత టెన్నిస్ కోర్టులోకి దిగడం ఇదే తొలిసారి. తొలి మూడు రౌండ్ల మ్యాచ్‌ల్లో జొకోవిచ్ ఆటపై ఎవ్వరికీ అంతు చిక్కలేదు. సరిచేసుకున్న సర్వీస్ యాక్షన్‌ను చూసి అందరూ ఆశ్చర్యపోయారు. కానీ తొలి సెట్‌లో స్కోరు 7-4తో ఉన్నప్పుడు జొకోవిచ్ ఫిజియోను పిలవడంతో అతని మోచేయి గాయం పూర్తిగా నయం కాలేదని అప్పుడు అందరికీ తెలిసింది. ఆ నొప్పి మొదలైన తర్వాత జొకోవిచ్ రెండో సెట్‌లో వరుసగా మూడు గేమ్‌లు కోల్పోయాడు. అంతేకాదు ప్రత్యర్థి కొట్టిన చాలా షాట్స్‌ను అందుకోలేకపోయాడు.



క్వార్టర్స్‌లో ఫెదరర్, హాలెప్, కెర్బర్

ప్రపంచ టెన్నిస్ మాజీ రారాజు రోజర్ ఫెదరర్ 14వసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. సోమవారమిక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ నాలుగో రౌండ్ మ్యాచ్‌లో ఫెదరర్ 6-4, 7-6 (7/3), 6-2తో మార్టన్ ఫక్సోవిక్స్‌ను ఓడించాడు. 36 ఏళ్ల ఈ స్విస్ దిగ్గజం 2004 వరకు ప్రతి ఏడాది క్వార్టర్ ఫైనల్ వరకు ఆడాడు. 2015 నుంచి సరిగా ఆడలేకపోతున్నాడు. అయితే క్వార్టర్ ఫైనల్లో థామస్ బెర్డిచ్‌తో ఫెదరర్ తలపడనున్నాడు. బెర్డిచ్ 2014, 2015లలో సెమీఫైనల్ వరకు ఆడాడు. అయితే ఈ టోర్నీలో బెర్డిచ్ 6-1, 6-4, 6-4తో ఇటలీకి చెందిన ఫాబియో ఫొగ్నినిపై గెలిచి ఫెదరర్‌తో పోటీకి సిద్ధమయ్యాడు.

మహిళల విభాగంలో టాప్ సీడ్ సీమోనా హాలెప్ కూడా క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. నాలుగో రౌండ్ మ్యాచ్‌లో హాలెప్ 6-3, 6-2తో జపాన్‌కు చెందిన నయోమి ఒసాకాను ఓడించింది. మరో మ్యాచ్‌లో ఏంజెలిక్ కెర్బర్ 4-6, 7-5, 6-2తో చైనీస్ తైపీకి చెందిన సీ సు వీపై పోరాడి గెలిచింది. అయితే ఈ చైనీస్ తైపీ ప్లేయర్ ప్రపంచ 3వ ర్యాంక్ ప్లేయర్ గార్బైన్ ముగురుజను, ప్రమాదకరమైన అగ్నిస్కా రద్వాన్‌స్కా ను ఓడించి నాలుగో రౌండ్‌కు చేరుకుంది. ఇక క్వార్టర్ ఫైనల్లో యూఎస్‌ఏకు చెందిన మాడిసన్ కీస్‌తో కెర్బర్ తలపడుతుం ది. మరో మ్యాచ్‌లో మాడిసన్ కీస్ 6-3, 6-2తో ఫ్రాన్స్‌కు చెందిన కరోలిన్ గార్సియాను చిత్తు చేసింది.

బోపన్న, శరణ్ జోడీల ఓటమి

భారత్‌కు చెందిన రోహన్ బోపన్న, దివిజ్ శరణ్ జోడీలు తమ తమ పురుషుల డబుల్స్ మ్యాచ్‌ల్లో ఓటమిపాలయ్యాయి. మూడో రౌండ్ మ్యాచ్‌లో బోపన్న, ఎడ్వర్డ్ రోజర్-వస్సెలిన్ జంటపై 6-4, 6-7 (5), 3-6తో ఒలివర్ మరాచ్, మటె పవిక్ జోడీ గెలిచింది. దాదాపు రెండు గంటల పాటు ఈ మ్యాచ్ కొనసాగింది. అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో శరణ్, రాజీవ్ రామ్ జంట 3-6, 6-7 (4), 4-6తో లూకాస్ కుబోట్, మార్సెలో మెలో ద్వయం చేతిలో ఓటమిపాలైంది.





మూడో టెస్టుకు రాహుల్ అనుమానమే


- ఓపెనర్ మోకాలికి గాయం

జొహన్నెస్‌బర్గ్: ఓపెనర్ కేఎల్ రాహుల్ ఇండియా, సౌతాఫ్రికా మధ్య జరగనున్న మూడో టెస్టులో ఆడటం అనుమానంగా మారింది. ఆదివారం జరిగిన నెట్ ప్రాక్టీస్‌లో ఇషాంత్ శర్మ వేసిన బంతి మోకాలికి తగలడంతో రాహుల్ గాయపడ్డాడు. ప్యాడ్‌కు, తై గార్డ్‌కు మధ్య బంతి తగలడంతో రాహుల్ అక్కడే కూర్చుండిపోయాడు. అయితే ఐస్ బ్యాగ్ పెట్టిన కాసేపటికి రాహుల్ నెట్ ప్రాక్టీస్‌ను పూర్తి చేశాడు. అతనికి కలిగిన గాయం తీవ్రతపై అధికారులెవ్వరూ స్పందించలేదు. 21 ఏళ్ల ఈ కర్ణాటక బ్యాట్స్‌మన్ తన కెరీర్ అంతా గాయాలతోనే సతమతమవుతున్నాడు. గాయాల కారణంగా అనేక మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. అయితే ఈసారి అతని గాయం అంత తీవ్రంగా ఏమీ లేదని కెప్టెన్ విరాట్ కోహ్లీ భావిస్తున్నాడు. ఈ సిరీస్ అంతటిలో టీమిండియా బలమైన ఓపెనింగ్ భాగస్వామ్యం కోసం ఇబ్బందులు పడుతోంది. ఒకవేళ మూడో టెస్టుకు రాహుల్ పూర్తిగా కోలుకోకపోతే మురళీ విజయ్‌తో శిఖర్ ధావన్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశముంది. కేప్‌టౌన్‌లో జరిగిన తొలి టెస్టులో ధావన్ సరిగా ఆడకపోవడంతో రెండో టెస్టుకు అతడిని ఎంపిక చేయలేదు. ధావన్ స్థానంలో వచ్చిన రాహుల్ కూడా రెండో టెస్టులో పెద్దగా ప్రభావం చూపలేదు. మూడు మ్యాచ్‌ల ఈ టెస్టు సిరీస్‌ను టీమిండియా 0-2తో కోల్పోయింది.



ప్రాక్టీస్ పిచ్‌పై అసంతృప్తి

జొహన్నెస్‌బర్గ్: టీమిండియాలోని చాలా మంది క్రికెటర్లు సోమవారం వాండరర్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ఆడటంలో బిజీగా ఉన్నారు. అయితే మహ్మద్ షమీ, భువనేశ్వర్ కుమార్, ఇషాంత్ శర్మ, ఉమేష్ యాదవ్‌లతో బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయిస్తున్నారు. అయితే నాసిరకంగా ఉన్న ఈ ప్రాక్టీస్ పిచ్‌పై అసంతృప్తి చెందిన బంగర్ వెంటనే ప్రధాన కోచ్ రవిశాస్త్రికి తెలియజేశారు. తర్వాత శాస్త్రి చీఫ్ క్యూరేటర్ బుటుయెల్ బుథెలెజిని పిలిచి పిచ్‌పై మరోసారి రోలర్‌ను దొర్లించమని అడిగారు. తర్వాత బుథెలెజి, శాస్త్రి కాసేపు మాట్లాడుకున్నారు. తర్వాత పిచ్‌పై రోలర్‌ను దొర్లించడం అవసరమా అని బంగర్‌ను శాస్త్రి అడిగారు. దానికి బంగర్ సమాధానమిస్తూ.. మొత్తం మూడు పిచ్‌లపై రోలర్‌ను దొర్లించాలని.. ఒకదాని తర్వాత మరికదానిపై శిక్షణ జరుగుతుందని చెప్పారు. ఆసక్తికరమైన అంశమేంటంటే.. అంపైర్లు అలీమ్‌దార్, ఇయాన్ గోల్డ్ నెట్స్‌లో తమ అంపైరింగ్ ప్రతిభకు పదును పెట్టుకున్నారు. తర్వాత కెప్టెన్ విరాట్ కోహ్లీ అంపైర్ ఇయాన్ గోల్డ్‌తో కాసేపు మాట్లాడాడు. ఆదివారం వాండరర్స్ స్టేడియం పిచ్‌ను టీమిండియా నిశితంగా పరిశీలించింది. ముందుగా కోచ్ రవిశాస్త్రి పిచ్ దగ్గరకు వెళ్లి పరీక్షించారు. తర్వాత బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ కూడా పరిశీలించారు. అయితే టీమిండియా క్రికెటర్లందరూ పిచ్ దగ్గరకు వెళ్లి పరిశీలించడం ఆసక్తిగా మారింది. అయితే ఈ పిచ్‌ను కూడా ఫాస్ట్, బౌన్సీ పిచ్‌గా భారత క్రికెటర్లకు అందిస్తామని సౌతాఫ్రికా కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్ అన్నాడు.



మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ హోం గ్రౌండ్ బాంద్రా కుర్లా కాంప్లెక్స్ మైదానంలో సోమవారం భారత మహిళల జట్టును కలిసిన క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్. త్వరలో మహిళల జట్టు టీ20, వన్డే సిరీస్‌ల కోసం సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది

కోహ్లీ గొప్పవాడేం కాదు: హోల్డింగ్

న్యూఢిల్లీ: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ తన బలమైన ఇన్నింగ్స్‌తో ఐసీసీ వార్షిక అవార్డుల్లోని ప్రతిష్టాత్మకమైన వాటన్నింటినీ అన్ని ఫార్మాట్లలో సొంతం చేసుకున్నాడు. అయినప్పటికీ కోహ్లీ బాగా ఆడగలడని కానీ క్రికెట్ దిగ్గజాల జాబితాలో చేరాలంటే అతను ఇంగ్లండ్‌లోనూ పరుగులు చేయాలని వెస్టిండీస్ దిగ్గజం మైకెల్ హోల్డింగ్ అన్నారు. ప్రపంచ టాప్-3 బ్యాట్స్‌మెన్‌లో కోహ్లీని ఒకడిగా ఆయన భావించారు. మిగిలిన ఇద్దరు ఇంగ్లండ్‌కు చెందిన జో రూట్, ఆస్ట్రేలియాకు చెందిన స్టీవ్ స్మిత్. హోల్డింగ్ ప్రకారం గ్రేట్ బ్యాట్స్‌మన్ ఎక్కడైనా పరుగులు చేస్తారు. కానీ కోహ్లీ అలా చేయడం లేదని హోల్డింగ్ చెప్పారు.

మా నిర్ణయం సరైనదే: శాస్త్రి

జొహన్నెస్‌బర్గ్: సౌతాఫ్రికాతో జరిగిన రెండు టెస్టులకు అజింక్య రహానేను పక్కన పెట్టాలన్న టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయాన్ని ప్రధాన కోచ్ రవిశాస్త్రి సమర్థించారు. ఫామ్ ప్రకారంగా రోహిత్ శర్మను ఆడించామన్నారు. ఇటీవలి కాలంలో విదేశాల్లో విజయవంతంగా రాణించిన టీమిండియా వైస్ కెప్టెన్ రహానేను కేప్‌టౌన్‌లో జరిగిన తొలి టెస్టుకు, సెంచూరియన్‌లో జరిగిన రెండో టెస్టుకు ఎంపిక చేయలేదు. ప్రస్తుత ఫామ్ ఆధారంగా నిర్ణీత ఓవర్ల స్పెషలిస్ట్ రోహిత్‌ను ఆడించాలని జట్టు మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకుంది. అయితే అంచనాలను అందుకోవడంలో రోహిత్ విఫలమయ్యాడు. అంతేకాకుండా సౌతాఫ్రికా పేస్ అటాక్‌ను ఎదుర్కోలేకపోయిన టీమిండియా అసమర్థతపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో మూడో టెస్టుకు రహానేను తీసుకునే ఆలోచనలో పడింది టీమ్ మేనేజ్‌మెంట్. 'ఒకవేళ తొలి టెస్టుకు రహానేను ఎంపిక చేసి.. అతను సరిగా ఆడక పోయివుంటే కూడా.. రోహిత్‌ను ఎందుకు తీసుకోలేదు అని మీరు ఇదే ప్రశ్న అడిగే వాళ్లు. రోహిత్ ఆడాడు. అతను సరిగా రాణించలేదు కాబట్టే రహానేను ఎందుకు ఆడించలేదని మీరు అడుగుతున్నారు. ఫాస్ట్ బౌలర్ల విషయంలోనూ ఇదే జరిగివుండేది. కనుక బెస్ట్ ఆప్షన్‌పై మేనేజ్‌మెంట్ చర్చించింది. దానికే కట్టుబడి ఉంది. అదే ఆచరణలో పెట్టింది. విదేశాల్లో ప్రస్తుతం ఫామ్ ఆధారంగా, పరిస్థితుల ఆధారంగా జట్టును ఎంపిక చేస్తారు. ఇక్కడి పరిస్థితులకు ఎవరు తొందరగా అలవాటు పడతారనేదే చూస్తాం' అని జట్టు సెలక్షన్‌పై అడిగిన ప్రశ్నకు సమాధానంగా శాస్త్రి చెప్పారు. అయితే ఆది, సోమవారాల్లో వాండరర్స్ స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ సెషన్స్ చూస్తే మూడో టెస్టులోనూ రహానే ఆడే సూచనలు కనిపించడం లేదు.



దినేష్ ఇన్.. పార్థివ్ అవుట్

జొహన్నెస్‌బర్గ్: చాలా కాలం తర్వాత సెంచూరియన్ టెస్టు మ్యాచ్‌లో 32 ఏళ్ల పార్థివ్ పటేల్‌కు మళ్లీ అవకాశమొచ్చింది. నిజం చెప్పాలంటే జట్టులో స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు పార్థివ్ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. అయితే తన తలరాత మారలేదు. రెండో టెస్టు మ్యాచ్‌లో పార్థివ్ సాధారణ ప్రతిభ కనబరిచాడని.. బాధ్యతగా ఆడలేదని సెంచూరియన్ టెస్టు మ్యాచ్ ముగిసిన తర్వాత జరిగిన జట్టు సమావేశంలో సీనియర్ సభ్యుడొకరు చెప్పినట్టు తెలిసింది. ఇంకేముంది పార్థివ్‌కు టెస్టు జట్టులో చోటు లేనట్టే. ఇతని స్థానంలో దినేష్ కార్తీక్‌ను చివరి, మూడో టెస్టుకు తీసుకునే అవకాశముంది. జొహన్నెస్‌బర్గ్ చేరుకున్న కార్తీక్ ఉత్సాహంగా నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.